
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
గురువారం 31 ఆగస్టు 2017 | 16





# మీ ఇల్లు భద్రం

- పోలీసు కెమెరాతో నిఘా కట్టుదిట్టం
- దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు
- లాక్‌డ్ మానిటరింగ్ సిస్టం యాప్‌తో..
- 9 మున్సిపాలిటీల్లో అమలుకు సన్నాహాలు
- జిల్లాకు చేరిన యాభై కెమెరాలు

కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతారామ్‌నగర్‌కు చెందిన ఓ వడ్డీ వ్యాపారి హైదరాబాద్ వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంట్లో చోరీ జరిగింది. రూ.20 లక్షల మేర నగదు, భారీగా బంగారు నగలు అపహరించారు. కేసులో ఇంతవరకు పురోగతి లేదు. ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా కోకొల్లలు. 'చోరీలు బారెడు.. రికవరీలు బెత్తెడు' అన్న చందంగా పోలీసుల తీరు ఉంది. చోరీలను అరికట్టేందుకు పోలీసులు ఇటీవల కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. అదే లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని పోలీసులు అంటున్నారు.

పట్టపగలే..: నగరంలో మంగళవారం రెండిళ్లలో దొంగలు పడ్డారు. రామచంద్రనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం కోటీశ్వరుడు అనే వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 90 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లారు. కృష్ణానగర్‌లో వాణి అనే టీచర్ ఇంట్లో 3 తులాల బంగారు నగలు, రూ.15 వేల నగదు చోరీ చేశారు.



సెంటర్ స్ప్రెడ్‌లో..

# కృష్ణమ్మకు అంత్య పుష్కర శోభ



సంగమేశ్వరంలో సెప్టెంబరు 11 వరకు.. 16

క్షేత్రంలో నేటి నుంచి వరుణ యాగం

తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో..



గతనెలలో సీఎం చంద్రబాబు నంద్యాలకు వచ్చినప్పుడు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

# ఇక చంద్రన్న కర్తవ్యం

8

**సీఎం పిలుపునకు స్పందించిన నంద్యాల ఓటర్లు.. టీడీపీకి భారీ మెజారిటీ.. సుందర నంద్యాల బాధ్యత చంద్రబాబుదే**

హైదరాబాద్ మహానగరాన్ని అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో గుర్తింపు తీసుకొచ్చా. తమ్ముళ్లూ.. నన్ను నమ్మండి. నంద్యాల అభివృద్ధి పూచీ నాది. సుందర నంద్యాలగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా. మీరు చేయాల్సిందల్లా టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించడమే. మీ ఓటు టానిక్‌లా తీసుకుని రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తా.

ఈ నెల 19న నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో సీఎం చంద్రబాబు ప్రకటన ఇది.

నంద్యాల ఓటర్లు ప్రగతికి పట్టం కట్టారు. చంద్రన్న అడిగినట్లుగానే ఓటు టానిక్ అందించి 27,466 ఓట్ల భారీ మెజారిటీ ఇచ్చారు. ఇక చంద్రన్న కర్తవ్యం మిగిలింది. ఎన్నికల హామీ మేరకు సుందర నంద్యాల ఆవిష్కరణ దిశగా అడుగులు వేగంగా పడాలి. ఉప ఎన్నికకు ముందే చేపట్టిన ప్రగతి పనులు గడువులోగా పూర్తి చేయాలి. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి.

# నిమజ్జనానికి నీరు

రేపు కేసీ కాలువకు సుంకేసుల నుంచి విడుదల

ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ 2





పొలంలో రైతు నారాయణ మృతదేహం

# కాటేసిన కరెంటు తీగ

**పొలంలో విద్యుదాఘాతంతో రైతు మృతి**

**మరో ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం**

పొలంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. తీగలు తెగి పడ్డాయి. విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. చివరకు రైతే.. ఇద్దరు మనుషలతో తొలగిస్తుండగా మృత్యువు వెంటాడింది. 3

# రేపు కేసీకి నీరు విడుదల

**ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన కలెక్టర్**



**కర్నూలు(కలెక్టరేట్):** వినాయక నిమజ్జనానికి సుంకేసుల జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కలెక్టర్ సత్యనారాయణ ఇరిగేషన్ ఎస్‌ఈ చంద్రశేఖ రరావును ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ భవనంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 2న వినాయక నిమజ్జనం, బక్రీదు పండుగ కలిసి వస్తున్నందున ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నగర ప్రజల తాగునీటి అవసరాలకు ప్రతి రోజూ 60 క్యూసెక్కుల నీరు అవసరమని, ప్రస్తుతం ఉన్న నీరు 20 రోజులకు సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. సుంకేసుల జలాశయంలో 0.1 టీఎంసీల నీరు ఉన్నందు వల్ల సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం కేసీ కాలువకు నిమజ్జనం కోసం నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ చంద్ర శేఖర రావును కలెక్టర్ ఆదేశించారు. 2వ తేదీ ఉదయం నీరు చేరే సమయానికంతా కేసీ కెనాల్‌లో నిమజ్జన ప్రాంతంలో పారిశుధ్య పనులు పూర్తి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ హరినాథరెడ్డిని ఆదేశించారు. వినాయక విగ్రహాలను క్రమపద్ధతిలో నిమజ్జనం చేసేందుకు డీఎస్పీ, ఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి నీరు తగినన్ని ఉండేలా చూడటానికి కేసీ కాలువలో అడ్డంగా ఇసుక సంచులు ఏర్పాటు చేయాలని, లేదా మరేదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ ఎస్‌ఈని ఆదేశించారు. నగర ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, భక్తులకు తాగునీటి వసతి, వైద్య శిబిరాలు, నగర పారిశుధ్యం, నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రమణమూర్తి, ఆర్అండ్‌బీ ఈఈ జయరామిరెడ్డి, గణేష్ నిమజ్జన కేంద్ర సమితి కార్యధ్యక్షుడు కిష్టన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా ఎక్కడ?

**రెండు నెలలైనా గోదాములకు చేరని చంద్రన్న కానుక**

**డీలర్ల వద్ద సరుకులు ఉన్నట్లా లేనట్లా?**

**గోదాములకు తరలించడంలో అధికారులు విఫలం**

**కర్నూలు(కలెక్టరేట్):** రంజాన్ పండుగ వెళ్లిపోయి రెండు నెలలు దాటింది. చంద్రన్న రంజాన్ తోఫా పంపిణీ చేయగా మిగిలిన సగానికిపైగా సరుకులు గోదాములకు చేరలేదు. జూన్ 26 రంజాన్ సందర్భంగా ముస్లింలకు పంపిణీ చేయగా మిగిలిన రంజాన్ తోఫా కిట్లను జూలై మొదటి వారం నుంచి ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చాలని అధికారులు ఆదేశించారు. గోదాములకు చేరిన కిట్లను పరిశీలించి నాణ్యతగల వస్తువులను సంక్షేమ హాస్టళ్లకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ చివర్లో నంద్యాల ఉప ఎన్నిక నోటిఫికేషన్ రావడం.. జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా విధులపై వెళ్ళడంతో చంద్రన్న తోఫా కిట్లను ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశించిన రెండు నెలలు గడుస్తున్నా.. డీలర్ల నుంచి రంజాన్ తోఫా కిట్లను గోదాములకు చేరవేయలేదు. జిల్లాలోని 17 ఎంఎల్ఎస్ పాయింట్లలో దాదాపు 29,151 చంద్రన్న కిట్లు మిగిలిపోయాయి. వాటిలో దాదాపు 13,546 కిట్లు మాత్రమే గోదాములకు చేర్చగా మిగిలిన 15,605 కిట్లు ఇంకా చేరాల్సి ఉంది. సగానికిపైగా వస్తువులు డీలర్ల వద్ద నిలిచిపోయాయి. మిగిలిన తోఫా కిట్లు డీలర్ల వద్ద నిల్వ ఉన్నాయా..లేకపోతే ఆ వస్తువులకు సరిపడా నగదును డీలర్లు చెల్లించారా..? లేదంటే ఆ వస్తువులు పక్కదారి పట్టాయా? అనే విషయాన్ని తేల్చాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల 15,495 ప్యాకెట్ల నెయ్యి వృధా అయినట్లే. గోధుమ పిండి, పంచదార, సేమియాలు డీలర్ల వద్ద ఏమేరకు సురక్షితంగా ఉన్నాయో అర్థం కాని పరిస్థితి. గోదాములకు చేరడానికే రెండు నెలల సమయం పడితే ఇక హాస్టళ్లకు పంపిణీ చేసేందుకు ఇంకెంత సమయం పడుతోందో వేచి చూడాల్సిందే.

**● బ్యాలెన్స్ రంజాన్ తోఫా వస్తువుల వారీగా వివరాలు**

| వస్తువులు(ప్యాకెట్లలో) | మిగిలిన వస్తువులు | గోదాములకు చేరినవి | గోదాములకు చేరాల్సినవి |
|---|---|---|---|
| గోధుమ పిండి | 28,863 | 13,640 | 15,223 |
| పంచదార | 29,151 | 13,474 | 15,677 |
| సేమియాలు | 29,151 | 13,546 | 15,605 |
| నెయ్యి | 29,151 | 13,656 | 15,495 |
| బ్యాగ్‌లు | 24,018 | 9,524 | 14,494 |

# నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు దేశ వ్యాప్త గుర్తింపు

**ఏడాదిన్నర్రలో అద్భుత పరిశోధనా ఫలాలు**

**ఏడీఆర్ డాక్టర్ బి.గోపాల్‌రెడ్డి**

**నంద్యాల:** నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో వివిధ రకాల పంటలపై జరుగుతున్న పరిశోధనలు, పరిశోధన ఫలితాలు దేశ వ్యాప్త గుర్తింపు పొందాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ బి.గోపాల్‌రెడ్డి అన్నారు. 2016 ఫిబ్రవరి 3వ తేదీన ఆయన ఏడీఆర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఏడాదిన్నర కాలంలో ఆర్ఏఆర్ఎస్ సాధించిన ప్రగతిని తెలియజేయడానికి ఆయన బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అత్యల్ప వర్షపాతంగల కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలో నంద్యాల ప్రాంతీయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో వరి, పత్తి, పప్పు శనగ, పొద్దు తిరుగుడు, కొర్ర, పొగాకు, వేరుశెనగ తదితర పంటలతో పాటు మెట్ట వ్యవసాయంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. నంద్యాల పరిశోధనా స్థానానికి ఉత్తమ పరిశోధనా స్థానంగా ఏ గ్రేడ్, కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానానికి బీ గ్రేడ్ పురస్కారాలు వచ్చాయన్నారు. నంద్యాల సోనా వరి వంగడాన్ని కర్నూలు సోనాకు దీటుగా విడుదల చేశామని తెలిపారు. పప్పు శనగలో ఎన్‌బీఈజీ-47, పొద్దుతిరుగుడులో ప్రభాత్(ఎన్‌డీఎస్‌హెచ్-1012), వేరుశనగలో కదిరి అమరావతి అనే కొత్తవంగడాలను విడుదల చేశామని తెలిపారు. కొర్రలో స్వల్పకాలిక రకాలైన ఎన్ఏ-3223, 3222, జొన్నలో ఎస్‌జే-2647, ఎన్‌జే -2446 అనే వంగడాలు కూడా పరిశోధనలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రీయ కృషి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా ఆర్ఏఆర్ఎస్‌లో ప్రత్యేక భూసార పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అఖిల భారత జొన్న పరిశోధనా విభాగం ఆధ్వర్యంలో నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు కొత్త ప్రాజెక్టులు తన హయంలో రావడం గర్వంగా ఉందన్నారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ గోపాల్‌రెడ్డి

***నేడు వ్యవసాయ పరిశోధనా విభాగం డైరెక్టర్, విస్తరణ డైరెక్టర్ రాక***

ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ నాయుడు, విస్తరణ విభాగం డైరెక్టర్ డాక్టర్ కె రాజారెడ్డి గురువారం నంద్యాలకు వస్తున్నారు. నంద్యాల ఏడీఆర్‌గా, ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రానమి విభాగ అధిపతిగా, తంగడంచె విత్తన ప్రత్యేక అధికారిగా పని చేసిన డాక్టర్ బి.గోపాల్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు.

# ప్రజా చైతన్యంతోనే పర్యావరణ రక్షణ

**● రాష్ట్రంలో 50 శాతం అడవులు పెంచడానికి కృషి**

**● 50 లక్షల మొక్కలు నాటేలా చర్యలు**

**నంద్యాల టౌన్:** ప్రజల్లో చైతన్యం వస్తేనే పర్యావరణాన్ని రక్షించుకోగలమని అటవీ శాఖ సీసీఎఫ్ గోపీనాథ్ అన్నారు. మహానందిలో పర్యావరణ కేంద్రం శిలాఫలకాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా అడవులను పెంచాలని అన్నారు. ప్రజల్లో పర్యావరణ చైతన్యం తేవడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర భూభాగంలో 23 శాతం అడవులు ఉన్నాయని, వాటిని 50 శాతం పెంచడానికి అటవీ శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే 15 లక్షల మొక్కలు నాటారని, 50 లక్షలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని, మహానందిలో పర్యావరణ కేంద్రంలో వన్య ప్రాణుల అరుపులు, సౌండ్ ఎఫెక్ట్స్ విజువల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అటవీ శాఖలో 2011 నుంచి ఇంత వరకు ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అన్నారు. మహానందిలోని పర్యావరణ కేంద్రాన్ని బయో డైవర్సిటీ కింద రూ.5 లక్షలు, సివిల్ వర్క్స్ కింద రూ.1.5 లక్షలు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆయన వెంట వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో శివప్రసాద్, లాగిన్ డీఎఫ్‌వో అశోక్‌కుమార్, ఎఫ్ఆర్ఓ అబ్దుల్ ఖాదర్, డీఆర్‌వో వేణుప్రసాద్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.



శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న సీసీఎఫ్ గోపీనాథ్

# ఉత్సాహపరిచిన విదేశీ రగ్బీ కోచ్‌లు

**కర్నూలు(స్పోర్ట్స్):** విద్యార్థులకు రగ్బీ పట్ల ఆసక్తి కలిగేలా విదేశీ కోచ్‌లు ఉత్సాహపరిచారు. బుధ వారం స్థానిక సీఆర్ఆర్ స్కూల్, ఆదర్శ విద్యామందిర్ పాఠశాలల్లో 1600 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గెట్ ఇట్ రగ్బీ విత్ ఫారిన్ కోచెస్ కో ఆర్డినేటర్ టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రగ్బీ క్రీడ పట్ల ఆసక్తి కలిగించి క్రీడాకారులుగా మలుచేందుకు విదేశీ కోచ్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. విద్యార్థులు ఇష్టంగా రగ్బీ సాధన చేయడం సంతోషకరమని అన్నారు. విదేశీ కోచ్‌లు ఈ ప్రాంతానికి రావడం ఆనందించాల్సిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి పి.రామాంజనేయులు, సీఆర్ఆర్ పాఠశాల ఆశారెడ్డి, ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ తిమ్మయ్య, జిల్లా సంఘం అధ్యక్షుడు సురేంద్ర తదితర పీఈటీలు పాల్గొన్నారు.



రగ్బీ శిక్షణ ఇస్తున్న విదేశీ కోచ్‌లు

# 'రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్'

**కర్నూలు(న్యూసిటీ):** వినాయక నిమజ్జనం పురస్కరించుకుని 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి నుంచి 3వ తేదీ ఉదయం 6 గంటల వరకు నగర పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లను మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పద్మావతి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి అన్ని దుకాణాలు, బార్లకు సీల్ వేస్తామని ఆమె పేర్కొన్నారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని అక్రమ మద్యం తరలించే వారిపై గట్టి నిఘా ఉంచినట్లు ఆమె తెలిపారు. నగరంలో ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు సంచరిస్తుంటాయని ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆమె తెలిపారు.

# బీఏఎస్‌కి ఎస్టీ విద్యార్థుల ఎంపిక



సునయన ఆడిటోరియంలో ఏజేసీ ఆధ్వర్యంలో లక్కీడిప్ తీస్తున్న దృశ్యం

**కర్నూలు(కలెక్టరేట్):** జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ఎస్టీ విద్యార్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్-2 రామస్వామి సమక్షంలో బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లలో మూడో తరగతిలో 75 సీట్లు, ఐదో తరగతిలో 38 సీట్లు, ఎనిమిదో తరగతిలో 37 సీట్లకు విద్యార్థులను లక్కి డిప్ ద్వారా ఎంపిక చేశారు. మూడో తరగతిలో 26 మంది, ఐదో తరగతి 28 మంది, ఎనిమిదో తరగతి 22 మంది విద్యార్థులు హాజరయ్యారు. అన్ని సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు జాయింట్ కలెక్టర్-2 తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సుభాషన్ రావు, సూపరింటెండెంట్ అలీ బాషా, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు చంద్రప్ప, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి

● ఒకరి పరిస్థితి విషయం.. మరొకరికి గాయాలు
● విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు
● విషాదంలో పెద్దబోదనం



మృతి చెందిన రైతు నారాయణ, గాయపడిన యేసు

**చాగలమర్రి:** మండలంలోని పెద్దబోదనం గ్రామానికి చెందిన రైతు నారాయణ (40) విద్యుదాఘాతంతో బుధవారం పొలంలోనే మృతి చెందాడు. యేసు, సంజీవ్‌లకు గాయాలయ్యాయి. వీరిలో యేసు పరిస్థితి విషమంగా ఉంది. రైతు నారాయణ చిన్నబోదనం గ్రామంలో పద్మనాభశెట్టికి చెందిన 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని 10 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నాడు. గత 10 రోజుల క్రితం గాలివానకు ఆయన పొలంలోని విద్యుత్ స్తంభం నేలకొరిగి తీగలు పొలంలో తెగి పడ్డాయి. వరి నాట్లు వేసుకోవాలని విద్యుత్ స్తంభాన్ని, తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదు. దీంతో వరి నాట్లు వేసుకోవటానికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించేందుకు రైతు నారాయణ, యేసు, సంజీవ్ విద్యుత్ తీగలు పట్టుకొని చుడుతుండగా విద్యుత్ సరఫరా కావడంతో నారాయణ పొలంలోనే మృతి చెందాడు. యేసు, సంజీవ్ పొలంలోనే కుప్పకూలిపోయారు. సమీపంలో ఉన్న నారాయణ భార్య ఆదమ్మ, కూలీలు పరిగెత్తుకొని వచ్చి చూసేలోపు ఆయన తుది శ్వాస విడిచాడు. గాయపడిన వారిని 108 వాహనంలో చాగలమర్రి వైద్యశాలకు తరలించారు. యేసు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నబోదనం, పెద్దబోదనం గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే భర్తను కోల్పోయానని ఆదమ్మ విలపించింది. విద్యుత్ ఏఈ మద్దిలేటి, విద్యుత్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, వీరాంజనేయులు మృతదేహాన్ని పరిశీలించి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**విద్యుత్‌శాఖకు సమాచారం ఇవ్వలేదు : మద్దిలేటి, విద్యుత్ ఏఈ**

విద్యుత్ తీగలు తొలగిస్తున్నట్లు రైతులు తమకు మాకు సమాచారం ఇవ్వలేదు. వారే సొంతంగా విద్యుత్ తీగలు తొలగించడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఇండెక్షన్ రావటంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ స్తంభం పడినప్పుడే మేము జంపర్లు తొలగించి విద్యుత్ సరఫరా లేకుండా చేశాం. రైతులు తీగలు తొలగించేటప్పుడు పక్కన ఉన్న ఎల్‌టీ కనెక్షన్‌కు తగలటంతో విద్యుత్ సరఫరా అయి ఉంటుంది.

# శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోండి

నగరంలో శాంతి ర్యాలీ చేపట్టిన కలెక్టర్, ఎస్పీ


శాంతి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు

**కర్నూలు(కలెక్టరేట్):** వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగలను సెప్టెంబర్ 2న నగర ప్రజలు ఐక్యతతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ కోరారు. బుధవారం జమ్మిచెట్టి నుంచి కొండారెడ్డి బురుజు వరకు విద్యార్థులు, హిందూ, ముస్లింలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా శాంతికి చిహ్నంగా కపోతాలను ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జమ్మిచెట్టు నుంచి ప్రారంభమై చిత్తారీ వీధి జంక్షన్, కర్నూలు వన్ టౌన్ పోలీసుస్టేషన్ మీదుగా, పూల బజార్, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, అంబేద్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు తెలుగు తల్లి విగ్రహం వరకు అన్ని మతాల వారు సోదర భావంతో కలిసి ఉండాలనే ప్లకార్డులు పట్టుకొని హిందూ, ముస్లిం మహిళలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. నగర ప్రజలందరూ సహకరించి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. జిల్లా ఎస్పీ గోపినాథ్‌జెట్టి మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం, బక్రీదు పండుగలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో హుసేన్ సాహెబ్, అడిషనల్ ఎస్పీలు పి.షేక్‌షావలి, వెంకటేష్, డీఎస్పీలు డీవీ రమణమూర్తి, సీఐలు, హిందూ ముస్లిం మత పెద్దలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం

# వేధించిన భర్త, అత్తకు జైలుశిక్ష

**కర్నూలు(లీగల్):** ప్రేమించి పెళ్లాడి అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 1050 జరిమానా, అత్త కె.సుభద్రమ్మకు ఏడాది జైలు శిక్ష, రూ. 3,500 జరిమానా విధిస్తూ కర్నూలు ప్రత్యేక సంచార న్యాయస్థానం బుధవారం తీర్పుచెప్పింది. 2014 నవంబరు 15న నగరంలోని నంద్యాల గేట్‌లో ఉండే ఎన్.పద్మజ, నంద్యాలకు నూనెపల్లెకు చెందిన కె.గురురాఘవేంద్ర ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. వారి వివాహానికి రాఘవేంద్ర తల్లి సుభద్రమ్మ అంగీకరించకపోవడంతో పెద్దలు పంచాయితీ చేసి మూడు లక్షలు నగదు, రెండు తులాల బంగారం ఇచ్చేవిధంగా నిర్ణయించారు. కొన్నాళ్లకే మరింత అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్త వేధించారు. బలవంతంగా అబార్షన్ చేయించారు. చివరకు ఇచ్చిన కట్నం తిరిగి ఇస్తాం, విడాకులు ఇవ్వాలని వేధించారు. చేసేది లేక బాధితురాలు పద్మజ కర్నూలు మహిళా పోలీసులను ఆశ్రయించారు. 2015 అక్టో బరు 28న రాఘవేంద్ర, సుభద్రమ్మపై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయగా కేసు విచారణలో వారిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.బాబు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కృష్ణారెడ్డి వాదించారు.

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

**దేవనకొండ:** పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని నేలతలమర్రి గ్రామంలో జరిగింది. ఆ గ్రామానికి మాదిగ నరసప్ప (37) అనే యువకుడికి కడుపునొప్పి తరచుగా వస్తుండేది. మంగళవారం రాత్రి తన ఇంటి బయట పడుకున్నాడు. కడుపునొప్పి తీవ్రంగా రావడంతో అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. బుధవారం ఉదయం భార్యా పిల్లలు లేపేందుకు వెళ్లితే అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు లిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆధారాలు ఉంటే..

ఎవరి సొమ్ము వారి ఇస్తామన్న త్రీమెన్ కమిటీ

**కర్నూలు(కలెక్టరేట్):** నంద్యాల ఉప ఎన్నికలో పట్టుబడిన నగదును బాధితులు తగిన ఆధారాలు చూపి తీసుకెళ్లాలని త్రీమెన్ కమిటీ పేర్కొంది. ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లాలో 1.19 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. ఇందులో రూ.10లక్షలు కర్నూలు ట్రెజరీ వద్ద డిపా జిట్ చేయగా.. మిగిలిన కోటి 9లక్షల నగ దును నంద్యాలలోనే అధికారులు డిపాజిట్ చేశారు. ఈ నగదును విముక్తి చేసేందుకు ఖజానా శాఖ డిడి పార్వతి, ఆడిట్ అధికారి శ్యామల జ్యోతి, జిల్లా పరిషత్ సీఈవో ఈశ్వర్ ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీని వేశారు. ఈ కమిటీకి బాధితులు ఆధారాలు చూపి రాతపూర్వకంగా లేఖలు ఇస్తే పరిశీలించి సరైన ఆధారాలు ఉంటే ఎవరి సొమ్మును వారికి ఇస్తున్నారు.
ఇప్పటి వరకు జిల్లాలో నారాయణరావు రూ.లక్ష, బండి సుబ్బారావు రూ.3లక్షలు, జయన రేంద్రకు మార్‌రెడ్డి రూ.1,40,200 నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించి తమ డబ్బును తీసుకెళ్లారని త్రీమెన్ కమిటీ సభ్యులు శ్యామలజ్యోతి, పార్వతి తెలిపారు.

# కట్టమంచిలో విద్యార్థిని మృతిపై విచారణ

**కర్నూలు(ఎడ్యుకేషన్):** స్థానిక కట్టమంచి రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 19న విద్యార్థిని ప్రీతిబాయి మృతిపై ఫైవ్ మేన్ కమిటీ బుధవారం విచారణ నిర్వహించింది. ప్రీతిబాయి సహచర విద్యార్థులను వార్డెన్, నర్సుతో సంఘటన వివరాలను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని ఉండే గది వద్దకు వెళ్లి నోటు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కమిటీ సభ్యులు ఆర్డీవో హుసేన్ సాహెబ్, డీఈవో తాహేరా సుల్తానా, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడు యు.ప్రసాదరావు, గైనిక్ వైద్య నిపుణురాలు డా.ఇందిర, విద్యార్థి సంఘం నాయకుడు ఆర్.చంద్రప్ప ఉన్నారు.

# డెంగ్యూతో బాలుడి మృతి


బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

**పగిడ్యాల:** మండలంలోని సంకిరేణిపల్లె మజరా గ్రామమైన తూర్పు వనములపాడుకు చెందిన తులసీనాథ్‌నాయుడు (5) అనే బాలుడు డెంగ్యూ వ్యాధితో బుధవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడు, రాధమ్మ కొన్ని సం వత్సరాలుగా అలూరులో స్థిరపడ్డారు. వీరి కుమారుడు తులసీనాథ్‌నాయుడికి గత పది రోజులుగా తీవ్ర జ్వరం వస్తుండడంతో అలూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో వైద్య చికిత్సలు చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఆదోనిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమారుడి మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి.

## వ్యక్తి ఆత్మహత్య


జయరాములు మృతదేహం

**ఆలూరు:** మండలంలోని పెద్దహోతూరు గ్రామానికి చెందిన బోయ జయరాములు(42) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం పురుగు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య జయమ్మ, కూతురు ఉంది. చాలా రోజుల క్రితం ప్రమాదంలో కాలు విరగడంతో తన అన్నకు ఉన్న రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. సాగు కోసమని అప్పులు కూడా చేసినట్లు తెలిపారు. ఓ వైపు కాళ్లు సరిగా పనిచేయకపోవడం, మరో వైపు పంటలు పండకపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేసిందని ఈ క్రమంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వెంటనే ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

## 'సీబీఐ కోర్టు తీర్పు హర్షణీయం'

**నంద్యాల టౌన్:** రాష్ట్రంలోని డేరాబాబాకు సీబీఐ కోర్టు 20 సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించడంహర్షించదగిన విషయమని మహానందీశ్వర మండల యువజన సంఘాల సమాఖ్య కార్యదర్శి పస్పుంగి వెంకటరమణ పేర్కొన్నారు. డేరాబాబా ప్రజల భక్తిని ఆసరా చేసుకొని ఆశ్రమానికి వచ్చే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం రాక్షసత్వమని పేర్కొన్నారు. డేరాబాబాను జీవితాంతం ఖైదీగా ఉంచాలని కోరారు. డేరాబాబా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## పని చేయని చేతిపంపు.. అల్లాడుతున్న ప్రజలు


చెడిపోయిన చేతిపంపు

**బండిఆత్మకూరు:** మండలంలోని వారధి బస్టాపు సమీపాన ఉన్న చేతి పంపు నెల రోజులుగా పని చేయకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారి వారధి బస్‌స్టాప్ వద్ద అధికారులు చేతిపంపు వేశారు. ఈ పంపు మూడు గ్రామాల రైతులకు, కూలీలకు, నంద్యాల-ఆత్మకూరు రహదారిలో ప్రయాణికులకు దాహార్తి తీరుస్తోంది. నెల రోజులుగా బోరు పని చేయకపోవడం, తాగటానికి నీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చేతి పంపుకు మరమ్మతులు చేయాలి: వెంకటేశ్వర్లు**



మూడు గ్రామాల రైతులకు, కూలీలకు దాహం తీర్చే చేతి పంపు నెల రోజులుగా పని చేయటం లేదు. పొలం పనుల కోసం వచ్చిన వారికి తాగునీరు లేక అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు వెంటనే మరమ్మతులు చేయించాలి.

## 34 మంది ఉపాధ్యాయుల బదిలీ


మాట్లాడుతున్న ఎంఈవో బ్రహ్మం

**గడివేముల:** గడివేముల మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులల్లో 34 మంది ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీ అవుతున్నట్లు గడివేముల ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయుల సంఘాల నాయకులతో బుధవారం ఎంఆర్‌సీ భవనంలో సమావేశమయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి సన్మానం చేయాలని తీర్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు సతీష్‌కుమార్, రవికుమార్, జగదీష్, మాధవరెడ్డి, జయప్రకాష్, రామిరెడ్డి, రఫూఫ్, మహేశ్వర రెడ్డి, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం


ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు రాజశేఖర్

**బండిఆత్మకూరు:** మండలంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్, శ్రీశైలం డివిజన్ గిరిజన సంఘం కార్యదర్శి నరసింహనాయక్, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రామచంద్రుడు కోరారు. బుధవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని పలు సమస్యలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నారపురెడ్డికుంట చెంచుల భూములకు సాగునీరు అందించాలని, ఓంకారం, నాయిని చెరువు చెంచుల భూములకు పట్టాలు ఇవ్వాలని, నెమిళ్లకుంట చెంచులకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బి.కోడూరు గ్రామంలో ఉన్న చెంచులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారేకాని స్థలాల కేటాయింపు జరగలేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, రత్నమయ్య, బాబు, సుభాన్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో అనాథలకు అన్నదానం


అనాథలకు అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న రవి

**నంద్యాల రూరల్:** జనసేన సేవాదళ్ వ్యవస్థాపకుడు, సినీ హీరో పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అనాథలకు, భిక్షాటన చేస్తున్న వారికి జనసేన సేవాదళ్ సభ్యుడు దాసరి రవి ఆధ్వర్యంలో అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వారోత్సవాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు సేవ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధు, సతీష్, సాయి, ఫణి, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

**చిన్నారులకు అన్నదానం**

జనసేన సేవాదళ్ కార్యకర్త పి.సుధాకర్ ఆధ్వర్యంలో హీరో పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలో భాగంగా పరివర్తన లైఫ్ సొసైటీ చిన్నారులకు కాస్మొటిక్స్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అభిమాన సంఘాలు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల అభిమానాన్ని సంపాదించాలన్నారు. ప్రజాసేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాదం విజయ్(లిల్లి), ఆర్‌జీఎం ప్రభాకర్, గిరి, శంకర్, దీపక్, మన్సూర్ పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సేవాదళ్ సభ్యులు

**నంద్యాల టౌన్:** జనసేన సేవా దళ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా రెండో రోజు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. రోగులకు ఆపిల్, దానిమ్మ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేన సేవాదళ్ కార్యకర్తలు సేవా దృక్పథంతో రోగులకు పండ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సేవాదళ్ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాముడు, జగదీష్, చంటి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గడివేముల తహసీల్దార్ బదిలీ


తహసీల్దార్ నాగకళ్యాణిని సన్మానిస్తున్న దృశ్యం

**గడివేముల:** గడివేముల మండల తహసీల్దార్ నాగకళ్యాణి బుధవారం బదిలీ అయ్యారు. ఈమె సీసీఎల్ఏ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా ట్రైనింగ్ కోసం గడివేములకు వచ్చారు. ఆమె ట్రైనింగ్ కాలం పూర్తి కావడంతో తిరిగి తమ శాఖకు బదిలీ అయినట్లు నాగకళ్యాణి తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణలు తహసీల్దార్ నాగకళ్యాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటకృష్ణుడు, నాగేశ్వరరావు, ప్రభాకర్, హరిచంద్ర, మురళి, నాగేశ్వరరావు, సోఫీ సాహెబ్ పాల్గొన్నారు.

## 'పంచాయతీల జియోట్యాగింగ్ వేగవంతం చేయండి'

**గడివేముల:** పంచాయతీల జియోట్యాగింగ్‌ను వేగవంతం చేయాలని గడివేముల మండల ఈవోఆర్డీ జాస్లీన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం గడివేముల మండలంలో జియోట్యాగింగ్ 34.24 శాతం పూర్తయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీల్లో త్వరగా 100 శాతం చేరుకోవాలన్నారు. జియోట్యాగింగ్‌లో అలసత్వం వహిస్తే పంచాయతీ కార్యదర్శులకు మెమోలు ఇస్తామని ఆమె హెచ్చరించారు.

## పాఠశాల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి: ఎంఈవో


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కోటయ్య

**పాణ్యం:** పాఠశాలలోని సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు. బుధవారం ఆయన కందికాయపల్లెలోని ఎంపీ యూపీ, తమ్మరాజుపల్లెలోని జడ్పీహెచ్ స్కూల్, ప్రాథ మిక పాఠశాలలను తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు వసతులు, పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. తమ్మరాజుపల్లె హైస్కూల్‌కు కాంపౌండ్, ప్రాథమిక పాఠశాలకు వంటగది లేవన్నారు. చెడిపోయిన తాగునీటి బోరును రెండు రోజుల్లో బోరు రిపేర్ చేయిస్తామన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎంలు తిరుపతయ్య, శివకర్నుడు, యాగంటయ్య పాల్గొన్నారు.

## 'మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న మాణిక్యంరాజ్

**నంద్యాల:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో విజయవాడలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీజే మాణిక్యంరాజ్ పిలుపు నిచ్చారు. బుధవారం శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యంరాజ్ మాట్లాడుతూ స్వయంపోషక స్వతంత్ర పాఠశాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ యాజమాన్యాల దోపిడీపై ప్రశ్నించే హక్కును కోల్పోతారని అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల విధులకు హాజరైన జూపాడుబంగ్లా మండలం తరిగోపులలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న చక్రపాణి చనిపోయాడని, వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు రామకృష్ణయ్య, ఇద్రూస్‌బాషా, తిమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఐదుగురు ఉపాధ్యాయులకు సన్మానం

**పాణ్యం:** వృత్తి బాధ్యతతో పాటు సామాజిక సేవలందించిన ఐదుగురు ఉపాధ్యాయులను బుధవారం మద్దూరు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. మద్దూరు పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన సుదర్శన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రభాకర్, మల్లికార్జున రెడ్డి, లక్ష్మీఈశ్వరరెడ్డిలను దాత, గ్రామపెద్ద అన్నపురెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, చెట్ల పెంపకం, ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆకు మచ్చ తెగులుపై జాగ్రత్తలు తీసుకోండి: ఏవో

**గడివేముల:** పత్తి పంటలో సోకే ఆకుమచ్చ తెగులుపై జాగ్రత్తలు తీసుకోవాలని గడివేముల వ్యవసాయాధికారి ప్రభావతమ్మ రైతులకు సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పత్తి పంటకు ఆకుమచ్చ తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ తెగులు నివారణకు 10 లీటర్ల నీటిలో ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి 15 రోజుల వ్యవధిలో మూడు నుంచి నాలుగుసార్లు పిచికారీ చేయాలని కోరారు.

# సరుకుల్లో కోత.. పేదలకు వాత

● రేషన్ దుకాణాల్లో దశల వారీగా నిత్యావసరాలకు మంగళం
● బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న వైనం ● ఇబ్బందుల్లో పేద ప్రజలు

**గడివేముల:** పేద, బడుగు, బలహీన వర్గాల ఆకలి బాధను తీర్చడానికి గత ప్రభుత్వాలు రేషన్ దుకాణాలను ప్రారంభించాయి. ఈ దుకాణాల ద్వారా పేద ప్రజలకు బియ్యం, కంది బ్యాళ్లు, చక్కెర, కిరోసిన్, పామాయిల్, గోధుమ పిండి సబ్సిడీకి ఇచ్చేవారు. దీంతో పేద ప్రజలకు గ్రామాల్లో పని దొరకపోయినా నెలలో కొన్ని రోజులపాటు తమ జీవనాన్ని నెట్టుకొచ్చే వారు. ప్రస్తుత ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై పంపిణీ చేస్తున్న రేషన్ సరుకుల్లో కోత విధించడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**నిత్యావసర సరుకుల్లో కోత**

గడివేముల మండలంలోని 32 రేషన్ షాపుల్లో 12 అన్నపూర్ణ కార్డులు, 729 అంత్యోదయ కార్డులు, 12,928 తెల్ల రేషన్ కార్డులు కలిపి మొత్తం 13,669 లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 1,797 క్వింటాళ్ల బియ్యం, 13,472 లీటర్ల కిరోసిన్, చక్కెర, గోధుమ పిండి, పామాయిల్ పంపిణీ చేసేవారు. గత మూడు నెలల క్రితం కిరోసిన్ పంపిణీలో కోత విధించారు. అనంతరం చక్కెర, పామాయిల్, కందిబ్యాళ్లలో కోత విధించారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

**ఇబ్బందుల్లో ప్రజలు**

రేషన్ షాపులో బియ్యం కేజీ రూ.1కి, చక్కెర కేజీ రూ.13.50కి, కిరోసిన్ రూ.19, గోధుమపిండి రూ.16.50కి ప్రజలకు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం సరుకుల్లో కోత విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో కేజీ చక్కర రూ.44, గోధుమపిండి రూ.30, పామాయిల్ రూ.60, కిరోసిన్ రూ.60 ఉండటంతో ప్రజలకు భారంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో కొనసాగించిన విధంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రేషన్ షాపులో పంపిణీకి సిద్ధంగా ఉన్న బియ్యం

**సరుకుల్లో కోత విధించకూడదు: వెంకట నారాయణ, గడివేముల**



రేషన్ దుకాణాల్లోని నిత్యావసర సరుకుల్లో ప్రభుత్వం కోత విధించ కూడదు. సరుకులు అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం. ప్రభుత్వం స్పందించి రేషన్ షాపుల్లో సరుకులు యధాతథంగా అందించాలి.

**భారంగా ఉంది: డి.నాగరాజు, చిందుకూరు**



రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. చక్కెర, కిరోసిన్, కంది బ్యాళ్లు, పామాయిల్ పంపిణీ చేయడం లేదు. వీటిని బయట మార్కెట్‌లో కొనాలంటే ఆర్థికంగా భారంగా ఉంది. ప్రభుత్వం వీటిని వెంటనే రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలి.

**సరుకుల్లో కోత అన్యాయం: దామోదరం నాగశేషులు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు**



ప్రజలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో ప్రభుత్వం కోత విధించడం అన్యాయం. సంక్షేమాన్ని విస్మరించి పేద ప్రజలపై ఆర్థిక భారం మోపడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుత పరిస్థితుల్లో చక్కెర, కంది బ్యాళ్లు, కిరోసిన్‌లకు బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించాల్సివస్తోంది. ప్రభుత్వం స్పందించి నిత్యావసర సరుకులు యధాతథంగా పంపిణీ చేయాలి.

## నేడు పాణ్యం పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన

**పాణ్యం:** స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించతలపెట్టిన నూతన భవన నిర్మాణానికి నేడు ఐజీ ఇక్బాల్ ఉసేని, డీఐజీ శ్రీనివాసులు, ఎస్పీ గోపినాథ్‌జెట్టీలు శంకుస్థాపన చేయనున్నట్లు సీఐ పార్థసారధిరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న పోలీస్ స్టేషన్ భవనం నాలుగు రోడ్ల నిర్మాణంలో తొలగిపోనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పోలీసు స్టేషన్‌కు నూతనంగా భవనాన్ని నిర్మించతలపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

## తడి ఆరితే సాగు ముమ్మరం: ఎంఏవో ఉషారాణి

**పాణ్యం:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి భూముల్లోని తడి ఆరితే సాగు ముమ్మరమవుతుందని మండల వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 6,497 హెక్టార్లు ఈ ఖరీఫ్‌లో సాగు కావాల్సి ఉండగా 3,578 హెక్టార్లు సాగయిందన్నారు. ఇందులో వరి 833.8 హెక్టార్లు, మిరప 406 హెక్టార్లు, పత్తి 1248.4 హెక్టార్లు, కంది 599.4 హెక్టార్లు, మొక్కజొన్న 286.2 హెక్టార్లు, వేరుశెనగ 51.6 హెక్టార్లు, మినుము 60.2 హెక్టార్లు, కొర్ర 24.4 హెక్టార్లు, ఆముదము 10 హెక్టార్లు, కూరగాయలు 56 హెక్టార్లల్లో సాగయిందని తెలిపారు. వర్షం తగ్గి భూములు ఆరితే సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. 3277.80 హెక్టార్లలో వరి సాగవాల్సి ఉండగా 833 హెక్టార్లు సాగయిందన్నారు. జూన్‌లో 56.0 కుగాను 78.2 మిల్లీమీటర్లు, జూలైలో 129కి గాను 50.4 మిల్లీమీటర్లు, ఆగస్టులో 140కి గాను 175.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు. వరి సాగు అధికంగా పెరిగే అవకాశముందన్నారు. ఎస్ఆర్‌బీసీ ద్వారా నీరు అందితే వరి సాగు మరింత పెరుగుతుందన్నారు.



# పరమటూరులో కంపు కంపు


దళిత వాడలో ఇండ్ల మధ్య రోడ్డుపై నిలిచిన నీరు

**బండిఆత్మకూరు:** మండలంలోని పరమటూరు గ్రామం దళితవాడలో రోడ్లపై మురుగు నీటి నిల్వలు పెరగటంతో దుర్గంధం వెదజల్లుతోంది. పేరుకే సిమెంట్ రోడ్లే అయినా రోడ్లు పగిలిపోయి, తరుగులు ఏర్పడ్డాయి. దళితవాడలోని జనావాసాల మధ్య ఉన్న సీసీ రోడ్డుపైకి ఇళ్లలోని మురుగు నీటిని రోడ్లపైకి వదలటంతో రోడ్లు మురికి కూపాలుగా మారుతున్నాయి. దీంతో చుట్టుపక్కల ఇళ్లలోని జనం దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. మురుగు నీటిపై దోమలు వాలుతున్నాయి. దీంతో జ్వరాలు, విరేచనాలు తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. కాలనీలో మురుగు కాల్వలు నిర్మించకపోవటం ద్వారా కూడా సమస్యకు ప్రధాన కారణంగా ఉంది. రాత్రి వేళల్లో వృద్ధులు మురుగు నీటి ప్రాంతాల వద్ద కిందపడి అల్లాడిపోతున్నారు. చిన్నారులు బడులకు వెళ్లాలంటే మురుగు నీటిలో నడచి వెళ్లాల్సిన దుస్థితి ఉంది.

**దుర్వాసనతో అల్లాడిపోతున్నాం: ఆలీసమ్మ**



కాలనీలో రోడ్లపై నిలిచిన మురికి నీటి దుర్వాసనకు ఇళ్లలో ఉండలేకపోతున్నాం. రాత్రి వేళల్లో ఇండ్లకు రావాలంటే ఎక్కడ కాలు జారి పడతామో అర్థం కావటం లేదు. దోమలు కుడుతున్నాయి. జ్వరాలు వస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పరిష్కారం చేయలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

## 'డేరా బాబా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి'

**నంద్యాల టౌన్:** హర్యానా రాష్ట్రంలోని డేరాబాబా ఆకృత్యాలకు బలైన బాధితులకు న్యాయం చేయాలని, డేరా బాబా అస్తులను ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మదర్ యూత్ అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు. డేరాబాబా కోట్ల ఆస్తిని సంపాదించి భక్తి పేరుతో మహిళలను వేధించడం, రౌడీయిజం చేసి ప్రజలను, ప్రభుత్వాన్ని భయపెట్టడం అత్యంత దారుణమన్నారు. డేరాబాబా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆశ్రమాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. డేరాబాబా శిష్యులు ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించారని, ఈ నష్టాన్ని డేరా బాబా ఆస్తులతో పూడ్చుకోవాలని సూచించారు. డేరాబాబా లాంటి దొంగలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

# సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించండి

- ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి పెట్టండి
- ప్రతి సబ్ డివిజన్‌లో బీటింగ్‌లు ఏర్పాటు చేయండి
- నేర సమీక్షలో ఎస్పీ గోపినాథ్ జెట్టి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ, హాజరైన డీఎస్పీలు

**కర్నూలు:** సమస్యాత్మక గ్రామాల్లో ప్రతి పోలీస్ అధికారి ఖచ్చితంగా పర్యటించాల్సిందేనని ఎస్పీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని డీఎస్పీలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం సేకరించాలని తెలిపారు. పెండింగ్ కేసులను తగ్గించాలని సూచించారు. నేర దర్యాప్తు నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి సబ్‌డివిజన్‌లో బీటింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు ముందుగా గుర్తించి బ్లింకర్స్, రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సబ్ డివిజన్‌లో ఈ-చలానా పూర్తిగా తీసుకోరావాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను పూర్తిగా వినియోగించేలా కృషి చేయాలన్నారు. విధుల్లో ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి రివార్డులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు షేక్షావలి, వెంకటేశ్, ఓఎస్డీ రవిప్రకాష్, డీఎస్పీలు రమణమూర్తి, బాబుప్రసాద్, కొల్లి శ్రీనివాసరావు, చక్రవర్తి, వెంకటాద్రి, మురళీధర్, హుస్సేన్‌పీరా, బాబా ఫక్రుద్దీన్, వినోద్‌కుమార్, రాజశేఖర్‌రాజు, రామచంద్ర, సిఐలు సుబ్రహ్మణ్యం, ములకన్న తదితరులు పాల్గొన్నారు.



మానసిక వికలాంగులకు దుస్తులు పంపిణీ అందజేస్తున్న దృశ్యం(ఫైల్)





పేద విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదగా నగదు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

# ఆధ్యాత్మికం.. సామాజికం

- విభిన్న రీతుల్లో గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన
- పేద విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు చేయూత
- ప్రతి ఏటా విరివిగా సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా కొండవీటి బాలవినాయక యువక మండలి
- ఈ ఏడాది తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు

**ఎమ్మిగనూరు టౌన్:** మానవసేవే మాధవసేవగా భావించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొండవీటి బాల వినాయక యువక మండలి వారు వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గత 24 ఏళ్ల నుంచి వివిధ రూపాల్లో వినూత్న తరహాల్లో విగ్రహాలను ప్రతిష్టించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాదు.. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రముఖుల ప్రశంశలు అందుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు.

ఎమ్మిగనూరు పట్టణ ం కొండవీటి ప్రాంతానికి చెందిన తెలుగు రాముడుతో పాటు ఎన్.శ్రీనివాసులరెడ్డి, సి.శ్రీనివాసులు, బీపీ బాలాజీ, కృష్ణ, విజయ్, కుశ కుమార్, రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పరమేష్, మిన్నల్లాగౌడ్‌లతో పాటు మరి కొంతమంది కలసి 1994లో కొండవీటి బాల వినాయక యువక మండలిని ఏర్పాటు చేసుకున్నారు. వినూత్న రీతిలో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయడం, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**చేపట్టిన సేవా కార్యక్రమాలు :**

1994 నుంచి ప్రతి ఏటా ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు దుస్తులు, పేద, మానసిక వికలాంగులు, అనాథ వృద్ధులు, మహిళలకు దుస్తులు, దుప్పట్లు, నగదు పంపిణీ చేస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు ప్రతి ఏటా అవసరమైన ఫీజులు చెల్లించి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. అంతే కాకుండా ప్రతి ఏటా వేసవిలో కొండవీటి ప్రాంతంతో పాటు సోమేశ్వర థియేటర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. పేద మహిళలకు చీరల పంపిణీ చేస్తున్నారు.

**వినూత్న రీతిలో విగ్రహాల ఏర్పాటు:**

కొండవీటి బాల వినాయక యువక మండలి ఆధ్వర్యంలో 1994 నుంచే వినూత్న రీతిలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. వినాయక ఉత్సవాలకు రెండు నెలల ముందు నుంచే ఎమ్మిగనూరులోనే విగ్రహాలను తయారు చేస్తున్నారు. 1994లో నాట్య వినాయకుడ్ని ప్రతిష్టించగా 1995లో వక్కలతో తయారు చేసిన వినాయకుడు, 1996లో గోడంబి, ద్రాక్షలతో, 1997లో వెలగకాయలతో, 1998లో బాదంపప్పుతో, 1999లో ఎండు ఖర్జూరంతో, 2000లో నవధాన్యాలతో, 2001లో రుద్రాక్షమాలతో, 2002లో పసుపు కొమ్ములతో, 2003లో అనుముల విత్తనాలతో, 2004లో తులసి పూసలతో, 2005లో నవరత్నాలు, పూసలతో, 2006లో కాణిపాక వినాయకుడు, 2007లో పచ్చి వక్కలతో, 2008లో ముత్యాల పూసలతో, 2009లో మొక్కజొన్నలతో, 2010లో కస్తూరి పూసలతో, 2011లో సోయాబిన్ ఆముదం విత్తనాలతో, 2012లో బాదం విత్తనాలతో, 2013లో దశావతార వినాయకుడు, 2014లో రుద్రాక్షలు, తులసి పూసలు, 2015లో ఉగ్ర నరసింహ అవతారం, 2016లో శివపుత్ర గజకర్ణ వినాయకుడు, 2017లో గజేంద్ర మోక్ష వినాయకుడుతో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు.

**తెలుగుబుక్ ఆఫ్ రికార్డులో చోటు:**

వినాయక ఉత్సవాల్లో విన్నూత్నరీతిలో విగ్రహాలను తయారు చేయించడం, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల కొండవీటి బాల వినాయక మండలి సేవలను గుర్తించిన తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ ఈ ఎడాది అరు దైన గౌరవంతో సత్కరించింది. ఈ ప్రశంశాపత్రాన్ని అందజేసింది.

**గర్వంగా ఉంది**



1994లో నేను మా మిత్రులు కలసి ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. నాటి నుంచి వినూత్న రీతిలో పెద్ద ఎత్తున గణపతి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నాం. సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం గర్వంగా ఉంది.

**- తెలుగు రాముడు, అధ్యక్షుడు**

# లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయండి

**బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్**

**కర్నూలు(కలెక్టరేట్):** హౌస్ ఫర్ ఆల్ స్కీం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో వివిధ రుణాల మంజూరుపై ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతపూర్ సిండికేట్ బ్యాంకు డీజీయం కుమారయ్య, జిల్లా లీడ్ జిల్లా మేనేజర్ మోహన్, నాబార్డు ఏజీయం నగేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణానికి మూడు కేటగిరీల్లో గృహ నిర్మాణాలకు భూమి పూజ జరిగిందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వం జారీ చేసిన గైడ్ లైన్స్ మేరకు త్వరగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. జగన్నాథగట్టులో వంద ఎకరాలు, నంద్యాల పట్టణంలో 120 ఎకరాల స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్పొరేషన్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరుకు సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 7,203, బీసీ కార్పొరేషన్ 5,200, కాపు కార్పొరేషన్ 3,000 మైనార్టీ ద్వారా 2,500, హ్యాండ్లూమ్స్ ద్వారా 3,780, ఎంఎస్‌ఎంఈ, ఎస్టీ, తదితర కార్పొరేషన్ ద్వారా దాదాపు 24 వేల యూనిట్లు ఈ సంవత్సరం మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. మండలాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను మూడు రోజుల్లో అప్‌లోడ్ చేయాలని లేకపోతే సంబంధిత ఖాతా క్లోజ్ అవుతోందని ఈ మేరకు సంబంధిత అధికారులు, బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్‌లో రూ.3,297 కోట్ల రుణాలకు గాను ఇప్పటి వరకు రూ.2,624 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరు చేసామన్నారు. ప్రతి శనివారం మంజూరు చేసిన రుణాలపై నివేదికలివ్వాలని కలెక్టర్ సంబంధిత బ్యాంకర్లు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ, వివిధ కార్పొరేషన్ల ఈడీలు, అన్ని బ్యాంకుల రీజినల్ మేనేజర్లు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ



హాజరైన బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు

# అత్యవసర వాయిదా

● సంతకాలు చేసి బయటకు వెళ్లిపోయిన టీడీపీ సభ్యులు
● చైర్ పర్సన్ రాజీనామా చేయాలని ఆందోళన
● అత్యవసర సమావేశానికి కోరం కరువు ● కౌన్సిల్ హాల్ వద్ద భారీ భద్రత

**నంద్యాల:** నంద్యాల పురపాలక కౌన్సిల్ అత్యవసర సమావేశం కోరం లేక వాయిదా పడింది. బుధవారం పురపాలక కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్‌పర్సన్ దేశం సులోచన అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి అత్యవసర సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. కౌన్సిల్ ఏజెండాపై సమావేశంలో చర్చించి వివిధ అంశాలపై ఆమోద ముద్ర వేయాల్సి ఉండగా సమావేశం వాయిదా పడింది. కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ దేశం సులోచనతో పాటు శిల్పా వెంట వైసీపీలో చేరిన కౌన్సిలర్లు కన్నమ్మ, మురళి, సుబ్బరాయుడు, శోభారాణి, చాంద్‌బీ, కలాం, లక్ష్మీనారాయణ, మల్కిరెడ్డి లలిత, భీమనపల్లె వెంకటసుబ్బయ్య, రాజేశ్వరి, సోపాలపిల్లి లక్ష్మీదేవి మొత్తం 13 మంది సంతకాలు చేసి కూర్చున్నారు. సంతకం చేసిన అనంతరం సోపాలపిల్లి లక్ష్మీదేవి సమావేశం ప్రారంభానికి ముందే ఇంటికి వెళ్ళిపోయారు. మరో పక్క కౌన్సిల్ సమావేశానికి మొదట వచ్చిన టీడీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయ్‌కుమార్, కౌన్సిలర్లు శివశంకరయాదవ్, కత్తి శంకర్, పడకండ్ల సుబ్రహ్మణ్యం, అన్నం శశిరేఖ, జేవీసీ హారిక, దియ్యాల సులోచన, నూర్జహాన్, సర్తాజ్ బేగం, హనీఫ్, చెన్నమ్మ, దిలీప్‌కుమార్, గుండ్రాతి అరుణాదేవి, ముక్కెర అనూష, గోర ముర్తుజా, మధుసాయి తదితరులతో పాటు మొత్తం 23 మంది కౌన్సిలర్లు వచ్చారు. వీరిలో గంగిశెట్టి విజయ్ కుమార్, హనీఫ్, దియ్యాలసులోచన, నూర్జహాన్, సర్తాజ్ బేగం కౌన్సిల్ హాల్‌లో కూర్చొని రిజిస్టర్‌లో సంతకాలు చేశాక వాటిని కొట్టి వేసి కౌన్సిల్ హాల్ నుంచి బయటకు వచ్చారు. మొత్తం 42 మంది మున్సిపల్ కౌన్సిలర్లల్లో మూడోవంతు కౌన్సిలర్లు ఉంటేనే సమావేశం జరుగుతుంది. ఈ నేపథ్యంలో మూడో వంతు ప్రాతిపదికన మొత్తం 15 మంది కౌన్సిల్ సమావేశంలో ఉండాలి. కానీ టీడీపీ కౌన్సిలర్లంతా చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సమావేశాన్ని బాయికాట్ చేశారు. మరోపక్క శిల్పా వర్గాకే చెందిన సోపాలపిల్లి లక్ష్మీదేవి రిజిస్టర్‌లో సంతకం చేసి వెంటనే ఇంటికి వెళ్ళిపోవడంతో 12 మంది కౌన్సిలర్లే కౌన్సిల్ సమావేశంలో ఉండటంతో కోరం లేకుండా పోయింది.


సభ్యులు లేక వెలవెలబోతున్న సమావేశ మందిరం


వేచి చూస్తున్న చైర్ పర్సన్

**నాటకీయ పరిణామాల మధ్య వాయిదా**

నంద్యాల పురపాలక సంఘం అత్యవసర సమావేశం నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. చైర్‌పర్సన్ రాజీనామా చేయాలంటూ టీడీపీ కౌన్సిలర్లు బయట ఆందోళనకు దిగారు. అదే సమయంలో కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ దేశం సులోచన, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావుతో మాట్లాడి కుర్చీలో అలాగే కూర్చోవడంతో కొద్ది సేపు ఉత్కంఠ రేపింది. కోరం లేకుండానే కౌన్సిల్ నిర్వహిస్తారా..? లేక సంతకాలు చేసి, కొట్టి వేసిన అంశాన్ని పరిగణలోకి తీసుకుంటారా? అన్న విషయంపై కొద్ది సేపు సందిగ్ధత నెలకొంది. ఇదే సమయంలో చైర్‌పర్సన్ దేశం సులోచన మాట్లాడుతూ సంతకాలు చేసి బయటకు వెళ్ళిన వారు తిరిగి వస్తారేమోనని 15 నిమిషాల పాటు వేచి చూస్తామని 11.35 సమయంలో ప్రకటించారు. మరో 20 నిమిషాల తర్వాత కూడా వారు లోపలికి రాకపోవడంతో కోరం లేదని అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ వాయిదా వేశారు.

## భారీ బందోబస్తు

నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన రెండు రోజులకే మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఉద్రిక్త సంఘటనల నేపథ్యంలో కౌన్సిల్ సమావేశంలో ఏదైనా జరగవచ్చునని ముందస్తు ఆలోచనతో పోలీసులు అప్రమత్తమయ్యారు.


సభ వెలుపల నినాదాలు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు →

## ఆమె రాజీనామా చేయాలి..

నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధిని గత మూడేళ్లుగా అడ్డుకుంటున్న చైర్‌పర్సన్ దేశం సులోచన రాజీనామా చేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్, వైసీపీలో చేరిన కౌన్సిలర్లుకు వ్యతిరేకంగా టీడీపీ కౌన్సిలర్లు నినాదాలు చేశారు. పార్టీ మారిన చైర్‌పర్సన్ డౌన్ డౌన్, అభివృద్ధిని అడ్డుకుంటున్న చైర్‌పర్సన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయ్‌కుమార్, కౌన్సిలర్లు శివశంకర్, శశిరేఖ, అనూష మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం మూడేళ్లుగా అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. చైర్‌పర్సన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ దేశం సులోచన తన చాంబర్‌లో మాట్లాడుతూ తనను రాజీనామా చేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# పత్తి సాగు బహుబాగు

● సాధారణానికి మించి సాగు చేసిన రైతులు ● 3.13 లక్షల టన్నుల ఉత్పత్తి
● రైతులకు మద్దతు ధరపై ఇప్పటి నుంచే కసరత్తు

**కర్నూలు(అగ్రికల్చర్):** జిల్లాలో ఈసారి పత్తి సాగు అంచనాలు మించిపోయింది. ఖరీఫ్‌లో పత్తి సాధారణ విస్తీర్ణం 2,08,221 హెక్టార్లు కాగా 2,24,090 లక్షల హెక్టార్లలో సాగైంది. దాదాపు 3.13 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం కరువు నుంచి పత్తి పంటే తమని గట్టెక్కించిందని రైతులు చెబుతున్నారు. ఎందుకంటే క్వింటం పత్తి రూ.5 వేలకు పైగానే గత ఏడాది అమ్ముడు పోయింది. దీంతో రైతులు ఈసారి అధికంగా పత్తి సాగు చేశారు. రాష్ట్రంలోనేగాక దేశ వ్యాప్తంగా ఈసారి పత్తి భారీగా సాగు చేస్తున్నందు వల్ల డిమాండ్ తగ్గి ధర పడిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం గుర్తించింది. అందుకని పత్తిసాగును నియంత్రించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. అయినా రైతులు ఎవరిమాట పట్టించుకోలేదని వ్యవసాయాధికారులు అంటున్నారు.



**సీసీఐపైనే ఆశలన్నీ:** కాటన్ కార్పొరేషన్ సంస్థ పైనే రైతులు, మార్కెటింగ్ శాఖ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఈ సంస్థ కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం క్వింటం పత్తి ధర రూ. 4,300 ప్రకటించింది. ఈ ధర దక్కినా తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే ఎంత మేర పత్తిని సీపీఐ సంస్థ కొనుగోలు చేస్తుందనేదే సమస్యగా మారిందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంటున్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో సీసీఐపై ఒత్తిడి తెస్తే తప్ప రైతుల నుంచి పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేసే అవకాశం ఉండదని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

**పత్తికొనుగోలుపై కసరత్తు జరుగుతోంది:** ఈసారి జిల్లాలో పత్తి ఉత్పత్తి 3.3 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తుండటంతో మార్కెటింగ్ శాఖ అధికారులు అప్రమత్తమవుతున్నారు. సీసీఐ ద్వారా పత్తికొనుగోలుకు 8 కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే పత్తి కొనుగోలుకు ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాలు తమ అవసరాలు పూర్తిగా తీర్చలేవని రైతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.



**జిల్లాలో పత్తి సాగు.. సబ్ డివిజన్ వారీగా (హెక్టార్లలో**

| సబ్ డివిజన్ | సాధారణం | సాగైంది |
|---|---|---|
| కర్నూలు | 23591 | 35504 |
| డోన్ | 7134 | 9561 |
| నందికొట్కూరు | 4081 | 5498 |
| ఆత్మకూరు | 124 | 214 |
| నంద్యాల | 5507 | 3767 |
| ఆళ్లగడ్డ | 493 | 140 |
| కోవెలకుంట్ల | 2267 | 710 |
| ఆదోని | 62311 | 63173 |
| ఎమ్మిగనూరు | 35579 | 43615 |
| ఆలూరు | 40754 | 35642 |
| పత్తికొండ | 219815 | 24658 |
| మొత్తం | 208221 | 22490 |

**ఏర్పాట్లు చేస్తాం..**

ఈ సారి అంచనాకు మించి పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. అయినా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. పత్తి కొనుగోలుకు సీపీఐ అధికారులను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**- ఏడీఎం సత్యనారాయణచౌదరి**

# నీళ్లు.. నీట్ కేంద్రం ఇవ్వండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎస్వీ వినతిపత్రం

**కర్నూలు(కార్పొరేషన్):** రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం ఈ మేరకు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హైదరాబాద్, విజయవాడ, తిరుపతి పట్టణాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తోందని అన్నారు. దీని వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో నిట్, జేఈఈ ప్రవేశ పరీక్ష కేంద్రాలు కర్నూలులో ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎస్వీ విజ్ఞప్తి చేశామన్నారు.

**తుంగభద్ర నీరు విడుదల చేయాలి:** కర్నూలు నగరంలో మంచినీటి అవసరాలకు తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నగర ప్రజల నీటి అవసరాలకు సరిపడ నీటి నిల్వలు లేక పోవడంతో వర్షాభావం వల్ల ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడుతున్నారని ముఖ్యమంత్రికి వివరించానన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేయించి మంచి నీటి సమస్య పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్వీ

# ఇక చంద్రన్న కర్తవ్యం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, మాట్లాడుతున్న సీఎం (ఫైల్)

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

నంద్యాల జనాభా 2.50 లక్షలు దాటుతోంది. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎస్ ట్యాంక్ ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు అందించలేని పరిస్థితి. అదే క్రమంలో కేసీ కాల్వకు నీటి సరఫరా ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా వెలుగోడు రిజర్వాయర్ నుంచి నంద్యాల ఎస్‌ఎస్ ట్యాంక్ వరకు పైపులైన్ నిర్మాణానికి అమృత పథకం కింద రూ.150 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ పనులు మొదలు కావాల్సి ఉంది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని జనం ప్రభుత్వంపై విశ్వాసంతో ఓట్లు వేశారు. తక్షణమే పనులు చేపట్టి గడువులోగా పూర్తి చేయాలి. గ్రామాల్లో సైతం రూ.98 కోట్లతో పైపులైను వేసి ఇంటింటికి కొళాయి ఇస్తామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుడుతామన్నారు. దాహం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కర్తవ్యం చంద్రన్నదే.

- సీఎం పిలుపునకు స్పందించిన నంద్యాల ఓటర్లు
- భారీ మెజార్టీతో ప్రగతికి పట్టం
- సుందర నంద్యాల బాధ్యత చంద్రబాబుదే

**ఆంధ్రజ్యోతి-కర్నూలు:** నంద్యాల ప్రజలు అభివృద్ధిని గెలిపించారు. సీఎం చంద్రబాబు ప్రగతి బాటలో నడిచారు. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించారు. ఇక ప్రభుత్వం నంద్యాల అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. ఇందు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. నంద్యాల ఉప ఎన్నికలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి మధ్య పోరు సాగింది. బరిలో ఉన్న అభ్యర్థులకన్నా వారి గెలుపు కోసం చివరి వరకు చెమటోడ్చిన పార్టీల అధినేతల మధ్య ఎన్నికగా మారింది. వైసీపీ అధినేత జగన్ ఓ అడుగు ముందుకేసి ఈ ఎన్నిక ఓ ఎమ్మెల్యేను ఎన్నుకోవడానికి కాదని, రాబోయే కురుక్షేత్రానికి నంద్యాల నాంది కావాలని, మీరు వేసే ఓటు జగన్‌కే అని పేర్కొన్నారు. అదే క్రమంలో నంద్యాలను పులివెందులలా మారుస్తానని.. 2019లో తాము అధికారం లోకి వస్తామని నంద్యాలను జిల్లాగా మారుస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్య మంత్రి చంద్రబాబు సైతం నంద్యాల ప్రగతిపై వరాల వర్షం కురిపించారు. సుందర నంద్యాలగా ఆవిష్కరించే పూచి తనదని, తనను నమ్మి ఓటు టానిక్‌ను అందిస్తే రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానని అన్నారు. చంద్రన్న మాటలు నమ్మిన పల్లె, పట్టణ ప్రజలు ఓట్లతో ఆశీర్వదించారు. ఓటర్లు ఇచ్చిన మాట నిలుపుకున్నారు. మిగిలిన కర్తవ్యం ప్రభుత్వానిదే.

## రహదారుల విస్తరణ

నంద్యాల పట్టణంలో రోడ్ల విస్తరణ 30 ఏళ్ల స్వప్నం. ఉప ఎన్నిక నోటిఫికేషన్ ముందు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేపడితే 85 శాతానికి పైగా ప్రజలు రోడ్ల విస్తరణ కావాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే రంగంలో దిగి శ్రీనివాస్ సెంటర్ నుంచి రాజ్ థియేటర్, పద్మావతి నగర్ ఆర్చ్, మార్కెట్ యార్డ్, టెక్కె, టూటౌన్ ఏరియా ప్రధాన రహదారి విస్తరణకు సై అంది. కట్టడాలు కూల్చి వేసి రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనుల కోసం రెండు ప్యాకేజీల్లో రూ.98 కోట్లతో చేపట్టారు. ఇప్పటికే 35 శాతానికి పైగా పనులు జరిగాయి. మిగిలిన పనులు గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలి. ఈ రోడ్డుతో పాటుగా ఇరుకుగా మారిన ఇతర రోడ్ల విస్తరణకు నడుం బిగించాలి.



నంద్యాలలో రోడ్డు విస్తరణ పనులు (ఫైల్)

### సొంతింటి కల సాకారం దిశగా..

సీఎం చంద్రబాబు భూమి పూజ చేసిన ప్రధాన పనుల్లో 13 వేల ఇళ్ల నిర్మాణం కీలకమైనది. ఎస్సార్బీసీ కాలనీలో ప్రభుత్వ స్థలంలో పక్కా ఇళ్లు కట్టించి స్వంత ఆస్తిని ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. రూ.835 కోట్లతో పనులు మొదలు పెట్టారు. కళ్ల ముందే ఇంటి నిర్మాణ ఇటుకలు పేరుస్తుంటే జనం ఓట్లు ఈవీఎం యంత్రాల్లో వేశారు. టీడీపీ అఖండ విజయం పొందేలా చేశారు. టౌన్‌షిప్‌గా మారుస్తానని సీఎం హామీ ఇచ్చారు. 2019 ఎన్నికలలోగా 13 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి టౌన్‌షిప్‌గా ఆధునికీకరించాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది.

### కుందూ ఆధునికీకరణ..

వానొస్తే నంద్యాల వాసులకు వరద భయం వెంటాడుతోంది. చామకాల్వ, కుందూనదిలో పూడికతీత, వంతెన నిర్మాణం పనులను రూ.9.5 కోట్లతో చేపట్టారు. ఆగమేఘాల మీద పూడికతీత పనులు పూర్తి చేశారు. చామకాల్వలో మురుగునీటి శుద్ధి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని, కుందూ నది వరద ముప్పు నుంచి రక్షణ చర్యలు చేపడుతామని, ఈ రెండు నదుల తీరం పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని సీఎం ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ, పంచాయితీ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేయాలి.

# మీ ఇల్లు సురక్షితం



- పోలీసు కెమెరాతో నిఘా కట్టుదిట్టం
- 'లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం' యాప్‌తో..
- 9 మున్సిపాలిటీల్లో అమలుకు సన్నాహాలు

**కర్నూలు:** 'ఊరికి వెళ్లినప్పుడు మీ ఇంటికి కాపలాగా పోలీసులు సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఇంట్లో ఏం జరుగుతుందో చూస్తారు. మీరు ప్రపంచంలో ఎక్కడున్నా మీ ఇంటిని నేరుగా చూసుకోవచ్చు. మీ ఇల్లు సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగలు లోపలికి ప్రవేశిస్తే వాడి చొక్కా, జుట్టు పట్టుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళుతోంది' అని గతనెల అనంతపురంలో జరిగిన ఓ సభలో సీఎం చంద్రబాబు నాయుడు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్' గురించి వివరించారు.

ఇకపై ఇళ్లలో దొంగతనాలను సులభంగా అరికట్టవచ్చు. దొంగలను క్షణాల్లో పట్టుకోవచ్చు. ప్రపంచంలో మనం ఏ మూల ఉన్నా మన ఇంటిని, ఇంట్లో పరిస్థితిని చరవాణిలో వీక్షించవచ్చు. ఇదెలా సాధ్యం అనుకుంటున్నారా..? పోలీసులు ప్రవేశపెట్టిన 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్' యాప్ ద్వారా ఇది సాధ్యం. ఈ యాప్‌ను మొదట తిరుపతిలో ప్రారంభించారు. అక్కడ దాదాపు 17 వేల మంది ఇంటి యజమానులు యాప్‌ను రిజిస్టర్ చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో అతి తక్కువ వ్యవధిలోనే 20వేల మంది రిజిస్టర్ చేసుకున్నారు. క్రమక్రమంగా లక్ష మందిని నమోదు చేయించి, ఎక్కడా ఒక్క దొంగతనం జరగకుండా చేయ్యడమే లక్ష్యమని ఎస్పీ గోపినాథ్‌జెట్టి అంటున్నారు. జిల్లాకు 50 సీసీ కెమెరాలు వచ్చాయి. ఇంకా మరిన్ని రానున్నాయి. ఈ యాప్, విధానం కర్నూలులో అమలవుతోంది.

### ఇలా రిజిస్టర్ చేసుకోవచ్చు



ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన వారు ముందుగా ప్లేస్టోర్‌లోకి వెళ్లాలి. అక్కడ 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్ చేయగానే 'రిజిస్టర్, రిక్వెస్ట్ పోలీస్ వాచ్' అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. ముందుగా రిజిస్టర్‌ను ఎంచుకోవాలి. అక్కడ పేరు, ఫోన్ నెంబర్, అడ్రస్‌లను నమోదు చేయాలి. 'గెట్ మై కరెంట్ లొకేషన్' అనే ఆప్షన్ కూడా కింద ఉంటుంది. దానిపై క్లిక్ చేసి మన ఇంటి లొకేషన్ (ప్రదేశం)ను గూగుల్ మ్యాప్ ద్వారా ఎంటర్ చేయాలి. ఇదంతా మన ఇంట్లో కూర్చుని చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే గూగుల్ మ్యాప్‌లో మనం ఉన్న లొకేషన్ (మన ఇల్లు) కచ్చితంగా నమోదవుతుంది. ఆ తర్వాత రిజిస్టర్ నౌ అనే బటన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడు ఓటీపీ వెరిఫికేషన్ ఫాం వస్తుంది. అదే సమయంలో ఓటీపీ నెంబర్ మీ సెల్‌కు మెసేజ్ వస్తుంది. ఆ తర్వాత ఓటీపీ నెంబర్‌ను ఎంటర్ చేయాలి. అప్పుడు ఓటీపీ వెరిఫైడ్ సక్సెస్‌ఫుల్ అనే మెసేజ్ వస్తుంది. ఆ తర్వాత 'ఓకే' బటన్ ప్రెస్ చేస్తే మీ రిజిస్ట్రేషన్ సక్సెస్ అయినట్లు నెంబర్ వస్తుంది. ఆ నెంబర్ భద్రంగా ఉంచుకోవాలి. భవిష్యత్తులో మన ఇంటికి పోలీసులు భద్రత ఇవ్వడానికి సులువుగా ఉంటుంది. ఇది ప్రతి ఒక్కరూ చేసుకోవాల్సిన ప్రక్రియ. ఇది పూర్తయిన తర్వాత మనకు ఒక 'యూజర్ ఐడీ' జనరేట్ అవుతుంది. దాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఈ యాప్ కూడా అతి తక్కువగా 1.26 ఎంబీ (నిల్వ సామర్థ్యం) కలిగి ఉంటుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకుంటే సెల్‌ఫోన్‌కు ఎలాంటి నష్టం ఉండదు. అయితే పోలీసులు కర్నూలు, నంద్యాల, ఆదోని మున్సిపాలిటీల్లో తామే స్వయంగా వెళ్లి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్టర్ చేయిస్తున్నారు.

### మనం ఊరెళ్లేటప్పుడు ఏం చేయాలంటే..



పని మీద మనం ఏదో ఒక ఊరికి వెళ్తాం. ఆ సమయంలో ఈ యాప్ ద్వారా మన ఇంటిని సురక్షితంగా ఉంచుకోవచ్చు. రిజిస్టర్ చేసుకున్న ప్రతి ఒక్కరూ ఏదైనా ఊరెళ్లే సందర్భంలో ఈ యాప్‌లో వెళ్లి 'రిక్వెస్ట్ పోలీస్ వాచ్' అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. అందులో మన 'యూజర్ ఐడీ'ని ఎంటర్ చేయాలి. మనం ఊరెళ్లే తేదీ, సమయంతో పాటు తిరిగొచ్చే వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ సమయంలో పోలీసులు భద్రత ఇవ్వడానికి వీలుగా ఉంటుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత చివరగా 'సబ్‌మిట్ రిక్వెస్ట్'ను క్లిక్ చేయాలి. ఈ వివరాలు అన్ని కంట్రోల్ రూంలో ఉన్న మానిటర్స్‌లో ప్రత్యక్షమవుతాయి. మనం అలా చేసిన వెంటనే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్ నుంచి ఒక పోలీస్ మన ఇంటికి వస్తారు. సీసీ కెమెరాను విలువైన వస్తువులుండే గదిలో ఎవ్వరికీ కనిపించకుండా అమర్చుతారు.

### జిల్లాలో పరిస్థితి..

గత ఎస్పీ ఆకె రవికృష్ణ వెంకటరమణ కాలనీలోని రోడ్ నెం.3 లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన బదిలీ అయిన తర్వాత ఎస్పీగా గోపినాథ్ జెట్టీ వచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు, నంద్యాల, ఆదోనిలో పోలీసులు ఇంటింటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను రిజిస్టర్ చేసుకునే విధానాన్ని వివరిస్తున్నారు. దీంతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలలు, అపార్ట్‌మెంట్లలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.




మంగళవారం నగరంలోని రామచంద్రనగర్‌లో దొంగలు పగులగొట్టిన తాళం

### సాంకేతికతతో దొంగతనాల నివారణ



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా దొంగతనాలను నివారించేందుకు చర్యలు ప్రారంభించాం. ఈ యాప్ అత్యాధునిక టెక్నాలజీతో కూడుకుంది. జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే 50 కెమెరాలు వచ్చాయి. అవసరాన్ని మరికొన్ని కెమెరాలు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

**- ఎస్పీ గోపినాథ్ జెట్టి**




### దొంగల్ని ఎలా పట్టుకోవచ్చంటే..

మనం ఊరెళ్లిన తర్వాత ఇంట్లో కెమెరా కన్ను ఉంటుంది. కెమెరా అమర్చిన గదిలో చిన్నపాటి అలికిడి కలిగిన కెమెరా వెంటనే పని చేయడం ప్రారంబిస్తుంది. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని అందిస్తుంది. అక్కడ అలారం మోగుతుంది. వెంటనే కంట్రోల్ రూం పోలీసులు సమీప పోలీసులకు సమాచారం ఇస్తారు. వెంటనే పోలీస్ అధికారులు వెంటనే చేరుకొని సులభంగా దొంగను పట్టుకుంటారు. కెమెరా అమర్చిన గదిలో అలజడి కలిగితే పోలీసులే కాదు మన సెల్‌పోన్‌లోనూ స్వయంగా వీక్షించవచ్చు. అంతేకాదు ప్రతి క్షణం మనం మన ఇంట్లో (కెమెరా ఉన్న గది) జరుగుతున్న పరిస్థితుల్ని సెల్‌పోన్‌లో చూసుకునేలా యాప్‌ను రూపొందిస్తున్నారు.

### పట్టపగలే చోరీలు

దొంగలు పట్టపగలే స్వైర విహారం చేస్తున్నారు. నగరంలో మంగళవారం రెండిళ్లతో దొంగతనాలు చేశారు. రామచంద్రనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కోటీశ్వరులు అనే వ్యక్తి కుటుంబం తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి 2 గంటలకు వచ్చే సరికి ప్రహరీ గేటు, ప్రధాన ద్వారం తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. అనుమానంతో లోపలికి వెళ్లి చూస్తే బీరువా చెల్లాచెదురై ఇంట్లో ఉన్న 90 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ. లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. కోటీశ్వరుల ఇంట్లో చోరీ గురించి పోలీసులు ఆరా తీస్తుండగానే క్రిష్ణానగర్‌లోని పాత తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్టు పోలీసులకు సమాచారం అందింది. వాణి అనే మహిళ స్థానిక శరీన్‌నగర్ జడ్పీహెచ్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి చూస్తే తలుపు తెరిచి ఉంది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారు నగలు, రూ.15 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు.



చోరీకి గురైన బీరువా

# స్వచ్ఛ ఉత్సవం

- రేపటి నుంచి పాఠశాలల్లో ప్రారంభం
- స్వచ్ఛ విద్యాలయంపై పోటీలు
- మొక్కల దత్తత స్వీకారం

**కర్నూలు(ఎడ్యుకేషన్):** పాఠశాలల్లో స్వచ్ఛ ఉద్యమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలో స్వచ్ఛ విద్యాలయ ఉత్సవానికి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం సెప్టెంబరు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనుంది. అధికారులు ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

ప్రతి పాఠశాలలో ఈ ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి స్వచ్ఛ విద్యాలయంపై తయారుచేసిన ప్రేరణాత్మక వీడియోలు, ప్రతిజ్ఞ యూ ట్యూబ్‌లో ఆరు రకాల పాటలు, రోజూవారి కార్యక్రమాల వివరాలు రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి విడుదలయ్యాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో స్వచ్ఛ విద్యాలయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలో వన మహోత్సవం, పరిశుభ్రత, దాతల సహకారంతో నీటి సదుపాయం కల్పించే చర్యలు తీసుకుంటారు.

### పోటీల నిర్వహణ..బహుమతుల ప్రదానం

పిల్లల పరిశుభ్రతపై అవగాహన పెంచడానికి పాఠశాల, పాఠశాల సముదాయం (స్కూల్ కాంప్లెక్స్)లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేయనున్నారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ప్రతి పాఠశాలలో ఉత్సవాలు నిర్వహించి ప్రతిరోజూ కార్యక్రమం నిర్వహణపై నివేదికలు, ఫొటోలు, ప్రాజెక్టు అధికారికి అందజేయాలని సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వై. రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు పోస్టర్లను అందించామన్నారు.



ఫైల్ ఫొటో

### ఉత్సవాల నిర్వహణ ఇలా

- సెప్టెంబరు 1న స్వచ్ఛ విద్యాలయంపై మండల స్థాయిలో జడ్పీటీసీ సభ్యులు, ఏపీపీలు, ఎంపీడీవోలు తహసీల్దార్లు, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు నిర్వహిస్తారు.
- 4వ తేదీన పాఠశాల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ చైర్మన్, ఎస్‌ఎంసీ సభ్యులచే, ఏఎన్‌ఎం, ఏడబ్ల్యూడబ్ల్యూ మహిళా సభ్యులచే అవగాహన ర్యాలీ ఏర్పాటు చేస్తారు.
- 5న వన మహోత్సవంలో మొక్కలు నాటడం, మొక్కల ఉపయోగాలు, నాటిన మొక్కల దత్తత గురించి విద్యార్థులకు తెలియజేస్తారు.
- 6న పాఠశాలలో పాత దస్త్రాలు, పాడైన ఫర్నిచర్, పరికరాలను తొలగించి శుభ్రం చేస్తారు.
- 7న పాఠశాల తరగతి గదుల అలంకరణ, పాఠశాల రికార్డులు, పిల్లల పుస్తకాలకు అట్టలు వేసే కార్యక్రమం.
- 8న పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛ విద్యాలయంపై వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు.
- 11న పాఠశాల సముదాయ స్థాయిలో విద్యార్థులకు (పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారికి) పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు.
- 12న విద్యాలయ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చుకోవడం, రన్నింగ్ వాటర్ సదుపాయం, వీటి కోసం దాతల సాయం అందేలా చూసుకోవడంపై అవగాహన కల్పిస్తారు.
- 13న మండల స్థాయి విద్యార్థులకు (సముదాయ స్థాయిలో గెలుపొందిన వారికి) వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు.
- 14న విద్యాలయంలో స్వచ్ఛత కోసం జరిగిన కార్యక్రమాలు, ఫొటో ప్రదర్శన, తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తారు.
- 15న మండల స్థాయిలో గెలిచిన వరికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు.

# 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



**ఎస్.మహిపాల్‌రెడ్డి**
సీనియర్ ఫ్యాకల్టీ

**1. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

**2. చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

**3. పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

**4. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

**5. ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

**6. భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

**7. ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్

**8. తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కధువా సి) కార్గిల్ డి) రాజేరి

**9. అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

**10. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా



**11. జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

**12. ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

**13. 101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

**14. ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

**15. ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

**16. దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

**17. ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

**18. 'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

## జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

**19. ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

**20. దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)

**21. రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్తుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహాని

**22. ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు

**23. తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

**24. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)

**25. ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

**26. ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

**27. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

**28. జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

**29. లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

**30. భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

**31. ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా

**32. స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ



**33. ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

**34. 2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

**35. నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తముర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

**36. షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

**37. 2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

**38. బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్

**39. 'జార్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

**40. 2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

**సమాధానాలు**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) సి | 7) డి | 13) బి | 20) ఎ | 27) బి | 34) బి | |
| 2) డి | 8) డి | 14) సి | 21) డి | 28) ఎ | 35) ఎ | |
| 3) బి | 9) ఎ | 15) బి | 22) బి | 29) డి | 36) డి | |
| 4) ఎ | 10) బి | 16) బి | 23) బి | 30) ఎ | 37) సి | |
| 5) ఎ | 11) బి | 17) సి | 24) ఎ | 31) డి | 38) బి | |
| 6) బి | 12) డి | 18) సి | 25) బి | 32) ఎ | 39) డి | |
| | | 19) ఎ | 26) డి | 33) డి | 40) బి | |

## JOBS ఉద్యోగాలు

### ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 173
**పోస్టుల వారీ ఖాళీలు:** స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
**అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
**వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్స్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
**అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 14
**సిబిటి నిర్వహించే తేదీ:** అక్టోబరు 29
**దరఖాస్తు ఫీజు:** రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 25
**వెబ్‌సైట్:** www.asrb.org.in, www.icar.org.in

### ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్**
**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
**గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్**
**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
**ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్**
**అర్హత:** ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
**ఇమెయిల్:** recruitment@iiits.in
**వెబ్‌సైట్:** www.iiits.ac.in

### ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
**ఖాళీలు:** 5
**పోస్టులు:** జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్థోపెడిక్స్ 1)
**కాంట్రాక్ట్ వ్యవధి:** ఆరు నెలలు
**అర్హత - వేతనం:** సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
**ఇంటర్వ్యూ:** సెప్టెంబరు 13న
**వేదిక:** Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
**ఇ-మెయిల్:** adhocrstps@ntpc.co.in

# నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?

## ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం
2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్
3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్
4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం
5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్
6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్
7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ
8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు
9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు
10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం
11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2
12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్
13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్
14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్
15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ ఫెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్
16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ
17. ఆర్ధ్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్
18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా
19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు
20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ద్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది
21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

## జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది
23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల
24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం
25. థర్మో ఫ్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ఫ్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి
26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు
27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే
28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్
29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు
30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం
31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C
32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు
33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం
34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం
35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%
36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం
37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6
38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6
39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16
40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు
41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని
42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ద్రత
43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి
44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్
45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

**సమాధానాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) బి | 8) బి | 15) సి | 23) బి | 31) ఎ | 39) ఎ |
| 2) బి | 9) ఎ | 16) డి | 24) సి | 32) సి | 40) ఎ |
| 3) సి | 10) ఎ | 17) సి | 25) డి | 33) ఎ | 41) డి |
| 4) ఎ | 11) ఎ | 18) ఎ | 26) ఎ | 34) డి | 42) ఎ |
| 5) డి | 12) సి | 19) సి | 27) డి | 35) ఎ | 43) సి |
| 6) సి | 13) ఎ | 20) బి | 28) బి | 36) ఎ | 44) డి |
| 7) సి | 14) బి | 21) ఎ | 29) బి | 37) డి | 45) సి |
| | | 22) సి | 30) సి | 38) ఎ | |

## స్కాలర్‌షిప్

### నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్‌ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

**విభాగాలు:** ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్
**అర్హత:** నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు
**వయసు:** 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి
**విభాగం:** జూనియర్ సైన్స్
**అర్హత:** నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**వయసు:** 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.
ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్‌ఇ) నిర్వహిస్తుంది.
**స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్:** నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్‌ఎస్‌ఇఏ), బయాలజీ (ఎన్‌ఎస్‌ఇబి), కెమిస్ట్రీ(ఎన్‌ఎస్‌ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్‌ఎస్‌ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్‌ఎస్‌ఇపి)
**పరీక్ష తేదీలు:** ఎన్‌ఎస్‌ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న
**ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 15
ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.
**స్టేజ్ 2 ఎగ్జామ్స్:** ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్‌ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్‌ఒ, ఐఎన్‌జెఎస్‌ఒ, ఐఎన్‌పిహెచ్‌ఒ)
**స్టేజ్ 3:** ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది.
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
**వెబ్‌సైట్:** www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

## అడ్మిషన్స్

### ఎన్ఐఇఎల్ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

**విభాగాలు:** క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ
**కాలవ్యవధి:** 24 వారాలు
**కోర్సులు ప్రారంభం:** సెప్టెంబరు 18 నుంచి
**విభాగం:** ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్
**కోర్సు వ్యవధి:** 24 వారాలు
**కోర్సు ప్రారంభం:** సెప్టెంబరు 25 నుంచి

**జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు**

- **బిగ్ డేటా అనలిటిక్స్**

**కోర్సు కాలవ్యవధి:** 16 వారాలు
**కోర్సు ప్రారంభం:** సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

**కోర్సుల కాల వ్యవధి:** 12 వారాలు
**కోర్సులు ప్రారంభం:** సెప్టెంబరు 11 నుంచి
**వెబ్‌సైట్:** http://nielit.gov.in/calicut

## నేడు పీఎంఏవైపై గ్రామసభలు

**చాగలమర్రి:** మండలంలో ప్రజా సాధికార గృహ నిర్మాణ లబ్ధిదారుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. 31న చిన్నబోదనం, బ్రాహ్మణపల్లె, నేలంపాడు, సెప్టెంబర్ 4న గొడిగనూరు, శెట్టివీడు, గొట్లూరు, చింతలచెరువు, మల్లేవేముల, 5న చాగలమర్రి, డి.వనిపెంట, రాంపల్లె, చిన్నవంగలి, 6న ము త్యాలపాడు, పెద్దబోదనం, 7న చాగలమర్రి, తోడెండ్లపల్లె, పెద్దవంగలి, 8న చాగలమర్రి, కలుగొట్లపల్లె, మద్దూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు చేస్తామని డీఈ తెలిపారు. ఆయా గ్రామాల్లో మూడు టీమ్‌లు గ్రామసభలు నిర్వహించి నివేధికలను తయారు చేయాలని అన్నారు.

# వరుస వర్షాలతో వైరస్ తెగులు

### 200 ఎకరాల్లో దెబ్బతిన్న మిరప పంట ● రూ.కోటి నష్టం ● ఆందోళనలో రైతులు

**రుద్రవరం:** వరుసగా కురుస్తున్న వర్షాలతో మిరప పంటకు వైరస్ తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోయామని రైతులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె, పేరూరు, రుద్రవరం, ఆలమూరు, నాగులవరం, నరసాపురం గ్రామాల్లో 500 ఎకరాల్లో మిరప తోటలు సాగు చేశారు. వీటిలో వర్షాలు కురవటంతో 200 ఎకరాల్లో మిరప తోటలకు వైరస్ తెగుళ్లు సోకి మిరప మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరుణుడు కరుణించిన ప్రకృతి దాడికి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. ఒక్కొక్క ఎకరాకు రూ.50 వేలు చొప్పున 200 ఎకరాల్లో సాగు చేసిన మిరపకు రూ.కోటి నష్టం వాటిల్లింది. మిరప మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. వర్షాలు కురవటంతో మిరప మొక్క ఆకులు సుడి చుట్టుకొని ఎండిపోతున్నాయి.



వైరస్ సోకి దెబ్బతిన్న మిరప పంట

### వైరస్ తెగులు సోకి..



వర్షాలు కురవటంతో మిరప పంటకు వైరస్ తెగులు సోకటంతో మిరప మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మిరప పంట ఎంతో ఆశగా సాగు చేస్తే ప్రకృతి నిరాశే మిగిల్చిందని వాపోయాడు.

- తిరుపతిరెడ్డి, రైతు, పేరూరు

### రెండు ఎకరాల పంట నష్టపోయా



మిరప పంటను రెండు ఎకరాల్లో సాగు చేశా. వర్షం కురిసిందని ఆనందపడే సమయంలో మిరప పంటకు వైరస్ తెగులు సోకి మిరప మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ఒక్కో ఎకరాకు రూ.50 వేలు చొప్పున పెట్టుబడి పెట్టాం.

- వెంకటేశ్వర్లు, రైతు, బి.నాగిరెడ్డిపల్లె

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**ఎంపీడీవో నీరజ**



**రుద్రవరం:** మండలంలోని 20 పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. మురుగు నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు, అంటురోగాల నుంచి దూరంగా ఉండవచ్చు.

**ప్ర: గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది కదా?**
**జ:** గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశాం.

**ప్ర: దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**
**జ:** గ్రామాల్లో మురుగు కుంటల్లో మోలాసిన్ పిచికారి చేయించాలని ఆదేశాలు జారీ చేశాం.

**ప్ర: పారిశుధ్య పనులు చేపట్టారా?**
**జ:** పారిశుధ్యం పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్ర: పందుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.**
**జ:** పందులను గ్రామానికి దూరంగా పెంచుకోవాలని వాటి యజమానులను ఆదేశించాం.

**ప్ర: అంటువ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**
**జ:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు సేకే ప్రమాదం ఉంది. అందుకే వైద్య శాఖ అధికారులతో శిబిరాలు నిర్వహిస్తున్నాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరాం.

**ప్ర: చెంచుగూడెల్లో చెంచులకు దోమతెరలు పంపిణీ చేస్తున్నారా?**
**జ:** చెంచులకు దోమతెరలు పంపిణీ చేసే అంశంపై ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## 'గ్రంథాలయాభివృద్ధికి సహకరించండి'

**దొర్నిపాడు:** గ్రంథాలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య కోరారు. బుధవారం గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట పాఠశాలలోని 4, 5 తరగతి విద్యార్థులకు దేశభక్తి గీతాలు, పద్య పఠనం, చదరంగం, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా టి.విజయ్‌కుమార్, రెండో విజేతగా ఎస్.రజాక్, మూడో విజేతగా ఎస్.అనూష ప్రతిభ కనబరిచారు. గురువారం 6, 7 తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## 'బదిలీ పాధ్యాయులకు సన్మానం'

**రుద్రవరం:** సమాజంలో గౌరవ ప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి అని బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుడిదిన్నె మజరా మాచినేనిపల్లె ప్రాథమిక పాఠశాల నుంచి వెలుగోడు మండలం వెల్పనూరు పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లును గ్రామస్థులు పూలమాల, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రామయ్య, విజయ్, శేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**ఉయ్యాలవాడ:** మండల పరిధిలోని కాకరవాడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ సర్వాయిపల్లెకు బదిలీ అయిన ఉపాధ్యాయడు శ్రీధర్‌ను ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో దండె ఆదినారాయణరెడ్డి, బేసి మధుసూదన్‌రెడ్డి, చెన్నూరు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** మండల పరిధిలోని అర్జునాపురం గ్రామ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై డబ్ల్యూ.గోవిందిన్నెకు వెళ్తున్న ఉపాధ్యాయుడు ఎన్.గిరిబాబును గ్రామ పెద్దలు, తోటి ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీమ్, మస్తాన్‌వలి, గ్రామ పెద్దలు పుల్లయ్య, రామచంద్రుడు, బాల ఉసేని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** శిరివెళ్లలోని ఉర్దూ ప్రభుత్వ బాలుర పాఠశాలలో బదిలీపై వెళ్తున్న అబ్దుల్ మునాఫ్, మహమ్మద్ రఫీ, గౌసియా నసీమ్, గౌస్‌బీ అనే ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహబూబ్‌ఖాన్, ఎంపీడీవో సద్గుణ బాయి, శిరివెళ్ల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో మహబూబ్‌బాషా

**శిరివెళ్ల:** శిరివెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఫర్హీన్ అనే విద్యార్థిని సబ్‌జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. కర్నూలులో ఈనెల 20న జరిగిన అసోషియేషన్ గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడలో విద్యార్థిని ఫర్హీన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆయన బుధవారం అభినందించారు. సెప్టెంబర్ 1 నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్‌హక్, పీఈటీ షబాన, విద్యార్థిని తండ్రి ఖాజాఫరిద్ పాల్గొన్నారు.

## 'పేదలకు ఉచిత న్యాయ సహాయం'

**ఉయ్యాలవాడ:** మండలంలోని పేదలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ న్యాయవాది విష్ణు మనోహర్‌రెడ్డి కోరారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఆయన పేదల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఉయ్యాలవాడకు చెందిన లక్ష్మీదేవి తన భర్త శ్రీధర్‌పై ఫిర్యాదు చేశారు. దీపం పథకం గ్యాస్ అందటం లేదని, మరుగుదొడ్ల బిల్లులు చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై ఉచితంగా న్యాయ విచారణ చేపడతామని అన్నారు. కార్యక్రమంలో లాయర్ ఓబులేసు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## 'వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోండి'

**దొర్నిపాడు:** రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రాబ్యాంకు మేనేజర్ ఎస్.రాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు రూ. లక్ష వరకు వడ్డీలేని పంట రుణం ఇస్తామన్నారు. రూ.లక్షకు పైగా తీసుకున్న రైతులకు పావలా వడ్డీ వర్తిస్తుందని అన్నారు. నేటి నుంచి దొర్నిపాడు ఆంధ్రాబ్యాంకులో రైతులకు క్రాప్‌లోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రైతుల పంట పొలాలను బట్టి రుణాలు ఇస్తామన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

**మండల వ్యవసాయాధికారి చెన్నయ్య**

**చాగలమర్రి:** ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని మండల వ్యవసాయాధికారి చెన్నయ్య తెలిపారు. బుధవారం మద్దూరు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆయన అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులను అధికంగా వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం భూసార పరీక్ష ఫలితాల పత్రాలను సర్పంచ్ భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం, ఏఈవోలు మంజుల, రేవతి, నర్సమ్మ, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## 'చంద్రన్న సంచార పశువైద్య శిబిరాలు'

**చాగలమర్రి:** మండలంలోని చింతలచెరువు గ్రామంలో చంద్రన్న సంచార పశువైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. సంచార పశువైద్యాధికారి బాబా పక్రుద్దీన్ గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేస్తున్నామని అన్నారు. వర్షాలు కురుస్తుండటం వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా ఆవులు, గేదెలకు వ్యాధి సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించాలని అన్నారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది సూర్యతేజ, వీరయ్య, గోపాలమిత్రలు ఉన్నారు.

## మన పట్టణంలో..

### సినిమాలు

| | |
|---|---|
| ప్రతాప్ | : ఆనందో బ్రహ్మ |
| భవాని | : అర్జున్ రెడ్డి |
| శ్రీరామ మినీ | : మాయన్మార్ |
| ఏవీ | : జయ జానకి నాయక |
| రామలక్ష్మి | : వీఐపీ-2 |

### మార్కెట్ ధరలు

| కూరగాయలు | కిలో(రూ.లలో) |
|---|---|
| టమోటాలు | 30 |
| వంకాయలు | 30 |
| బంగాళాదుంప | 20 |
| మట్టికాయలు | 30 |
| బీన్స్ | 40 |
| కాకరకాయలు | 30 |
| క్యాలిఫ్లవర్ | 30 |
| బెండకాయలు | 40 |
| క్యారెట్ | 30 |
| క్యాబేజి | 40 |
| ముల్లంగి | 30 |
| బీరకాయలు | 40 |
| దొండకాయలు | 30 |
| బీట్రూట్ | 40 |
| పచ్చిమిర్చి | 30 |
| ఉల్లిగడ్డలు | 25 |
| చిక్కుడు కాయలు | 40 |
| కొత్తిమీర కట్ట | 20 |
| అల్లం | 80 |

# చంద్రన్న సంచార వైద్య శిబిరాలు

**చాగలమర్రి:** మండలంలోని డి.వనిపెంట, గొడిగనూరు గ్రామాల్లో చంద్రన్న సంచార వైద్య శిబిరాలను బుధవారం వైద్యుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాలలో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో ఫార్మాసిస్టు సంజీవరాయుడు, ల్యాబ్ టెక్నిషియన్ బాలు, ఏఎన్ఎం మేరి, ఫైలెట్ జోజప్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి పంటను నమిలేస్తున్న

# గులాబీ రంగు పురుగు

● ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో 1,780 ఎకరాలు సాగు
● ఆందోళనలో రైతులు

**రుద్రవరం:** పత్తి పంటను గులాబిరంగు పురుగు నమిలేస్తోంది. పత్తి పంట 150 నుంచి 160 రోజులకు దిగుబడి వస్తుంది. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో 1,780 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంట పొలాల్లో పచ్చగా కళకళలాడుతోంది. రుద్రవరం మండలంలో పేరూరు, చిలుకలూరు, ఎర్రగుడిదిన్నె, రుద్రవరం, చిత్రేణిపల్లె, ఆలమూరు, చందలూరు, మందలూరు గ్రామాల్లో రైతులు సాగు చేశారు. పత్తి పంటకు 55 రోజుల తరువాత పూత దశకు వస్తుంది. 80 రోజుల తరువాత పత్తి పంటలో గులాబి రంగు పురుగు కనిపిస్తుంది.

**గులాబిరంగు పురుగుల లక్షణాలు**

పత్తి సాగులో గులాబి రంగు పురుగు పురుగు ఉన్న పువ్వు రెక్కలు ముడుచుకొని ఉంటాయి. రైతు భాషలో ఈ పువ్వులను గుడ్డిపూలు అని పిలుస్తారు.

**నివారణ:** పూత దశలో గుడ్డి పువ్వులు కనిపిస్తే వాటిని పంట నుంచి వేరుచేసి కాల్చి వేయాలి. ఈ గుడ్డి పువ్వు లోపలి భాగంలో గులాబిరంగు పువ్వు చేరి తినేస్తుండడంతో పువ్వు ముడుచుకుంటుంది.



**పురుగు నివారణకు.. 5 లింగాకర్షణ బుట్టలు**

పత్తి సాగులో పురుగు నివారణకు 5 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని గమనించాలి. ఈ లింగాకర్షన బుట్టలో మగ పురుగులు పడిపోతాయి. బుట్టల్లో పడిన పురుగులను చంపి వేయాలి. అలా చంపి వేయటంతో మగ పురుగులు లేకుండా చేయటం ద్వారా పురుగు సంతతి అభివృద్ధి చెందకుండా అరికట్టవచ్చు.

**పూత దశలో.. :** పత్తి సాగులో గులాబి రంగు పురుగు పూత దశలో కనిపిస్తుంది. వెంటనే రైతులు క్లోరోఫైరిఫాస్ లీటర్ నీటికి రెండున్నర ఎంఎల్, డైమోడి కార్బ్ ఒకట్టిన్నర గ్రాము నీటిలో కలిపి పిచికారి చేయాలి. అలా చేస్తే పురుగు నుంచి పత్తి మొక్కను కాపాడవచ్చు. గులాబి రంగు పురుగు పత్తి కాయలోకి ప్రవేశించిన తరువాత కాయ రంధ్రం మూసుకపోతుంది. దీంతో పురుగు కాయ లోపలి భాగంలో ఉండి తినేస్తుంది. కాయలోని పత్తి గులాబిరంగులోకి మారి నాణ్యత దెబ్బతింటుంది.

**రసం పీల్చే పురుగులు:** పత్తి నాటిన వారం నుంచి చివరి వరకు రసం పీల్చే పురుగులు, పెనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, తామరపువ్వు ఉంటుంది.

**మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా**

మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. పంట పూతదశలో ఉండనే గులాబిరంగు పురుగు ఆశించి తొలిచేస్తోంది. దీంతో కాయ ఏర్పడే అవకాశంలేదు. వెంటనే గులాబిరంగు పురుగును నివారించకుంటే తీవ్రంగా నష్టపోతాం.



\- గురుస్వామి, రైతు, బి.నాగిరెడ్డిపల్లె

**నివారణ ఇలా చేయాలి..**

గులాబి రంగు పురుగుల నివారణకు లీటర్ నీటికి 5 ఎంఎల్ వేప నూనె కలిపి పిచికారి చేయాలి. ఇమిడా క్లోఫిడ్(కాన్ఫిడార్) 0.5 ఎంఎల్ ఒక లీటర్ నీటికి, అసిటామిఫ్రైడ్ 0.2 గ్రాములు పిచికారి చేస్తే నివారించవచ్చు.



\- ప్రసాదరావు, వ్యవసాయాధికారి, రుద్రవరం

# 'మానవ మనుగడకు మొక్కలే ఆధారం'



దొర్నిపాడులో మొక్కలు నాటుతున్న భూమా నారాయణరెడ్డి

**దొర్నిపాడు:** మానవ మనుగడకు మొక్కలే ఆధారమని పాల డెయిరీ ఛైర్మన్ భూమా నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూమా నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రెడ్డి యాదవ్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాముడు, వెలుగు ఏపీఎం తిక్కన్న, టెక్నికల్ అసిస్టెంట్ ఉసేనయ్య, సాక్షరభారత్ మండల కో-ఆర్డినేటర్ జర్మియ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పలసాని బాలిరెడ్డి కోరారు. బుధవారం పి.చింతకుంట ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికలో మొక్కలు నాటారు. గ్రామంలోని ఎస్సీలకు శ్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో ఎకరా పొలాన్ని కేటాయించి, ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి ఎస్సీలతో కలిసి మొక్కలు నాటారు. అలాగే కేసీ కాలువ వెంట ఆయన వంద మొక్కలకు పైగా నాటారు. కార్యక్రమంలో శివనాగిరెడ్డి, వీఆర్వో గోపాల్‌రెడ్డి, రంగేశ్వరరెడ్డి, చింతకుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు



గణేష్ ఉత్సవ కమిటి కేంద్ర గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్

**ఆళ్లగడ్డ:** పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన వారందరికీ గణేష్ ఉత్సవ కమిటీ కేంద్ర గౌరవాధ్యక్షుడు టీఎంసీ వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం భారతీ విద్యా మందిరంలో ఉత్సవ కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా విగ్రహాల నిర్వాహకులు, యువకులు చర్యలు తీసుకోవటం అభినందనీయమని అన్నారు. ఉత్సవాల్లో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు త్రినేత్ర మోహన్‌రెడ్డి, న్యాయవాదులు నీలకంఠం, మధు, పడకండ్ల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'సర్వే పటిష్ఠంగా నిర్వహించాలి'

**చాగలమర్రి:** ప్రజా సాధికార సర్వే పటిష్టంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీలత తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శులు, వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణాల లబ్ధిదారుల పల్స్ సర్వేను నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అన్నారు. 2016లో ప్రజా సాధికార సర్వే ఆధారంగా మండలంలో 2,922 మంది గృహ లబ్ధిదారులను గుర్తించారని తెలిపారు. తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామాల్లో సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం నివేదిక తయారు చేసి సెప్టెంబర్ 8లోగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుబ్బారెడ్డి, ఆర్ఐ కేశాల్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

**రుద్రవరం:** ప్రభుత్వం అందించే గృహాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నీరజ బుధవారం తెలిపారు. ఇందుకోసం సెప్టెంబర్ 1 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సభలు తహసీల్దార్ శివరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. 1వ తేదీ బీరవోలు, టి.లింగందిన్నె, చందలూరు, 4వ తేదీ చిన్నకంబలూరు, ఆలమూరు, చిలుకలూరు, 5వ తేదీ డి.కొట్టాల, శ్రీరంగాపురం, ముత్తలూరు, ఎర్రగుడిదిన్నె, 6వ తేదీ కోటకొండ, నరసాపురం, కొండమాయపల్లె, 7వ తేదీ పెద్దకంబలూరు, నాగులవరం, మందలూరు, 8వ తేదీ ఎల్లావత్తుల, రుద్రవరం, పేరూరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు.

**ఉయ్యాలవాడ:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31న హరివరం, నర్సిపల్లె, ఇంజేడు, సర్వాయిపల్లెలో, సెప్టెంబర్ 1న కొండుపల్లె, బోడెమ్మనూరు, తుడుమలదిన్నె, మాయలూరు గ్రా మాల్లో, 4న ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, సుద్దమల్ల పడిగపాడు, 5న ఉయ్యాలవాడ, రూపనగుడి, గోవిందపల్లె, 6న కాకరవాడ, 7న అల్లూరు, కొత్తపల్లె, 8న ఆర్.పాంపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని అన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో దండోర వేయించి మైకుల ద్వారా ప్రజలకు తెలపాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారాయుడు పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** మండలంలోని గ్రామాల్లో గృహ లబ్ధిదారుల కోసం గురువార నుంచి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సద్గుణబాయి బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 31న మహదేవపురం, కామినేనిపల్లె, గోవిందపల్లె, 4న బోయలకుంట్ల, వనికిందిన్నె, శిరివెళ్ల గ్రామాల్లో, 5న గంగవరం, జీనెపల్లె గ్రామాల్లో, 6న కోటపాడు, గుంప్రమాన్‌దిన్నె గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 7, 8 తేదీల్లో చెన్నూరు పంచాయతీ, మజరా గ్రామాల్లో, అలాగే యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో అధికారులు సర్వే నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, ఈవోపీఆర్డీ శివమల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

# 'గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి'

**చాగలమర్రి:** గ్రామాల్లో ఎన్టీఆర్ పక్కా గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో 508 ఎన్టీఆర్ పక్కా గృహాలు మంజూరయ్యాయని అన్నారు. బేసిమెంట్ పనులు పూర్తి చేసుకున్న 30 మంది లబ్ధిదారులకు బిల్లులు అందించామని అన్నారు. బేసిమెంట్ వేసుకోని లబ్ధిదారులకు ఇల్లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# 'ఫిర్యాదులు పరిష్కరించాలి'

**చాగలమర్రి:** మీ ఇంటికి మీ భూమి ఫిర్యాదులు పరిష్కరించేందుకు వీఆర్వోలు తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మాలకొండయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొలతలు వేసేందుకు సర్వేయర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ- పోస్ పుస్తకాలను మీ సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

# 'నాణ్యమైన ఎరువులు విక్రయించాలి'

**శిరివెళ్ల:** మండలంలోని ఎరువుల దుకాణదారులు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ ఆదేశించారు. శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న మన గ్రోమోర్ కేంద్రంలో ఎరువుల నమూనాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఎరువుల డీలర్ల వద్ద సేకరించిన నమునాలను వ్యవసాయశాఖ ల్యాబ్‌కు పంపిస్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ-పోస్ యంత్రాల ద్వారా రైతులకు ఎరువులను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ-పోస్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే మండల వ్యవసాధికారిని సంప్రదించాలని ఆయన డీలర్లకు సూచించారు.



# 'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

**ఉయ్యాలవాడ:** మిరప పంటకు సోకే బూడిద తెగుళ్ళ, బింగి తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కాకరవాడ గ్రామ పొలాల్లో వ్యవసాయాధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పంటకు సోకే తెగుళ్ళ, వాటి లక్షణాలను రైతులకు, ఎంపీఈవోలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# దినఫలాలు

## అదృష్టసంఖ్యలు : 3, 4

**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

**మిథునరాశి: (మే21-జూన్21):** రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు

**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.

**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

## ఆర్టీసీ గ్యారేజీలో ఏడుగురికి పదోన్నతి

**కర్నూలు(రూరల్):** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని గారేజీలో మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు డిప్యూటీ సూపర్‌వైజర్లకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ సంస్థ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసినట్లు పర్సనల్ అధికారి సర్దార్ హుసేన్ బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న వీరికి మెకానికల్ విభాగంలోనే సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. పదోన్నతి పొందిన ఏడుగురిని విధులు నిర్వహించేందుకు డిపోల వారీగా కేటాయించామని పర్సనల్ అధికారి తెలిపారు.

## సమ్మె నోటీసు ఇచ్చిన విద్యుత్ కార్మికులు

**కర్నూలు(రాజ్‌విహార్):** ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని యూఈఈయూఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. నగరంలో బుధవారం స్థానిక పవర్ హౌస్‌లో డీఈఈ శ్రీనివాస్‌కు విద్యుత్ కార్మికుల సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే సంస్థలో పదేళ్లపాటు పనిచేసిన వారిని రెగ్యులర్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా నిర్లక్ష్యం వహిస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. సెప్టెంబరు 30, 2017 తర్వాత ఏరోజైనా సమ్మెలోకి వెళ్లాలనే కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. డీఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అజ్మతుల్లా, చక్రపాణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఎస్ఈ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు(ఎడ్యుకేషన్):** రాష్ట్రంలో నవంబర్ 5న జరిగే నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్ఈ లెవల్-1) పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రుసుం రూ.200 చలానా రూపంలో తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సెప్టెంబర్ 18వ తేదీ వరకు, చలానాలు కట్టేందుకు సెప్టెంబర్ 20వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

## ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు

**కర్నూలు(హాస్పిటల్):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సికింద్రాబాద్ సహకారం ఆదివారం రాత్రి వైద్యవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ సి.మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌ఫ్రైడ్ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జరిగే సదస్సుకు ఐఎంఏ జాతీయ నాయకులు డాక్టర్ పీఎస్ వెంకట సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. మూత్రపిండాల జబ్బు గురించి డాక్టర్ దవాకర్‌నాయుడు, మూత్రశ్రయ ప్రొస్టేట్ గ్రంథి జబ్బుల గురించి డాక్టర్ ఫ్రాన్సిస్ శ్రీధర్ ప్రసంగిస్తారన్నారు.

## రచయిత అజీజ్‌కు కీర్తి పురస్కారం


కీర్తి పురస్కారం అందుకుంటున్న అజీజ్

**కర్నూలు(కల్చరల్):** కర్నూలుకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారికి కీర్తి పురస్కారాలను అందజేస్తోంది. ఈ పురస్కారాన్ని బుధవారం విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అజీజ్‌కు అందజేశారు.. కర్నూలు జిల్లాకు చెందిన చారిత్రక అంశాలను, వివిధ ఘట్టాలను, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను నవల రూపంలో అజీజ్ రాశారు. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ సత్యనారాయణ చేతుల మీదుగా అజీజ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

### కర్నూలువ్యవసాయ మార్కెట్ ధరలు

| పంట | వచ్చింది | కనిష్టం | గరిష్టం |
|---|---|---|---|
| వేరుశనగ | 145 | 2715 | 4389 |
| ఆముదం | 6 | 4252 | 4252 |
| ఉల్లి | 5785 | 960 | 2000 |
| కందులు | 4 | 2852 | 3442 |

### ఆదోని వ్యవసాయ మార్కెట్ ధరలు

| | | | |
|---|---|---|---|
| పత్తి | 411 | 3638 | 5655 |
| వేరుశనగ | 283 | 2616 | 5039 |
| ఆముదం | 11 | 4239 | 4239 |
| పొద్దుతిరుగుడు | 3 | 2981 | 2981 |

## ఎఫ్‌ఎంబీ డిజిటలైజేషన్‌ను
# వేగవంతం చేయండి

రాష్ట్ర భూపరిపాలన శాఖ కమిషనర్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ ప్రసన్న వెంకటేష్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు

**కర్నూలు(కలెక్టరేట్):** రాష్ట్రంలో ఎఫ్‌ఎంబీ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్లను రాష్ట్ర భూపరిపాలనశాఖ కమిషనర్ అనీల్ చంద్రపునీథ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రికార్డులకు సంబంధించిన ఎఫ్‌ఎంబీలను డిజిటలైజేషన్ చేయడంలో సర్వేశాఖ అధికారులు వెనుకబడి ఉన్నారని.. వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజాసాధికార సర్వే నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైతే లబ్ధిదారులు సులభతరం అవుతోందన్నారు. మీ సేవలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఆర్వో గంగాధరగౌడ్, సర్వే, భూమి రికార్డుల కార్యాలయ ఏడీ చిన్నయ్య, కలెక్టరేట్ ఏవో వెంకటనారాయణ, రెవెన్యూ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కాశ్యప పథకం సెప్టెంబర్ 15 వరకు పొడిగింపు

### ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సముద్రాల హనుమంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న సముద్రాల హనుమంతరావు

**కర్నూలు(న్యూసిటీ):** బ్రాహ్మణల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కాశ్యప పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకు గడువును పొడిగించినట్లు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కో- ఆర్డినేటర్ సముద్రాల హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉండేదని, అయితే బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద సూర్య వినతి మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 15 వరకు పొడిగించారని ఆయన వెల్లడించారు. జిల్లాలోని 60 సంవత్సరాలు దాటిని వృద్ధులు, వితంతువుల ఏ జీవనాధారం లేకుండాగా భర్త వదిలిపెట్టిన వారికి, రిజిస్టర్ అయిన వృద్ధాశ్రమం చూపించే వారికి నెలకు రూ.3 వేలు పింఛన్ సౌకర్యం ఉందన్నారు. అంతే కాకుండా విద్యాభారతి స్కీం సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఉందని విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సాహించేందుకు సీఎం చంద్రబాబు ఈ స్కీంను తిరిగి ప్రారంభించారని ఆయన తెలిపారు. త్వరలోనే 13 జిల్లాల సమన్వయ కర్తల సమావేశం తరువాత ఉపాధి పథకం కింద చాణక్య స్కీంను ప్రారంభించి ఇంటర్వ్యూలు జరిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కప్పగంతుల రామారావు, సముద్రాల శ్రీదేవి, గడివేముల ఆదినారాయణ శాస్త్రి, సముద్రాల శ్రీధర్, రాఘవేంద్ర, పరుశరాం, పరివార్ జిల్లా అధ్యక్షుడు ధార్వాడా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు ఆరుగురు డీటీలు కేటాయింపు

**కర్నూలు(కలెక్టరేట్):** గ్రూప్-2 ద్వారా నూతనంగా ఎంపికైన ఆరుగురు డిప్యూటీ తహసీల్దార్లను జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు కేటాయించిన ఈ ఆరుగురు డీటీలు సంవత్సరం పాటు శిక్షణ తీసుకుంటారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత వీరికి పోస్టింగ్‌లను కేటాయిస్తారు.

## కర్నూలు సినిమా గైడ్

**ఆనంద్ సినీ కాంప్లెక్స్:** అర్జున్ రెడ్డి, ఫిదా, ఆనందో బ్రహ్మ, జయ జానకి నాయక, విజన్, **శ్రీరామ:** జయ జానకి నాయక, **రాజ్:** నేనే రాజు నేనే మంత్రి, **వెంకటేష్ కాంప్లెక్స్:** వీఐపీ -2, విజన్, ఆనందో బ్రహ్మ, **భరత్ కాంప్లెక్స్:** లై, ఎ జెంటిల్‌మన్, ప్రతీకారం **విక్టరీ:** డీజే



## మీకు తెలుసా?

వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



## ఔనా!

మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

## సూక్తి

అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.



# ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదూ! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

**క్రీ.పూ. 10000**

ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేల పైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

**క్రీ.పూ. 3600**

ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

**క్రీ.పూ. 3400**

పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

**క్రీ.పూ. 27**

ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

**క్రీ.శ. 1300**

మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలంలోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

**1500**
(పునరుజ్జీవన కాలం)

యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

**18వ శతాబ్దం**

ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

**1865**

'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కీటెల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

**1879**

థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

**1950**

విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్జ్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

**1960**

మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

**1970**

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

**1990**

నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

**2012**

ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

## పదాలు కనుక్కోండి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| L | E | A | F | Y | E | Y | P | N |
| Y | O | A | Y | E | K | L | E | C |
| C | R | U | E | K | A | D | N | R |
| E | A | T | L | R | R | L | W | I |
| I | N | U | L | U | T | O | O | S |
| P | G | M | O | T | F | C | R | P |
| C | E | N | W | R | E | D | B | W |
| E | L | P | P | A | P | M | A | J |
| B | C | H | A | N | G | E | Q | K |

| | | |
|---|---|---|
| YELLOW<br>PIE<br>BROWN<br>RAKE<br>ORANGE | COLD<br>CRISP<br>AUTUMN<br>RED | LEAF<br>CHANGE<br>APPLE<br>TURKEY |


## చెప్పగలరా?

ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

**జవాబులు**

చెప్పగలరా?: ఉద్యమం
జంతర్‌మంతర్: 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సౌభాగ్యం 4. మెరుపు

రంగులద్దండి



## టంగ్ ట్విస్టర్స్

1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

## జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. మ్మఉడి ▸ ..............................
2. శ్రీరంకా ▸ ..............................
3. రూసౌప్యం ▸ ..............................
4. రుపుమె ▸ ..............................








గత ఏడాది కృష్ణానదిలో పుష్కర పుణ్యస్నానం ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

# కృష్ణమ్మకు అంత్య పుష్కర శోభ

- సంగమేశ్వరంలో సెప్టెంబరు 11 వరకు..
- క్షేత్రంలో నేటి నుంచి వరుణ యాగం
- తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో..

**ఆత్మకూరు:** కృష్ణమ్మ మరోమారు పుష్కర శోభ సంతరించుకోనుంది. గత ఏడాది ఆగస్టు 12 శుక్రవారం ఉదయం 5.54 గంటలకు బృహస్పతి గ్రహం కన్యారాశిలోకి ప్రవేశించడం వల్ల కృష్ణానదికి పుష్కరాలు ఆరంభమయ్యాయి. అయితే కన్యారాశిలో నుంచి బృహస్పతి నిష్క్రమించి తుల రాశిలోకి ప్రవేశించే ముందు 12 రోజులు కృష్ణమ్మకు అంత్య పుష్కరోత్సవాలు జరుపుతారు. దీని ప్రకారం గురువారం నుంచి సెప్టెంబరు 11 వరకు కృష్ణానదికి అంత్యపుష్కరాలు జరుగనున్నాయని వేదపండితుడు తెలకపల్లి రఘురామశర్మ తెలిపారు. పుష్కర నది ఆది పుష్కరాలకు ఉన్న ప్రాముఖ్యమే అంత్యపుష్కరాలకు ఉంటుందని, పుష్కర ఘడియలు ముగిశాక సెప్టెంబరు 12 ఉదయం 6.51 గంటలకు బృహస్పతి కన్యారాశి నుంచి నిష్క్రమించి తులారాశిలోని ప్రవేశించంచడంతో పుష్కరుడు కృష్ణానదిని వీడి కావేరినదీలోకి చేరుకుంటారని చెప్పారు. ఫలితంగా సెప్టెంబరు 12 నుంచి 23 వరకు కావేరి నదికి ఆది పుష్కరాలు ఆరంభం అవుతాయన్నారు.

### పుష్కరస్నానం విశిష్టత

నీటికి దాహార్థి తీర్చడం, శుభ్రపర్చడం అనే రెండు లక్షణాలు ఉన్నాయి. అలాగే అంతరంగికంగా మేధ్యం, యాజ్ఞనం అనే శక్తులు న్నాయని వేదం అంటోంది. మేధ్యం అంటే నదిలో స్నానం చేసి మూడుసార్లు మునక వేస్తే పాపాలన్నీ పోతాయని, అలాగే యాజ్ఞనం అంటే నీటిని చల్లుకోవడం అంటే సంప్రోక్షణ చే యడం దీని వలన ద్ర వ్యశుద్ధి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. నదీ జలాలను సేవిస్తే.. పాపప్రక్షాళన జరుగుతుందని, మాంధ్యం, ఆలసత్వం మొదలైన శారీరక రుగ్మతలు నశిస్తాయని తైత్తరీయ ఉపనిషత్తు వివరిస్తోంది. అయితే పుష్కర నదుల్లో పుణ్యస్నానమాచరించేవారు తప్పక నియమాలు పాటించాలని పండితులు చెబుతున్నారు. సంగమేశ్వరంలో ఇప్పుడు పూర్తిస్థాయిలో నదీజలాలు లేనప్పటికీ అక్కడక్కడ నీరు ని ల్వలు ఉన్నాయి. వాటిలో సాన్నం చేసి మరణించిన పితృదేవతలకు తర్పణాలు, పిండ ప్రదానాలు చేస్తే అక్షయపుణ్యఫలం దక్కుతుందని నమ్మకం.

### సంగమేశ్వర క్షేత్రంలో వరుణయాగం ప్రారంభం

కృష్ణానది అంత్యపుష్కరాలకు పురస్కరించుకుని సప్తనదీ సంగమేశ్వరాలయంలో గురువారం నుంచి వరుణయాగం ప్రారంభించనున్నారు. నదిలో నీటి ప్రవాహం లేక పోవడంతో క్షేత్ర వేదపండితుడు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో అంత్య పుష్కరాలు ముగిసే వరకు సంగమేశ్వర క్షేత్రంలో ప్రతిరోజూ వానల కోసం వరుణయాగం చేయనున్నారు.



సప్తనదీ తీరాన వెలసిన సంగమేశ్వర క్షేత్రం



సంగమేశ్వరంలో స్వల్పంగా ఉన్న నదీజలాలు

# స్వల్పంగా పెరిగిన శ్రీశైలం డ్యాం నీటిమట్టం

**శ్రీశైలంప్రాజెక్టు:** నదీపరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు డ్యాం నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది. ఈ మేరకు శ్రీశైలం డ్యాం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 787.20అడుగులుగా జలాశయ నీటినిల్వలు 23.2305టీఎంసీలుగా నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 31డిగ్రీలు, కనిష్టంగా 21డిగ్రీలుగా నమోదయ్యాయి. గడచిన 24గంటల వ్యవధిలో పట్టణంలో 30.20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.





# సామాన్యుల దాకా పరిశోధన ఫలితాలు

- ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.వై.నరసింహులు

**కర్నూలు(ఎడ్యుకేషన్):** పరిశోధన ఫలితాలు సామాన్య ప్రజల దాకా వెళ్లినప్పుడే వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటాయని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాల్‌లో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్‌లో రీసెంట్ ట్రెండ్స్ అనే అంశంపై జాతీయ సెమినార్ ప్రారంభమయింది. ఈ సందర్భంగా రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ వై.నరసింహులు మాట్లాడుతూ రాబోయే 5 సంవత్సరాల కాలంలో సైన్స్ అండ్ టెక్నాలజీ దేశ వ్యాప్తంగా విస్తరిస్తుందని అన్నారు. ఇప్పటికే కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింక్ (ఐఓటీ) మొబైల్ ఆధారిత అప్లికేషన్ ఆన్‌లైన్ కోర్స్ మ్యాక్స్ ప్లాట్స్, వైఫై వంటి రంగాలలో పరిశోధనలు వేగవంతం అయ్యాయన్నారు. భౌతికశాస్త్రంలోని ప్రయోగ ఫలితాలను సామాన్య ప్రజానీకం దగ్గరికి తీసికెళితేనే సమాజంలో అద్భుత ఫలితాలు వస్తాయని అన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో ఇటీవల 3డీ ప్రింట్, టెక్నాలజీ స్కానింగ్ లాంటి ఎలక్ట్రానిక్ ఆధారిత ల్యాబ్‌లను, సర్టిఫికెట్ కోర్సులను ఏర్పాటుచేశామని అన్నారు. ఇస్రో సైంటిస్ట్ డా.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే భారతదేశం అంతరిక్ష పరిశోధనల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. గతంలో భారత్ 3 సంవత్సరాలకు ఒక రాకెట్ అంతరిక్షంలో ప్రవేశపెట్టేదని, ఇప్పుడు ఏడాదికి 12 రాకెట్లు వెళ్తున్నాయన్నారు. ఎస్‌హెచ్‌ఏఆర్ (షార్) సెంటర్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉండగా రాష్ట్రంలోని శ్రీహరికోట ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. ఇస్రో మాజీ సైంటిస్ట్ డా.ఎం.రాజారెడ్డి రాకెట్ తయారీ, ప్రయోగం వంటి అంశాలను వివరించారు. ఫిజిక్స్ విభాగాధిపతి డా.పుణ్యశేషుడు మాట్లాడుతూ ఇలాంటి సెమినార్లను విద్యార్థులు, అధ్యాపకులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ ఆర్‌ఎల్‌ఎన్. సాయి ప్రసాద్, డా.ఎస్.రమణయ్య, జిల్లాలోని వివిధ కళాశాలల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెమినార్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌యూ వీసీ వై.నరసింహులు

## పంటలకు కనీస మద్దతు ధర చట్టం తేవాలి: సీపీఎం

**ఆదోని(అగ్రికల్చర్):** పంటలకు కనీస మద్దతు ధర కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేశులు అన్నారు. బుధవారం సంతెకుడ్లూరు, బసాపురం, చిన్నహరివాణం, పెద్దహరివాణం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావం వల్ల రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రుణమాఫీ చేసి ఇన్సురెన్స్‌ను సకాలంలో అందించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీఎస్ గోపాల్, తాహెర్‌ఆలి పాల్గొన్నారు.

# యథేచ్ఛగా పందులు, కుక్కల సంచారం

### అరికట్టడంలో అధికారుల విఫలం - రోగాలబారిన ప్రజలు

**ఆదోని టౌన్:** పట్టణంలోని అనేక ప్రాంతాలలో పందులు, కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి మున్సిపల్ అధికారులు రూపొందించిన ప్రణాళికను క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో వీధుల్లో పందుల సంచారం అధికం కావడంతో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



 మురుగుకాలువల్లో తిరుగుతున్న పందులు

### యథేచ్ఛగా తిరుగుతున్న పందులు

పందులను పట్టణ పొలిమేరకు తరలించాలన్న మున్సిపల్ అధికారుల హెచ్చరికలను పెంపకందారులు బేఖాతర్ చేయడంతో అవి నివాసిత ప్రాంతాలలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాటి నిర్మూలన కోసం మందు కలిపిన ఆహారాన్ని అధికారులు పెడుతున్నా పెంపకందార్లలో స్పందన కరువైంది. తిక్కస్వామి దర్గా పక్కనున్న బైపాస్‌రోడ్డు, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఎస్కేడీ కాలనీలు, ఫరీద్‌సాబ్ వీధి, ఖూనీ మొహల్లా, భార్‌పేట, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులు కాల్వలలో పొర్లాడుతుండడంతో మురుగునీరు ముందుకు పారే వీలు లేకుండా పోతుంది.

### తొలగని కుక్కల బెడద

పట్టణంలోని చిన్నకూరగాయల మార్కెట్, వెంకన్నపేట, మరాఠ్‌వాడీ, బుడ్డేకల్లు, బీఎస్ టాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట ఆయా ప్రాంతాలలో నడుచుకుంటూ వెళ్లేవారిని, ద్విచక్ర వాహనాలపై వచ్చే వారిని వెంటపడి కరుస్తున్నాయి. కుక్కల బెడద తొలగించడానికి మున్సిపల్ అధికారులు కుక్కలను బంధించి కర్నూలులో వాటి సంతానం అభివృద్ధి చెందకుండ శస్త్ర చికిత్సలను చేయించాలన్న నిర్ణయం ఆచరణకు నోచుకోలేదు. ఒక్కసారి మాత్రమే కొన్ని కుక్కలను పట్టుకొని కర్నూలుకు పంపడం జరిగిందేగాని ఆ తర్వాత ఈ కార్యక్రమం చేపట్టకపోవడంతో ప్రజలకు కుక్కల బెడద తప్పని పరిస్థితిగా మారింది.



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

### అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి



పట్టణంలో పందులు అధికం కావడంతో చిన్నపిల్లలకు అంటువ్యాధు లు ప్రబలి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణానికి దూరంగా వాటిని తరలించాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చిన్నారులు, ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి.

**- జె.మహబూబ్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్**

### కుక్కల బెడద అధికమైంది



కుక్కల సంతానం అధికం కాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనేక ప్రాంతాలలో నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కుక్కల నివారణ కోసం అధికారులు వెంటనే స్పందించాలి.

**- శ్రీనివాసచారి, మండగిరి టీడీపీ నాయకుడు**

### క్షేత్ర స్థాయిలో చర్యలు ప్రారంభిస్తున్నాం



పందులు, కుక్కల బెడద నివారణ చర్యలను క్షేత్ర స్థాయిలో ప్రారంభించాం. గణేకల్లు గ్రామంలో పందులు ఉంచడానికి 5.40 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశాం. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థలం మా ఆధీనంలోకి రాగానే చుట్టూ కంచె ఏర్పాటు చేసి పందులను ఆ ప్రాంతానికి తరలిస్తాం. వాటికి హోటళ్లలోని వ్యర్థ పదార్థాలను కూడా సరఫరా చేయడానికి సన్నహాలు చేస్తున్నాం. కుక్కల సంతానం అభివృద్ధి చెందకుండా శస్త్ర చికిత్సలు చేయించడానికి కర్నూలుకు పంపడంలో జరుగుతున్న జాప్యాన్ని గమనించి రాంజల ప్రాంతంలో కుక్కలకు శస్త్ర చికిత్సలను చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రెండు వారాల్లోగా పట్టణంలో పందులు, కుక్కల బెడద పూర్తిగా తొలగిస్తాం.

**- రామలింగేశ్వర్, మున్సిపల్ కమిషనర్**

## హడావుడిగా కౌన్సిల్ సాధారణ సమావేశం

**ఆదోని టౌన్:** మున్సిపల్ కౌన్సిల్ సమావే శం బుధవారం చైర్‌పర్సన్ కురుబ సరోజమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశం హడావుడిగా ఏర్పాటు చేయడంతో అజెండాలో ఎలాంటి అభివృద్ధి పనులకు స్థానం లేకుండా పోయింది. కేవలం ఉపాధ్యాయుల పీఎఫ్ రుణాలు, ఇంజినీరింగ్ విభాగంలోని ఉద్యోగుల కరువు భత్యం మంజూరు అంశాలు మాత్రమే అజెండాలో పొందుపరిచారు. కేవలం నాలుగు అంశాలతో కూడిన అజెండాతో సమావేశం తూతూమంత్రంగా అయిపోయిందనిపించారు. కౌన్సిలర్లు వైజీ బాలా జీ, గోవిందరాజులు, తిమ్మప్ప, చంద్రకాంత్‌రెడ్డి పారిశుధ్యంపై అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు పూర్తి చేశాక అక్కడ పేర్కొన్న మట్టిని తొలగించకుండా వదిలేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రానున్న బక్రీద్, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాంతాలలో పారిశుధ్య పనులను చేపట్టాలని, తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ అల్తాఫ్, కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్, డీఈలు సత్యనారాయణ, వెంకటరమణ, రామమూర్తి పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్

**ఆదోని టౌన్:** పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్కేడీ కాలనీలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త తొలగింపు, కాల్వలు శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. అతిపెద్ద కాలనీ అయిన ఎస్కేడీ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తానని, ఏమాత్రం అశ్రద్ధ వహించినా సహించేదిలేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి స్థానికులు కూడా సహకారం అందించాలని కోరారు.



మురుగుకాలువలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

## 'ఏపీలో కాంగ్రెస్‌కు రానున్న పూర్వ వైభవం'

**ఆదోని టౌన్:** ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకరావడానికి ఏఐసీసీ పక్కా ప్రణాళికలను రూపొందిస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అఫ్సర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ ఓరాను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వం ఉన్న ఓటు బ్యాంక్, యువతకు పార్టీలో భాగస్వామ్యం కల్పించడానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ స్వయంగా క్షేత్ర స్థాయిలో పని చేయనున్నారని ఓరా చెప్పారని తెలిపారు. త్వరలో ఏర్పాటు చేయనున్న ఏఐసీసీ కార్యవర్గంలో తనకు స్థానం కల్పించాలని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు.



ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ ఓరాను కలిసిన కాంగ్రెస్ నాయకుడు అఫ్సర్‌బాషా

## 'బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం'

**హొళగుంద(ఆలూరు రూరల్):** దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎక్సైజ్ సీఐ మాధవస్వామి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో దాసరిమేరి, అన్నారు. బుధవారం ఎల్లార్తి, చిన్నహ్యాట గ్రామాల్లో బన్ని ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా పూర్తి స్థాయిలో నాటుసారాను నియంత్రిస్తామన్నారు. కర్రలు సంప్రదాయానికి స్వస్థిపలకాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, సీనియర్ అసిస్టెంట్ రుద్రగౌడ్, దర్గా నిర్వాహకుడు మల్లికార్జున, వీఆర్‌వోలు నాగరాజు, తిప్పన్న, హెడ్‌కానిస్టేబుల్ బీరప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మాధవస్వామి

### ఆలూరు రూరల్‌లో..

దేవరగట్టులో జరిగే మాళమల్లేశ్వరస్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ముద్దనగేరి, కురుకుంద గ్రామాల్లో బన్ని ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం ద ర్భంగా ఆయన మాట్లాడుతూ మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలను ప్రరశాంతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బన్ని ఉత్సవాల్లో కర్రలు, సారాను నియంత్రిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మాధవస్వామి, వీఆర్‌వోలు హనుమంతరావు, తిమ్మప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉచ్చీరప్ప తాతకు విశేష పూజలు

**ఆలూరు రూరల్:** మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో వెలసిన ఉచ్చీరప్ప తాత దేవాలయంలో సప్త భజన కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఉచ్చీరప్ప తాతకు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి పూజలను నిర్వహించినట్లు అర్చకుడు సిద్దుఆచారి విలేఖరులకు తెలిపారు. మూడో రోజు సప్త భజన కార్యక్రమంలో పుష్పాలదొడ్డి కురువ సంఘం వారు పాల్గొన్నారు.



ఆలయానికి పూలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## 'పంటల సాగుపై అవగాహన అవసరం'



ఎంపీఈవోలకు సూచనలు ఇస్తున్న ఏడీఏ రాజశేఖర్

**ఆలూరు రూరల్:** పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆలూరులో వేరుశనగ పంటను వ్యవసాయ సిబ్బంది, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీఈవోలకు వివరించారు. ప్రతి నెల మూడు రోజుల పాటు ఎంపీఈవోలకు శిక్షణ ఇచ్చి వారి పనితీరుకు గ్రేడింగ్‌లు ఇస్తామన్నారు. ప్రధాన పంటలపై సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం రైతులకు వివరిస్తామన్నారు. పత్తి పంటపై గులాబిరంగు పురుగుల నియంత్రణకు తీసుకోవాల్సిన పద్ధతిపై వివరిస్తామన్నారు. పొలంబడి కార్యక్రమంలో మెలకువలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంటలు రక్షణ కోసం పొలం చుట్టూ పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీనివాసరెడ్డి, షేక్షావలి, నరేంద్రకుమార్, రాజేంద్ర, ఎంపీఈవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

## 'ప్రయోజనం లేని కౌన్సిల్ సమావేశం'

**ఆదోని టౌన్:** మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం హడావుడిగా నిర్వహించడంలో అంతరార్థం ఏమిటని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూర్ అహమ్మద్ ప్రశ్నించారు. కనీస సమాచారం లేకుండా కొందరు అధికారులకు తెలియకుండా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడంతో అజెండాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఏవీ లేకుండా పోయాయని అన్నారు. అభివృద్ధి పనుల అంశాలు అజెండాలో లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ఇప్పటికైనా భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడే అంశాలతో సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# పైపులైన్ లీకేజీ పట్టించుకోరా?



బురదమయంగా మారిన రహదారి

**ఆదోని(అగ్రికల్చర్):** స్థానిక వైఎస్సార్ కాలనీలో పైపులైన్ లీకేజీ అయి వృథాగా నీరు పోతున్నాయని ఫిర్యాదు చేసినా పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితామధుసూదన్‌శర్మ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కాలనీలో గత పది రోజులుగా తాగునీటి పైపులైన్ లీకేజీ అయిందన్నారు. పురపాలక ఇంజినీరింగ్ విభాగం ఏఈకి, లైన్‌మెన్‌కు ప్రతి రోజు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజాప్రతినిధుల మాటలకే విలువ ఇవ్వనప్పుడు తాము ఇంకెందుకు కౌన్సిల్‌లో కొనసాగాలని ప్రశ్నించారు. ఆ నీరంతా వృథా అవడమే కాకుండా రహదారంతా బురదమయంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు పట్టించుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# 'కుమార్‌గౌడ్ మృతి పార్టీకి తీరనిలోటు'



కుమార్‌గౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాష్ట్ర సాగునీటి సంఘం జలవనరుల శాఖ రాష్ట్ర అపెక్స్ కమిటీ సభ్యుడు గోపాలకృష్ణ, తదితరులు

**ఆదోని:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కుమార్‌గౌడ్ మృతి పార్టీకి, జలవనరుల శాఖకు తీరనిలోటని రాష్ట్ర సాగునీటి సంఘం జలవనరుల శాఖ అపెక్స్ కమిటీ సభ్యుడు కృష్ణా జిల్లా ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. బుధవారం ఆదోనిలోని కుమార్‌గౌడ్ ఇంటికి చేరుకొని మృతుడి అన్న, ఆలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌ను పరామర్శించారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 2014 నుంచి కుమార్‌గౌడ్ రాష్ట్ర అపెక్స్ కమిటీ సభ్యుడుగా ఉన్నారని, 13 జిల్లాల్లో పర్యటించి సాగునీటి సంఘాల వ్యవస్థను బలోపేతం చేసి నీటి యాజమాన్యంలో రైతుల భాగస్వామ్యం కోసం తీవ్రంగా కృషి చేశారన్నారు. ఆయన అకాల మరణం రాష్ట్ర సాగునీటి సంఘాల వ్యవస్థకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు చైర్మన్ గుంటూరు జిల్లా జీవీ బుజంగరాయులు, సోమశీల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్.సుందర్‌రామిరెడ్డి, ఎస్‌ఆర్‌బీసీ ప్రాజెక్టు చైర్మన్ కర్నూలు జిల్లాకు చెందిన రాజశేఖర్, కృష్ణా జిల్లాకు చెందిన డీసీ చైర్మన్ ఎన్.చెన్నకేశవరావు కుమార్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

## వ్యక్తిపై దాడి

**ఆస్పరి:** ఆస్పరిలో శివప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు బుధవారం ఎస్ఐ వెంకటమరణ విలేఖరులకు తెలిపారు. శివప్రసాద్‌రెడ్డిపై పల్లెదొడ్డి మల్లికార్జున, పల్లెదొడ్డి భాస్కర్ అనే వ్యక్తులు కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 'ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులపై సర్వే చేపట్టండి'

**ఆలూరు:** ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులపై గురువారం నుంచి తహసీల్దార్, ఎంపీడీవో నేతృత్వంలో సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్ తెలిపారు. ప్రజాసాధికారిక సర్వేలో ఇల్లు లేని వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని, లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆ ఇళ్లల్లో వారు నివాసముంటున్నారా లేదా అనే విషయాలపై గ్రామాల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. వీఆర్‌వోలు సర్వేలో పూర్తిగా బాధ్యత వహించాలని తెలిపారు. ఆలూరు మండలానికి 2,659 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.

## నేడు అధ్యాపకుడు బలరాముడు పదవీ విరమణ



బలరాముడు

**ఆదోని(అగ్రికల్చర్):** 37 ఏళ్ల అధ్యాపక వృత్తి నుంచి టీజీపీ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు కె.బలరాముడు గురువారం పదవీ విరమణ పొందనున్నారు. అధ్యాపకుడిగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలు అందించి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ విద్యాభివృద్ధి కోసం ఎంతో తోడ్పాటునందించారు.

## 'అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడండి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు మీనాక్షినాయుడు

**చిప్పగిరి:** పార్టీలకు అతీతంగా అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు మీనాక్షినాయుడు అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ వెంకటేశులు, ఎంపీడీవో చంద్రశేఖరయ్య అధ్యక్షతన హౌసింగ్ శాఖపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించుకోవాలని, ఇళ్లు ఉందా లేదా స్థలం ఉందా లేదా అనే అంశాలపై అర్హులను గుర్తించాలన్నారు. ఇళ్లు లేని వారిని అర్హులు గా గుర్తిస్తే వారి నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జాబుకార్డు, అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్‌లు అధికారులు ఇప్పించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అర్హులను గుర్తించే పనిలో ఉండి ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని ఎంపీడీవో చంద్రశేఖరయ్య వివరించారు. సమావేశంలో ఈవోఆర్‌డీ భాస్కర్‌రావు, సూపరింటెండెంట్ విజయలలిత, సర్పంచ్‌లు భీమలింగప్ప, సురేష్‌రెడ్డి, రామాంజనేయులు, నాగేంద్ర, ఎంపీటీసీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, బాలన్న, నెట్టెప్ప, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

## 'మాదిగలకు బీజేపీ నమ్మకద్రోహం'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ

**హొళగుంద(ఆలూరు రూరల్):** తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టం తీసుకొస్తామని చెప్పి మూడు సంవత్సరాలైనా పట్టించుకోకుండా మాదిగలకు ద్రోహం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ విమర్శించారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన సభలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు చెప్పారని, అయితే నేటికి కూడా హామీ అమలు కాలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టసభల్లో ప్రవేశపెట్టకపోతే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సెప్టెంబర్ 5వ తేదీన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని దండువీరయ్య మాదిగ అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, యేసుబు, కౌన్సిలర్ మారుతి, సుధాకర్ మాదిగ, హెబ్బటం పక్కీరప్ప, అంజినయ్య మాదిగ పాల్గొన్నారు.

## 'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి'



నేమకల్లులో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

**చిప్పగిరి:** ఆయా గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలకు ఈవోఆర్డీ భాస్కర్‌రావు, సర్పంచ్ మహాలింగమ్మ, పంచాయతీ కార్యదర్శి బాలన్న సూచించారు. బుధవారం వారు నేమకల్లు గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. బ్యాంక్ ముందు ఉన్న బందలదొడ్డి పరిసర ప్రాంతంలో చెత్త చెదారాన్ని తొలగించి ట్రాక్టర్ల ద్వారా గ్రామ బయటికి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మురికినీరు, చెత్తచెదారం రోడ్లపై వేస్తే దోమలు వృద్ధి చెంది దోమకాటుకు గురి కావాల్సి వస్తుందన్నారు. అందుకే మురికినీరు, చెత్తచెదారం రోడ్లపై వేయకూడదన్నారు. అలా వేసే వారిపై పోలీసు కేసులు పెడతామన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

**ఆదోని(అగ్రికల్చర్):** మండల పరిధిలోని సలకలకొండ గ్రామ ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు రాజాహుసేన్, కల్యాణి బదిలీపై వెళ్తుండడంతో బుధవారం గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రంగమ్మ, సర్పంచ్ ఉరుకుందరెడ్డి మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా తమ గ్రామంలోని పాఠశాలలో పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించారన్నారు. బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, కిష్టప్ప, వీరాచారి, వీరేష్, నర్సింహులు, సన్నప్ప పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
12
ఆదోని టౌన్
కర్నూలు । గురువారం 31 ఆగస్టు 2017


## పంటలకు కనీస మద్దతు ధర చట్టం తేవాలి: సీపీఎం

**ఆదోని(అగ్రికల్చర్):** పంటలకు కనీస మద్దతు ధర కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేశులు అన్నారు. బుధవారం సంతెకుడ్లూరు, బసాపురం, చిన్నహరివాణం, పెద్దహరివాణం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావం వల్ల రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రుణమాఫీ చేసి ఇన్సురెన్స్‌ను సకాలంలో అందించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీఎస్ గోపాల్, తాహెర్‌ఆలి పాల్గొన్నారు.

# యథేచ్ఛగా పందులు, కుక్కల సంచారం

### అరికట్టడంలో అధికారుల విఫలం - రోగాలబారిన ప్రజలు



ముురుగుకాలువల్లో తిరుగుతున్న పందులు

**ఆదోని టౌన్:** పట్టణంలోని అనేక ప్రాంతాలలో పందులు, కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి మున్సిపల్ అధికారులు రూపొందించిన ప్రణాళికను క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో వీధుల్లో పందుల సంచారం అధికం కావడంతో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

### యథేచ్ఛగా తిరుగుతున్న పందులు

పందులను పట్టణ పొలిమేరకు తరలించాలన్న మున్సిపల్ అధికారుల హెచ్చరికలను పెంపకందారులు బేఖాతర్ చేయడంతో అవి నివాసిత ప్రాంతాలలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాటి నిర్మూలన కోసం మందు కలిపిన ఆహారాన్ని అధికారులు పెడుతున్నా పెంపకందార్లలో స్పందన కరువైంది. తిక్కస్వామి దర్గా పక్కనున్న బైపాస్‌రోడ్డు, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఎస్కేడీ కాలనీలు, ఫరీద్‌సాబ్ వీధి, ఖూనీ మొహల్లా, భార్‌పేట, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులు కాల్వలలో పొర్లాడుతుండడంతో మురుగునీరు ముందుకు పారే వీలు లేకుండా పోతుంది.

### తొలగని కుక్కల బెడద

పట్టణంలోని చిన్నకూరగాయల మార్కెట్, వెంకన్నపేట, మరాఠ్‌వాడీ, బుడ్డేకల్లు, బీఎన్ టాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట ఆయా ప్రాంతాలలో నడుచుకుంటూ వెళ్లేవారిని, ద్విచక్ర వాహనాలపై వచ్చే వారిని వెంటపడి కరుస్తున్నాయి. కుక్కల బెడద తొలగించడానికి మున్సిపల్ అధికారులు కుక్కలను బంధించి కర్నూలులో వాటి సంతానం అభివృద్ధి చెందకుండ శస్త్ర చికిత్సలను చేయించాలన్న నిర్ణయం ఆచరణకు నోచుకోలేదు. ఒక్కసారి మాత్రమే కొన్ని కుక్కలను పట్టుకొని కర్నూలుకు పంపడం జరిగిందేగాని ఆ తర్వాత ఈ కార్యక్రమం చేపట్టకపోవడంతో ప్రజలకు కుక్కల బెడద తప్పని పరిస్థితిగా మారింది.



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

### అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి



పట్టణంలో పందులు అధికం కావడంతో చిన్నపిల్లలకు అంటువ్యాధు లు ప్రబలి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణానికి దూరంగా వాటిని తరలించాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చిన్నారులు, ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి.

**- జె.మహబూబ్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్**

### కుక్కల బెడద అధికమైంది



కుక్కల సంతానం అధికం కాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనేక ప్రాంతాలలో నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కుక్కల నివారణ కోసం అధికారులు వెంటనే స్పందించాలి.

**- శ్రీనివాసచారి, మండగిరి టీడీపీ నాయకుడు**

### క్షేత్ర స్థాయిలో చర్యలు ప్రారంభిస్తున్నాం



పందులు, కుక్కల బెడద నివారణ చర్యలను క్షేత్ర స్థాయిలో ప్రారంభించాం. గణేకల్లు గ్రామంలో పందులు ఉంచడానికి 5.40 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశాం. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థలం మా ఆధీనంలోకి రాగానే చుట్టూ కంచె ఏర్పాటు చేసి పందులను ఆ ప్రాంతానికి తరలిస్తాం. వాటికి హోటళ్లలోని వ్యర్థ పదార్థాలను కూడా సరఫరా చేయడానికి సన్నహాలు చేస్తున్నాం. కుక్కల సంతానం అభివృద్ధి చెందకుండా శస్త్ర చికిత్సలు చేయించడానికి కర్నూలుకు పంపడంలో జరుగుతున్న జాప్యాన్ని గమనించి రాంజల ప్రాంతంలో కుక్కలకు శస్త్ర చికిత్సలను చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రెండు వారాల్లోగా పట్టణంలో పందులు, కుక్కల బెడద పూర్తిగా తొలగిస్తాం.

**- రామలింగేశ్వర్, మున్సిపల్ కమిషనర్**

## 'బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం'



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మాధవస్వామి

**హొళగుంద(ఆలూరు రూరల్):** దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎక్సైజ్ సీఐ మాధవస్వామి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో దాసరిమేరి, అన్నారు. బుధవారం ఎల్లార్తి, చిన్నహ్యాట గ్రామాల్లో బన్ని ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా పూర్తి స్థాయిలో నాటుసారాను నియంత్రిస్తామన్నారు. కర్రలు సంప్రదాయానికి స్వస్థిపలకాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, సీనియర్ అసిస్టెంట్ రుద్రగౌడ్, దర్గా నిర్వాహకుడు మల్లికార్జున, వీఆర్‌వోలు నాగరాజు, తిప్పన్న, హెడ్‌కానిస్టేబుల్ బీరప్ప పాల్గొన్నారు.

### ఆలూరు రూరల్‌లో..

దేవరగట్టులో జరిగే మాళమల్లేశ్వరస్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ముద్దనగేరి, కురుకుంద గ్రామాల్లో బన్ని ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలను ప్రరశాంతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బన్ని ఉత్సవాల్లో కర్రలు, సారాను నియంత్రిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మాధవస్వామి, వీఆర్‌వోలు హనుమంతరావు, తిమ్మప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉచ్చీరప్ప తాతకు విశేష పూజలు

**ఆలూరు రూరల్:** మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో వెలసిన ఉచ్చీరప్ప తాత దేవాలయంలో సప్త భజన కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఉచ్చీరప్ప తాతకు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి పూజలను నిర్వహించినట్లు అర్చకుడు సిద్దుఆచారి విలేఖరులకు తెలిపారు. మూడో రోజు సప్త భజన కార్యక్రమంలో పుష్పాలదొడ్డి కురువ సంఘం వారు పాల్గొన్నారు.



ఆలయానికి పూలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## హడావుడిగా కౌన్సిల్ సాధారణ సమావేశం

**ఆదోని టౌన్:** మున్సిపల్ కౌన్సిల్ సమావే శం బుధవారం చైర్‌పర్సన్ కురుబ సరోజమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశం హడావుడిగా ఏర్పాటు చేయడంతో అజెండాలో ఎలాంటి అభివృద్ధి పనులకు స్థానం లేకుండా పోయింది. కేవలం ఉపాధ్యాయుల పీఎఫ్ రుణాలు, ఇంజినీరింగ్ విభాగంలోని ఉద్యోగుల కరువు భత్యం మంజూరు అంశాలు మాత్రమే అజెండాలో పొందుపరిచారు. కేవలం నాలుగు అంశాలతో కూడిన అజెండాతో సమావేశం తూతూమంత్రంగా అయిపోయిందనిపించారు. కౌన్సిలర్లు వైజీ బాలా జీ, గోవిందరాజులు, తిమ్మప్ప, చంద్రకాంత్‌రెడ్డి పారిశుధ్యంపై అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు పూర్తి చేశాక అక్కడ పేర్కొన్న మట్టిని తొలగించకుండా వదిలేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రానున్న బక్రీద్, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాంతాలలో పారిశుధ్య పనులను చేపట్టాలని, తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ అల్తాఫ్, కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్, డీఈలు సత్యనారాయణ, వెంకటరమణ, రామమూర్తి పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్



మురుగుకాలువలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

**ఆదోని టౌన్:** పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్కేడీ కాలనీలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త తొలగింపు, కాల్వలు శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. అతిపెద్ద కాలనీ అయిన ఎస్కేడీ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తానని, ఏమాత్రం అశ్రద్ధ వహించినా సహించేదిలేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి స్థానికులు కూడా సహకారం అందించాలని కోరారు.

## 'ఏపీలో కాంగ్రెస్‌కు రానున్న పూర్వ వైభవం'



ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ ఓరాను కలిసిన కాంగ్రెస్ నాయకుడు అఫ్సర్‌బాషా

**ఆదోని టౌన్:** ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకరావడానికి ఏఐసీసీ పక్కా ప్రణాళికలను రూపొందిస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అఫ్సర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ ఓరాను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వం ఉన్న ఓటు బ్యాంక్, యువతకు పార్టీలో భాగస్వామ్యం కల్పించడానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ స్వయంగా క్షేత్ర స్థాయిలో పని చేయనున్నారని ఓరా చెప్పారని తెలిపారు. త్వరలో ఏర్పాటు చేయనున్న ఏఐసీసీ కార్యవర్గంలో తనకు స్థానం కల్పించాలని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు.

## 'పంటల సాగుపై అవగాహన అవసరం'



ఎంపీఈవోలకు సూచనలు ఇస్తున్న ఏడీఏ రాజశేఖర్

**ఆలూరు రూరల్:** పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆలూరులో వేరుశనగ పంటను వ్యవసాయ సిబ్బంది, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీఈవోలకు వివరించారు. ప్రతి నెల మూడు రోజుల పాటు ఎంపీఈవోలకు శిక్షణ ఇచ్చి వారి పనితీరుకు గ్రేడింగ్‌లు ఇస్తామన్నారు. ప్రధాన పంటలపై సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం రైతులకు వివరిస్తామన్నారు. పత్తి పంటపై గులాబీరంగు పురుగుల నియంత్రణకు తీసుకోవాల్సిన పద్ధతిపై వివరిస్తామన్నారు. పొలంబడి కార్యక్రమంలో మెలకువలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంటలు రక్షణ కోసం పొలం చుట్టూ పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీనివాసరెడ్డి, షేక్షావలి, నరేంద్రకుమార్, రాజేంద్ర, ఎంపీఈవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

## నేడు కౌన్సిల్ సమావేశం

**ఆత్మకూరు:** మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం అత్యవసరంగా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పలు తీర్మానాలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి ఆమోదించడానికి సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

# వనం-మనం ముమ్మరం



మున్సిపాలిటీ శివార్లలో రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటుతున్న దృశ్యం

**ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణం చుట్టూ.. పచ్చదనాన్ని నింపేందుకు మున్సిపల్‌శాఖ కృషి చేస్తోంది. మున్సిపల్ చైర్మన్ రమేష్‌బాబు వనం-మనం పేరిట చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు నాటిన ప్రతి మొక్కకు . ట్రీగార్డ్స్‌తో రక్షణ కల్పిస్తున్నారు. ఆత్మకూరు పట్టణం మీదుగా వెళ్లే కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారితో పాటు దుద్యాల, సిద్ధేపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటించి ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మొక్కలను మొబైల్ కెమెరాలను బంధించి వివరాలు సేకరిస్తున్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టిన వనం - మనం కార్యక్రమం ద్వారా ఆత్మకూరు ప్రాంతంలో ఉత్తమ ఫలితాలు రావాలని ఆశిద్దాం.



- ట్రీగార్డ్స్ ఏర్పాటుతో మొక్కల సంరక్షణ
- మున్సిపాలిటీ చుట్టూ పచ్చదనం



మొక్కలకు ట్రీగార్డ్స్‌తో సంరక్షణ

**ప్రధాన రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటిస్తున్నాం**



ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆయా ప్రధాన రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటుతున్నాం. జూప్రతి మొక్కకు ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ కార్పొరేషన్ చొరవతో ఒక్కో ట్రీగార్డ్‌ను రూ.150కే కొనుగోలు చేశాం. ప్రస్తుతం 1000 మొక్కలను నాటించేలా ప్రణాళిక రూపొందించాం. ప్రజలు కూడా బాధ్యతగా మొక్కల సంరక్షణకు సహకారం అందించాలి.

**- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు**



## 'లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజాసాధికార సర్వే'

**ఆత్మకూరురూరల్:** గ్రామాల్లో గృహనిర్మాణాల కోసం నమోదు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాసాధికార సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురువారం 5వ తేదీ వరకు తహసీల్దార్ రాజశేఖర బాబు, ఈవోఆర్డీ కవిత ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. మండలంలో 2675 మంది లబ్ధిదారులు గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అందులో ఈ సర్వే ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఎంపిక చేస్తామని అన్నారు. 31న కృష్ణాపురం, సిద్దాపురం, ఇందిరేశ్వరం, సెప్టెంబరు 1న పిన్నాపురం, నల్లకాల్వ, సిద్దేపల్లి, 4న కరివేన, వడ్లరామాపురం, కురుకుంద, 5న నాగలూటి, బైర్లూటి గూడేల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎంపిక

**ఆత్మకూరు:** ఆత్మకూరు మండల ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. స్థానిక అంబేద్కర్ స్ఫూర్తి కేంద్రంలో ఆ సంఘం జాతీయ నాయకులు చిలుక రాబిన్‌సన్, జిల్లా నాయకులు దర్గయ్య, స్వాములు, అమలాపురం దర్గయ్య ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజశేఖర్, అధికార ప్రతినిధిగా నాగయ్య, ప్రధానకార్యదర్శిగా బుజ్జి, ఉపాధ్యక్షుడిగా పుల్లయ్య, కార్యదర్శులుగా పుల్లంరాజు, భాస్కర్, రంగస్వామి, కోశాధికారిగా రమేష్‌తో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

## 'మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి'

**ఆత్మకూరు:** రాష్ట్రంలో ఆయా ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని సెప్టెంబరు 1న విజయవాడ నగరంలో చేపట్టే మిలియన్ మార్చును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జహీర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపద్ధతి ప్రకారమే పింఛన్ సదుపాయం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ నాయకులు రామకృష్ణాచారి, ఇబ్రహీం, వేణు, చంద్రశేఖర్, మధు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, గోపాల్, శోభన్ తదితరులు ఉన్నారు.

## 'నవరత్నాలతోనే నవ్యాంధ్ర అభివృద్ధి'

**ఆత్మకూరు:** నవ్యాంధ్ర అభివృద్ధి వైసీపీ ప్రవేశపెట్టబోవు నవరత్నాలతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుడ్డా శేషారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ.. వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు నవరత్నాల పేరిట అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందించాలన్న ఉద్దేశంతో జగన్ కృషిచేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి నవరత్నాల కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో రైతాంగం కళ్లలో ఆనందాన్ని నింపడం, మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను అభివృద్ధి పర్చడమే సంకల్పంగా పనిచేయనున్నట్లు తెలిపారు. మార్కెట్‌యార్డులో గురువారం నిర్వహించే శ్రీశైలం నియోజకవర్గస్థాయి ప్లీనరీ సమావేశానికి కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు గోకారి, శ్రీధర్‌గుప్తా, సాజిద్, కలిముల్లా, ఖుద్దుస్, శివనాగిరెడ్డి, నాగేశ్వరెడ్డి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## కొత్తపల్లి పోలీసుస్టేషన్ తనిఖీ

**కొత్తపల్లి:** కొత్తపల్లి పోలీసుస్టేషన్‌ను సీఐ కృష్ణయ్య బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి క్రైమ్‌వివరాలను ఎస్సై శివశంకర్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి సమస్యను బాధ్యతగా స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

## 'ప్రభుత్వం విఫలం'

**వెలుగోడు:** ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలుపర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు ఏసురత్నం, నాగేంద్రుడులు ఆరోపించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అలాగే నిరుద్యోగభృతి ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకుండా తన ఇంట్లో మాత్రం రెండు ఉద్యోగాలు తీసుకున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వెలుగోడు జలాశయంలో 15టీఎంసీల నీటిని నిల్వ వుంచాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ తులసీనాయక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్, రామదాస్, రామిరెడ్డి, మౌలాలి ఉన్నారు.

## రేపు ఆర్ఎంపీల సమావేశం

**కొలిమిగుండ్ల:** ఆర్ఎంపీల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పారా మెడికల్ యూనియన్ అసోసియేషన్ కొలిమిగుండ్ల మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్‌వలి బుధవారం తెలిపారు. రాష్ట్ర పారా మెడికల్ యూనియన్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల ఆర్ఎంపీలు సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# తగ్గిన వరి సాగు విస్తీర్ణం

- సాగునీటిపై సందిగ్ధం
- వరినాట్లు వేస్తున్న రైతులు
- రబీ సాగుపై చిగురిస్తున్న ఆశలు




సంజామలలో వరినాట్లు వేస్తున్న కూలీలు, స్వల్పంగా ప్రవహిస్తున్న పాలేరువాగు

**సంజామల:** ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. ప్రతి ఏటా 3 వేల ఎకరాలకు పైబడి రైతులు వరిపంటను సాగు చేసేవారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవక బోరుబావులు, చెరువులు, పాలేరువాగులో నీరు లేక రైతులు వరినాట్లు వేయలేకపోయారు. పాలేరువాగు పరివాహకంలోని రైతులు 2వేల ఎకరాల్లో వరి సాగు చేసేవారు. మండలంలోని రామభద్రునిపల్లె, ముక్కమళ్ల, కానాల, నొస్సం చెరువు కింద 1500 ఎకరాల్లో వరి సాగయ్యేది. తీవ్ర వర్షాభావం కారణంగా ప్రస్తుతం ఖరీఫ్‌లో కేవలం 600 ఎకరాల్లో కూడా వరి పంట సాగుకు నోచుకోలేదు. సాధారణంగా జూలై మొదటి వారం నుంచి ఆగస్టు ఆఖరు నాటికి వరినాట్లు పూర్తయ్యేవి. రెండు నెలల పాటు వర్షం కురవక, సాగునీరు లేకపోవడంతో నాట్లు వేసేందుకు అదును తప్పిందని రైతులు తెలిపారు.

### సాగునీటిపై సందిగ్ధం

సాగునీటిపై రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఈ వారంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు, చెరువులకు నీరు చేరినప్పటికీ వరినాట్లు వేయడంలో రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పాలేరువాగు ఓ మోస్తరుగా ప్రవహిస్తోంది. మండలంలోని చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో చాలా మంది రైతులు వరిసాగుపై విముఖత కనబరుస్తున్నారు. మరి కొందరు రైతులు వర్షాలు కురుస్తాయనే ధైర్యంతో నాట్లు వేస్తున్నారు.

### రబీ సాగుపై చిగురిస్తున్న ఆశలు

ఖరీఫ్ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతన్నలకు ప్రస్తుతం కురిసిన వర్షాలు ఆశలు చిగురింపజేస్తున్నాయి. గత జూన్‌లో ఓ మోస్తరు వర్షం కురిసిందనే ఆశతో రైతులు కంది, మిరప, మినుము, పత్తి, మొక్కజొన్న పెసర పంటలు సాగు చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో సరైన వర్షాలు కురవక సాగు అయిన పంటలు ఎండిపోయాయి. ఆగస్టు చివరి వారంలో వర్షాలు కురవడంతో రైతులు రబీ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు.

### 3 ఎకరాల్లోనే వరినాట్లు వేశాం



ప్రతి ఏటా 15 నుంచి 20 ఎకరాల్లో వరినాట్లు వేసేవాళ్లం. పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏడాది 3 ఎకరాల్లోనే వరినాట్లు వేశాం. పాలేరువాగు పరివాహకంలో విద్యుత్‌మోటార్లు అమర్చుకొని వరి పంటను పండించేవాళ్లం. ఈ ఏడాది మా కుటుంబానికి అవసరమయ్యే ధాన్యం కోసం మాత్రమే వరి సాగు చేశాం.

\- సుబ్బారెడ్డి, రైతు సంజామల

### మెట్ట పంటలను సాగు చేస్తాం



పాలేరువాగు పరివాహకంలో 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వాగు నుంచి తాగునీటిని మళ్లించుకొనేందుకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నాం. ప్రతి ఏటా 3 ఎకరాల్లో వరి పంటను సాగు చేసేవాళ్లం. ఈ ఏడాది పరిస్థితులు అనుకూలించక మెట్ట పంటలను సాగు చేస్తాం.

\- గాండ్ల ప్రకాష్, రైతు, సంజామల

## 'పర్యావరణాన్ని పరిరక్షించాలి'




రైల్వేస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న బాబు

**కోవెలకుంట్ల:** అందరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కోవెలకుంట్ల పట్టణ ఉప సర్పంచ్, ప్రముఖ న్యాయవాది లాయర్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో, స్టేషన్‌రోడ్డుకు ఇరుపక్కల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కోవెలకుంట్ల సీఐ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు శివరామకృష్ణ, కార్యదర్శి శిల్పా సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శ్రీధర్, ఎల్ఐసీ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ శేషారెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల యువజన నాయకుడు గుద్దేటి శ్రీనివాసరెడ్డి, కుందూ పోరాట సమితి అధ్యక్షుడు కామిని వేణుగోపాల్ రెడ్డి, పారిశ్రామిక వేత్త సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

## 'పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి'

**సంజామల:** కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని స్టేట్ రీసోర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సూర్యుడు డిమాండ్ చేశారు. బుధవారం సంజామల మెయిన్ స్కూలులో విలేఖర్లతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కొత్త పింఛన్ అమలును నిరసిస్తూ ఈ నెల 29న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశామన్నారు. పాత పెన్షన్ విధానం అమలయ్యేంత వరకు ఎస్టీ యూ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

## 579 మంది పిల్లలకు ఎంఆర్ టీకాలు

**కొలిమిగుండ్ల:** 579 మంది పిల్లలకు మీజిల్స్, రుబెల్లా టీకాలు బుధవారం వేసినట్లు డాక్టర్ ముక్తార్ పాషా తెలిపారు. కొలిమిగుండ్ల, బెలుం, తుమ్మలపెంట, పెట్నికోట, చింతలాయిపల్లె, కనకాద్రిపల్లె గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో టీకాలు వేయించుకోని పిల్లలకు ప్రత్యేకంగా టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కం బయ్య, మార్తమ్మ, పీహెచ్ ఎన్ సరోజమ్మ, ఆరోగ్య కార్యకర్తలు రామలక్ష్మి, దానమ్మ, మాధవీ, కొండయ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారామ విగ్రహాలకు పూజలు



సీతారామ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

**కొలిమిగుండ్ల:** మండలంలోని నందిపాడు గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రెండో రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా రుత్విజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాములు, లక్ష్మణ, హనుమంతుడు విగ్రహాలను ట్రాక్టరులో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత మండల ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, కన్వీనర్ సుబ్బయ్య, లక్ష్మయ్యశెట్టి, శేఖర్, గ్రామ పెద్దలు గురివిరెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు
## నెహ్రూ స్కూల్ విద్యార్థి ఎంపిక




విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, డైరెక్టర్

**బనగానపల్లె:** బనగానపల్లె నెహ్రూ మీడియం హైస్కూల్ విద్యార్థి శంకర్ రెడ్డి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కోడూరు హరినాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అథారిటీ స్టేడియంలో జరిగిన పోటీల్లో శంకర్ రెడ్డి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీల కు ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా హెచ్‌ఎం కమల్‌తేజారెడ్డి, డైరెక్టర్ రవితేజారెడ్డి విద్యార్థిని అభినందించారు.

## ఐటీఐ ప్రవేశానికి ఇంటర్వ్యూలు

**అవుకు:** పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రవేశానికి ఇంటర్వ్యూ లు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నరేంద్రనాథ్ బుధవారం తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రానిక్, కోఫా కోర్సులకు 53 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 39 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారన్నారు. ఇంకా ఈ రెండు కోర్సుల్లో 17 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత గల విద్యార్థులు నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### నేటి నుంచి గృహ లబ్ధిదారుల
# గుర్తింపు గ్రామ సభలు

**కొలిమిగుండ్ల:** మండలంలో గురువారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు గృహ లబ్ధిదారుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడుతారన్నారు. తహసీల్దారు బృందం ఈనెల 31న పెట్నికోట, గొర్విమానుపల్లె, సెప్టెంబర్ 1న తుమ్మలపెంట, బందార్లపల్లె, 4న అబ్దుల్లాపురం, తోళ్లమడుగు, 5న కల్వటాల, నందిపాడు, 6న మీర్జాపురం, 7న తిమ్మనాయునిపేట, 8న అంకి రెడ్డిపల్లె గ్రామాల్లో తహసీల్దారు ఫకూర్‌అహ్మద్ బృందం గ్రామ సభలు నిర్వహిస్తుందని, ఎంపీడీవో బృందం 31న బెలుం, బెలుంశింగవరం, 1న ఎర్రగుడి, ఉప్పలూరు, 4న పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, 5న ఇటిక్యాల, కనకాద్రపల్లె, 6న కోటపాడు 7న చింతలాయిపల్లె, 8న కొలిమిగుండ్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరామారావు, హౌసింగ్ ఏఈ వాసుదేవ రెడ్డి, కార్యదర్శులు విజయరాజు, రాఘవరెడ్డి, అమరావతి, వెంకటసుబ్బయ్య, గోపినాథ్ పాల్గొన్నారు.

**బనగానపల్లె రూరల్‌లో..** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నుంచి గృహ లబ్ధిదారుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ప్రజాసాధికారిక సర్వేలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను గ్రామసభల్లో పరిశీలించి అర్హులా కాదా అనే విషయాలను గుర్తిస్తామన్నారు. ఎంపీడీవో, తహసీల్దారు తిరుపతిసాయి, హౌసింగ్ సిబ్బంది బోరమ్మ, కె రామచంద్రుడు రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 31న అప్పలాపురం, రామతీర్థం, టంగుటూరు, మీరాపురం, యాగంటిపల్లె, 1న కైప, మెట్టుపల్లె, కృష్ణగిరి, పాతపాడు, 4న నందివర్గం, పలుకూరు, ఎర్రగుడి, 5న నందవరం, బీరవోలు, చెర్వుపల్లె, 6న తిమ్మాపురం, వెంకటాపురం, యనకండ్ల, పసుపల, 7న తమ్మడపల్లె, 8న ఇల్లూరుకొత్తపేట, 7, 8వ తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
5
బనగానపల్లె
కర్నూలు ● గురువారం 31 ఆగస్టు 2017
బనగానపల్లె । కోవెలకుంట్ల । కొలిమిగుండ్ల । అవుకు । సంజామల । బేతంచెర్ల

## స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో

**బనగానపల్లె:** పట్టణంలోని రవ్వలకొండలో చెత్తను ఉంచి ఎరువులు తయారు చేసేందుకు అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో బాలకృష్ణారెడ్డి, ఈవోఆర్డీ ఉమామహేశ్వర రావు బుధవారం పరిశీలించారు. ప్రతి గ్రామంలో చెత్త నుంచి ఎరువులు తయారు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసిందని, ఈ మేరకు రవ్వలకొండలో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద వచ్చిన నిధులతో చెత్త నుంచి ఎరువులు తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో స్థల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు.

# పంటలకు ఊపిరి పోసిన వర్షం

## జొన్న పంట సాగుకు సమాయత్తమవుతున్న రైతన్న

**బనగానపల్లె:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి. మండలంలో వర్షాభావం వలన ఖరీఫ్ సాగులో 9836 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉండగా కేవలం 2185 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. పంటలు ఎండు దశకు చేరుకుంటున్న సమయంలో కురుస్తున్న ఈ వర్షాలు పంటలకు ఊపిరి పోశాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 9836 హెక్టార్లలో విత్తనం వేయాల్సి ఉండగా వర్షాభావం వలన కేవలం 2185 హెక్టార్లలో వివిధ పంటలు వేశారు. వర్షాలు ఆగస్టు ఆఖరు వారంలో వేయడంతో రైతులు జొన్న పంట వేయడానికి సమాయత్తమవుతున్నారు. మండలంలో 3500 హెక్టార్లలో జొన్న పంట, 500 హెక్టార్లలో కంది పంట, 300 హెక్టార్లలో పొద్దుతిరుగుడు తదితర పంటలు వేయడానికి రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోలు చేసుకొని పొలం ఆరిన వెంటనే పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు.



దుక్కి దున్నుతున్న రైతు

### జొన్న పంటకు ఇదే అదును



జొన్న పంటకు ఇదే అదును. రైతులు పొలాలు ఆరిన వెంటనే జొన్న, కంది, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, ఆముదం పంటలు వేసుకోవచ్చు. రైతులకు మండలంలో అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులకు సలహాలు అవసరం అయితే వెంటనే సంప్రదించాలి.

\- వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

## గ్రామాల్లో హౌసింగ్ సర్వే
# పకడ్బందీగా నిర్వహించండి: ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగరాజునాయుడు

**బేతంచెర్ల:** మండలంలోని వివిధ గ్రామాల్లో హౌసింగ్ సర్వే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నాగరాజునాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో హౌసింగ్ సర్వే వారానికి మూడు సార్లు గ్రామ సభలు నిర్వహిస్తూ లబ్ధిదారుల లిస్ట్ గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామస్థులకు చదివి వినిపించాలన్నారు. ఈ సర్వేను ఎంపీడీవో నాగరాజునాయుడు, తహసీల్దారు అంజనాదేవి, మండల వ్యవసాయాధికారి సుధాకర్ బృందాలు పర్యవేక్షిస్తారన్నారు. ఈ సర్వే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించాలన్నారు.

గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణ వివరాలను ఎప్పటికప్పుడు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ విజయకుమార్, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాసులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు పలకల పంపిణీ




విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**బేతంచెర్ల:** మండలంలోని అంబాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలకలు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న అధ్యక్షతన లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉపేంద్ర చౌదరి, వలిబాషా పాఠశాలలోని 20 మంది విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు కోసం పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు విష్ణు, మహేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

**బేతంచెర్ల:** పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాల (మెయిన్ పాఠశాల)లో పని చేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో వారిని బుధవారం హెచ్‌ఎం పాపారాయుడు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

**కొలిమిగుండ్లలో..** మండలంలోని అంకిరెడ్డిపల్లె జడ్పీ పాఠశాలలో బదిలీపై వెళ్తున్న 12 మంది ఉపాధ్యాయులను బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. బెలుం ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన వెంకటకృష్ణుడు అనే ఉపాధ్యాయుడు కూడా బదిలీ కావడంతో ఆయనకు ఎంఈవో శ్రీధర్‌రావు సన్మానించారు.

**అవుకులో..** మండలంలోని కునుకుంట్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు మాబీని హెచ్‌ఎం శివరంగయ్య, గ్రామ నాయకుడు గూడాల శివారెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## హుస్సేనాపురంలో స్వచ్ఛభారత్




స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

**బనగానపల్లె:** మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో రాజస్థాన్ భగవంత్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా విద్యార్థులు బుధవారం బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామీణులు బహిర్భూమికి బయటికి వెళ్లకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 'విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి'

**బనగానపల్లె:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక ఆంధ్రా బ్యాంకు మేనేజర్ రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాజేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గురుస్వామి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, భుజంగరావు, నాగేశ్వర రెడ్డి, పీఈటీ మధు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు :** క్రీడా పోటీల విజేతలకు బ్యాంకు మేనేజర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షీల్డ్, బహుమతులు అందజేశారు. వాలీబాల్ బాలబాలికల విభాగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలువగా, ద్వితీయ స్థానంలో రెండు విభాగాల్లోనూ బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల విజేతగా నిలిచింది. కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో, బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు.



క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రాజేష్

## అనాథ శవానికి అంత్యక్రియలు

**బేతంచెర్ల:** డోన్ పట్టణానికి చెందిన అనాథ శవానికి లైఫ్ రక్త సహాయ బృందం, గ్రామ పంచాయతీ సిబ్బంది, అనాథ మృతదేహాల అంత్యక్రియల నిర్వాహకుడు వన్నూరుబాషా ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. డోన్ పట్టణానికి చెందిన మధు అనే అనాథ వ్యక్తి డోన్ బ్రిడ్జి కింద అనారోగ్యంతో ఉండటంతో చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం అతను మృతి చెందాడు. అనాథ శవాన్ని బేతంచెర్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో లైఫ్ రక్త సహాయ బృందం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సభ్యుడు భూపాల్, గ్రామ పంచాయతీ మేస్త్రి చెన్నయ్య, డోన్‌కు చెందిన మధు తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియల కోసం అనాథ శవాన్ని తీసుకెళ్తున్న వన్నూరుబాషా

## నేటి నుంచి గ్రామ సభలు

**వెల్దుర్తి:** మండలంలోని పంచాయతీల్లో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్‌వహీద్ తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నేడు మల్లెపల్లె, అల్లుగుండు, చెరుకులపాడు, వచ్చే నెల 1న నార్లపురం, సూదేపల్లి, 4న వెల్దుర్తి, మాదార్‌పురం, ఎస్.పేరేముల, 5న రత్నాపల్లె, లక్ష్మినగరం, సర్పరాజాపురం, నర్సాపురం, 6న కలుగొట్ల, పుల్లగుమ్మి, రామళ్ళకోట, బుక్కాపురం, 7న గోవర్ధనగిరి, శ్రీరంగాపురం, పిక్కిలివానిపల్లె, ఎస్.బోయినపల్లి, 8న బోగోలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

## ‘ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం’

**డోన్(రూరల్):** ఉద్యమాలతోనే విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమంతు అన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని పలు కళాశాలలకు సంబంధించి ఏబీవీపీ నూతన కమిటీల ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, రాజేష్, మధు, మహేష్, హరిత, పాపారాయుడు, కార్తీక్, శేఖర్ పాల్గొన్నారు.

## నేడు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

**ప్యాపిలి:** ప్యాపిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీవో అమృతరాజ్ విలేఖరులకు తెలిపారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై గ్రామ సభలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. కావునా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని సూచించారు.

## ‘రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి’

**వెల్దుర్తి:** పత్తి పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆ యన విలేఖరులతో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో పత్తికి రసం పీల్చే పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, పెనుబంక, పిండివల్లి వంటి చీడపీడలు ఆశిస్తాయన్నారు. వీటి నివారణ కోసం తమను సంప్రదిస్తే తగు మందులు సూచిస్తామన్నారు. అలా కాకుండా సొంత పురుగు మందులు వాడి నష్టపోవద్దని రైతులకు సూచించారు. పురుగుల మందుల పిచికారీలో రైతులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

## ‘రస్తా వివాదాలకు దిగొద్దు’

**ప్యాపిలి:** గ్రామాల్లో ఎటువంటి రస్తా వివాదాలున్నా తమ దృష్టికి తీసుకరావాలని తహసీల్దార్ గోవింద్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మెట్టుపల్లి గ్రామాన్ని ఆ యన సందర్శించారు. తహసీల్దార్ కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రస్తా వివాదాన్ని పరిష్కరించారు. గ్రామంలో రైతులతో మాట్లాడి సామరస్యంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలం గట్లు, రస్తాలు తదితర రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. కాబట్టి రైతులు ఎటువంటి భూ వివాదాలున్నా తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కారం చూపుతామన్నారు. ఎటువంటి ఘర్షణలకు దిగవద్దని సూచించారు. సర్వేయర్ హేమంత కుమార్‌రెడ్డి, వీఆర్వో హనుమన్న తహసీల్దార్ వెంట ఉన్నారు.

## ‘పంటల సాగులో మెలకువలు పాటించాలి’

**ప్యాపిలి:** ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వల్ల పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి అల్లి పీరా రైతులకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. గత 10రోజులుగా కురస్తున్న వర్షాల వల్ల వేరుసెనగ, ఆముదం, సజ్జ, కంది తదితర పంటలకు చీడపీడలు సోకే అవకాశాలున్నాయన్నారు.వ్యాపారులు సూచించే మందులను ఎటువంటి పరిస్థితుల్లో వినియోగించవద్దన్నారు.

## 6న మత్స్య సహకార సంఘం ఎన్నికలు

**ప్యాపిలి:** మండలంలోని వెంగళాంపల్లి చెరువుకు సంబంధించి మత్స్య సహకార సంఘం ఎన్నికలు 6న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నాగరాజు బుధవారం తెలిపారు. సం ఘంలో మొత్తం 14మంది సభ్యులున్నారన్నారు. సంఘం అ ధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. 6వతేదీ ఉదయం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ఉంటుందన్నారు అదే రోజు మధ్యాహ్నం ఎన్నిక నిర్వహించడం జరుగుతుదన్నారు.

# సమస్యల వలయంలో పోలీసు క్వార్టర్స్

● పెచ్చులూడుతున్న పైకప్పు ● పిచ్చిమొక్కలతో ఆవరణం


శిథిలావస్థకు చేరిన పోలీస్‌క్వార్టర్స్


అధ్వానంగా దారి

**డోన్(రూరల్):** పట్టణంలోని పోలీసుక్వార్టర్స్‌లో సమస్యలు తిష్ఠవేశాయి. స్థానికంగా పనిచేసే పోలీసుల కుటుంబాలు క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ క్వార్టర్స్ లోపలి భాగాలు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. క్వార్టర్స్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విషపురుగులకు, పందుల బెడద అధికమైంది. చిన్నపాటి వర్షానికే క్వార్టర్స్ ఆవరణం చిత్తడిగా మారుతుంది. క్వార్టర్స్‌కు వెళ్లే దారి ముళ్లకంపలతో నిండి ఉండడంతో పోలీసు కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. పట్టణంలో అద్దె రేట్లు అధికంగా ఉండడంతో పోలీసులు అద్దెలు చెల్లించలేక క్వార్టర్స్‌లోనే ఉంటున్నారు. విధి నిర్వహణలో అలసిపోయి క్వార్టర్స్‌కు చేరుకునే పోలీసులకు సేదతీరేందుకు కూడా ఆవరణ ప్రాంతం అనుకూలంగా లేదు. దీంతో ఇళ్లలోనే ఉండిపోవాల్సి వస్తుంది. వర్షం వస్తే పలు గదులు కారుతున్నాయి. భవనాలకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేపట్టి, పిచ్చిమొక్కలను తొలగించాలని పోలీసు కుటుంబాలు కోరుతున్నారు.

# నేత్రదానంతో ప్రపంచానికి వెలుగు

జిల్లా అంధత్వ నివారణ అధికారి ఆంజనేయులు


మాట్లాడుతున్న డాక్టర్ ఆంజనేయులు

**డోన్:** ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం ద్వారా ప్రపంచానికి వెలుగునిచ్చిన వారవుతారని జిల్లా అంధత్వ నివారణ అధికారి ఆంజనేయులు, ఒనైరో స్కూల్ కరస్పాండెంట్ కోట్రికె ఫణిరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా దేశంలో లక్షా60వేలమందికి నేత్రాలు అవసరమవుతున్నాయన్నారు. లక్షల మంది చూపు లేక చీకటి జీవితాలను గడుపుతున్నారన్నారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత్రదానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లివర్ వ్యాధులు, ఎయిడ్స్ బాధితులు మినహా ఎవరైనా నేత్రదానం చేయవచ్చన్నారు. కోట్రికె ఫణిరాజ్ మాట్లాడుతూ నేత్రాలు ఉంటేనే ప్రపంచాన్ని చూడగలుగుతామన్నారు. నేత్రదానం చేసి అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి కంటి వైద్యనిపుణులు కె.ఎల్.ఎన్.రాజు, పాఠశాల హెచ్‌ఎం కళావతి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## త్వరలో రైతులకు పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ

**డోన్:** డోన్ సబ్‌డివిజన్‌లో 2015కు సంబంధించిన పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ త్వరలో రైతులకు అందించనున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.45కోట్లు మంజూరు చేస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేసింది. దీంతో సబ్‌డివిజన్‌లోని డోన్ మండలానికి రూ.8.73కోట్లు, ప్యాపిలి మండలానికి రూ.3.30కోట్లు, క్రిష్ణగిరి మండలానికి రూ.3.51కోట్లు, వెల్దుర్తి మండలానికి రూ.3.39కోట్లు, బేతంచెర్ల మండలానికి రూ.3.77కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని త్వరలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నా రు.

## ‘సమస్యలు పరిష్కరించాలి’

**డోన్(రూరల్):** అగ్రిగోల్డ్ ఏజెంట్లు, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అగ్రిగోల్డ్ బాధిత, ఏజెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు, పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై చొరవ చూపాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు నాగరాజు, ప్రసాద్, రంగస్వామి, తిమ్మయ్య, శివరామ్ పాల్గొన్నారు.

## ‘సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి’

**డోన్(రూరల్):** ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆర్‌ఎంపీ సంఘాల సమాఖ్య ప్రధాన సభ్యులు మహమ్మద్‌రఫి అన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని తారకరామనగర్‌లో తన క్లీనిక్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వల్ల ప్రజలు దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని సూచించారు.

## విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

**వెల్దుర్తి:** గత సంవత్సరం 10వతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులతోపాటు ట్యాబ్‌లు పుంపిణీ చేశారు. పట్టణంలో శ్రీవిద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ఆర్.మోహనక్రిష్ణరావు, నితిన్‌లు 10వతరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ చూపారు. వీరికి గతంలో ప్రభుత్వం ప్రతిభా అవార్డు కింద రూ.20వేలు అందజేసింది. అలాగే ట్యాబ్‌లను విద్యాసంస్థలకు పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల కరస్పాండెంట్ రమణాచలం, హరినాథ్ చేతులుగా ట్యాబ్‌లను అందజేశారు.

# ఇష్టారాజ్యం

● రైతు బజార్లో అధిక ధరలకు విక్రయం

● అధికారుల ఆదేశాలు బేఖాతర్.. బెదిరింపు ధర్నా

**కర్నూలు(అగ్రికల్చర్):** కర్నూలు నగరంలోని కొత్తపేట రైతుబజార్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. బుధవారం జరిగిన ధర్నా దీనికి నిదర్శనం. వ్యాపారులు ఈ రైతుబజారులో పట్టికలో చూపిన దానికంటే ఎక్కువ ధరకు టమోటాలు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఎస్టేట్ అధికారి జయమ్మకు ఫిర్యాదు చేశారు. వ్యాపారులను పిలిపించి నగరంలోని మిగతా రైతుబజార్లలో విక్రయిస్తున్న ధరకే టమోటలు విక్రయించాలని, లేకుంటే వద్దని ఆదేశించారు. దీంతో వ్యాపారులు కొన్ని రోజులపాటు టమోటాలు విక్రయించలేదు. దీంతో ఎస్టేట్ అధికారి పొదుపు మహిళలతో టమోటాలు విక్రయించే ఏర్పాటు చేశారు. ఈ పరిణామం జీర్ణించుకోలేని వ్యాపారులు బుధవారం కూరగాయల విక్రయాన్ని నిలిపివేసి ధర్నా చేశారు.

**ఎస్టేట్ అధికారిపై ఫిర్యాదులు:**

ఈ సంఘటనపై విచారణకు వచ్చిన ఏడీఎం సత్యనారాయణ చౌదరికి ఎస్టేట్ అధికారి జయమ్మపై కూరగాయల వ్యాపారులు ఫిర్యాదు చేశారు. తమ నుంచి ఎస్టేట్ అధికారి మామూళ్లు వసూలు చేశారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిస్తామని, టమోటాలను పొదుపులక్ష్మి మహిళలు తక్కువ ధరకే విక్రయిస్తారని, ఆటంకాలు సృష్టించవద్దని ధర్నా చేసిన వారికి ఆయన స్పష్టం చేశారు. ఏడీఎం ఆదేశాలపై వారు ధర్నా విరమించారు. కూరగాయల క్రయ విక్రయాలు కొనసాగాయి.

**ఎప్పుడూ గొడవే:**

కొత్తపేట రైతుబజార్‌లో తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. కూరగాయలు అమ్ముకొనేవారు ఎస్టేట్ అధికారిపై ఫిర్యాదు చేస్తుంటే ఆ అధికారి కూడా వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఉన్నతాధికారులు సత్వర నిర్ణయం తీసుకోకపోవడంతో తాము ఇబ్బందిపడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట రైతుబజార్‌ను గాడిలో పెట్టకుంటే చివరికి అధికారులే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు.



ఆందోళన చేస్తున్న వ్యాపారులు



ఖాళీగా ఉన్న స్టాళ్లు

# కృష్ణా నగర్ రోడ్డు విస్తరణ

● ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం

**కర్నూలు(రాజ్‌విహార్):** కృష్ణానగర్ వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. కార్పొరేషన్ అధికారులు రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి రైల్వే ట్రాక్ దాటి నగరంలో వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. గంటకోసారి గేటు పడటంతో ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీనికి తోడు క్రిష్ణానగర్‌లో ఇందుకు రోడ్లతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పెరుగుతున్న వాహనాల రద్దీ ప్రత్యామ్నాయ మార్గాలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు దృష్టి పెట్టారు. డిప్యూటి సీఎం చొరవతో రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి చేశారు. అయితే అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోయాయి. ఈ బ్రిడ్జి నుంచి వెళ్ళాలంటే వాహనదారులకు చుక్కలు కనపడేవి. ఎగుడు దిగుడు గుంతలతో ప్రమాదాలు జరిగేవి. దీంతో అధికారులు రాకపోకలను నిలిపివేసి అడ్డుగోడను కట్టారు. దీంతో గుత్తి పెట్రోల్ బంకు మీదుగా శరీన్‌నగర్, రామచంద్రనగర్, రిజిస్ట్రార్ కార్యాలం నుంచి కృష్ణానగర్‌కు చేరుకోవల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజా సంఘాలు, ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. స్పందించిన అధికార యంత్రాంగం రైల్వే అండర్ బ్రిడ్జి ముందు ఉన్న షాపులను తొలగించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని, బ్రిడ్జి కింద రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎక్స్‌కవేటర్‌తో రోడ్లను విస్తరిస్తున్న సిబ్బంది

## 'స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి'

**కర్నూలు(ఎడ్యుకేషన్):** స్థానిక ఉర్దూ యూనివర్సిటీలోని ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి రాయలసీమ యూత్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సోయబుద్దీన్ ఖాద్రి మాట్లాడుతూ ఉర్దూ భాషలోనే యూనివర్సిటీ బోర్డు పెట్టాలన్నారు. వైస్ చాన్సలర్ వద్ద ఉన్న ముఖ్య సలహాదారులను తొలగించాలని, వర్సిటీకి స్వంత బిల్డింగ్‌ను నిర్మించాలని కోరారు. ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేసిన వారిలో రియాజ్, ఖాజీం హుస్సేని, జిలాని, ఎండీ ఖలీల్, శ్రీనివాసులు ఉన్నారు.

## రాజీనామా చేసి గెలవండి: ఐజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఐజయ్య

**కర్నూలు(న్యూసిటీ):** నంద్యాల ఉప ఎన్నికల్లో సానుభూతి ఓట్లతో గెలిచిన టీడీపీ దమ్ముంటే వైసీపీ నుంచి తమ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికల్లో గెలవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య సవాల్ విసిరారు. బుధవారం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవై.రామయ్యతో కలిసి ఐజయ్య విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో గెలిచామని ఆనందించడం కాకుండా వైసీపీ నుంచి తమ పార్టీ మారిన వారితో రాజీనామా చేయించి గెలిస్తే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించినట్లేనని అన్నారు. ఇంత వరకు వైసీపీ నుంచి టీడీపీలోకి 20 మంది ఎమ్మెల్యేలు వెళ్లారని, వారితో రాజీనామా చేయించి ఎన్నికల్లో గెలవాలని సవాల్ చేశారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శౌరి విజయకుమారి, ఆదోని బీసీ సెల్ కార్యదర్శి డా.మధుసూదన్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

**కర్నూలు(న్యూసిటీ):** ప్రగతి మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం లిమిటెడ్ సర్వసభ్యసమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సంఘం సీఈఓ షకీలా తెలిపారు. దేవనగర్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం విలేఖరులతో ఆమె మాట్లాడుతూ ఈ నెల 31న జరగాల్సిన సమావేశాన్ని జిల్లా సహకార అధికారి సుబ్బారావు ఆదేశాల మేరకు వచ్చే నెల నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రగతి సంస్థ యజమాన్యం, న్యాయ సలహాదారుడు సాత్రిసుబ్బయ్య మాదిగపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల సమాఖ్య పేరున బాలసుందరం అసభ్యకరమైన పదజాలంతో కరపత్రం విడుదల చేయడం మంచిది కాదన్నారు.

## బచ్‌పన్, సాయికృష్ణలో క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**కర్నూలు(ఎడ్యుకేషన్):** స్థానిక రామచంద్రనగర్‌లోని బచ్‌పన్, శ్రీసాయికృష్ణ విద్యానికేతన్‌లో బుధవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులకు ఆటలతోపాటు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల చిన్నారులలో క్రీడల పట్ల ఆసక్తి, క్రీడాస్ఫూర్తి పెరుగుతాయని డైరెక్టర్ వై.మీనా అన్నారు.

## నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి: టీజీ భరత్

**కర్నూలు(కార్పొరేషన్)** మట్టి వినాయకుని పూజించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని టీజీబీ యూత్ అధ్యక్షుడు టీజీ భరత్ కోరారు. బుధవారం స్థానికవెంకటరమణ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలో ప్రతియేటా వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది బక్రీద్ పండుగ, వినాయక నిమజ్జనం ఒకే రోజు జరుపుకుంటున్నందున హిందూ, ముస్లిం ఐక్యమత్యంతో వేడుకలు జరుపుకోవాలని భరత్ కోరారు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న భరత్

## రూ.10వేల సాయం

**కర్నూలు(ఎడ్యుకేషన్):** ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పి.శాంతా కుమారి కుటుంబ సభ్యులకు రూ.10వేలను ఆర్ఐఓ వై.పరమేశ్వరరెడ్డి, జిల్లా వృత్తి విద్యాధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు బుధవారం అందజేశారు. ఇంటర్ కమిషనర్ ఉదయలక్ష్మి ఆదేశాల మేరకు విద్యార్థిని అంత్యక్రియలు నిమిత్తం నగదును కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వారు తెలిపారు.

## 3న తైక్వాండో పోటీలు

**కర్నూలు(స్పోర్ట్స్):** ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో సెప్టెంబర్ 3న సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికలకు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి జి.శోభన్ బాబు తెలిపారు. గెలుపొందిన విజేతలను రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

## సేవల్లో పాలుపంచుకోవాలి: సోమిశెట్టి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు(కార్పొరేషన్):** సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సతీమణి విజయమనోహరి పిలుపు ఇచ్చారు. బుధవారం ఎస్.నాగప్ప వీధిలోని చెన్నకేశవ ఆలయం వద్ద భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేటలోని అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో అంధులైన అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి విజయ మనోహరి మాట్లాడుతూ వినాయకచవితి వేడుకల సందర్భంగా పూజలతోపాటు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

## రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల

**కర్నూలు(ఎడ్యుకేషన్):** ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల లక్ష్మీకాంతయ్యను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అద్యక్షునిగా బత్తుల లక్ష్మీకాంతయ్య వడ్డెర సంక్షేమానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి బీసీ సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీ ఫెడరేషన్లకు నిధులు సాధించేంత వరకు పోరాడుతానని బత్తుల లక్ష్మీకాంతయ్య తెలిపారు.



బతులకు నియామక పత్రం

## ముగిసిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులో పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ

**కర్నూలు:** స్థానిక వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన టెస్టులో పది మంది విద్యార్థులు కరాటేలో చక్కని నైపుణ్యంతో ప్రదర్శించి వివిధ రకాల బెల్టులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ కరాటే, ఉషూల శిక్షణ వల్ల విద్యార్థులలో ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతుందని అన్నారు. విజేతలైన విద్యార్థులకు సురేఖ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జు పవన్‌కుమార్, డీన్ ప్రభాకర్, బెల్టు ఎగ్జామినర్ శ్రీనివాసులు, పాఠశాల శిక్షకుడు బి.రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 5
కర్నూలు సిటీ
కర్నూలు ● గురువారం 31 ఆగస్టు 2017

# నిమజ్జనం కోసం..

## నేడు నిర్వాహకులతో సమావేశం

**కర్నూలు(కల్చరల్/కార్పొరేషన్):** నగరంలోని గణేష్ నవరాత్రి ఉత్సవ మండళ్ల ప్రతినిధుల సమావేశం గురువారం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర కార్యాధ్యక్షుడు కిష్టన్న బుధవారం తెలిపారు. వినాయక ఘాట్‌లోని వినాయక మందిరంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో నిమజ్జనోత్సవాల గురించి చర్చిస్తామని ఆయన తెలిపారు.



వినాయక ఘాట్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

**ఏర్పాట్ల పరిశీలన..**

నగరంలో శనివారం నిర్వహించే గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ హరినాథ్ రెడ్డి కోరారు. వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బక్రీద్ పండుగతో పాటు గణేష్ నిమజ్జనం ఒకేరోజు జరుపుకుంటున్నందున ప్రజలు సంయమనంతో, ఐకమత్యంతో వ్యవహరించాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వినాయక ఘాట్‌కు తరలివెళ్లే మార్గాల్లో భక్తులనే మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరు రమణమూర్తి, డీఈ రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యునానీ ఉద్యోగాలు భర్తీ చేయాలని వినతి

**కర్నూలు(స్పోర్ట్స్):** జిల్లాలో యునాని డాక్టర్ల ఉద్యోగాలు భర్తీ చేయాలని ఏపీ యునాని డాక్టర్స్ సంఘం ప్రతినిధి డా.నవీన్ కుమార్ కోరారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి యునాని వైద్యులు బుధవారం వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్రంలో యునాని మెడికల్ కళాశాల, యునాని డిస్పెన్సరీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, యునాని కాంట్రాక్టర్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం దృష్టికి సమస్యలను తీసుకువెళతానని, అసెంబ్లీలో చర్చిస్తానని వారికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యునానీ వైద్యులు నవీన్, యూనస్ బాషా, ఆసీఫ్ ఖాన్, జిలానీ బాష, మున్వర్, గౌస్ జిలానీ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి యునాని వైద్యుల వినతి పత్రం

# విజేతలకు అభినందన

**కర్నూలు:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలో జరిగిన అంతర్ పాఠశాలల పోటీలో ప్రతిభ చాటిన బెటాలియన్ సాయుధ పోలీస్ విద్యానికేతన్ విద్యార్థి ఫాషావలిని కమాండెంట్ శామ్యూల్ జాన్ బుధవారం అభినందించారు. ఫాషావలి షాట్‌పుట్‌లో కాంస్య పథకం సాధించారు. అలాగే తేజస్విని 400 మీటర్ల పరుగు పందెంలో, ధరణి 100 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరామిరెడ్డి, పాఠశాల హెచ్ఎం జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మెడల్ ప్రదానం చేస్తున్న కమాండెంట్

## సీ.క్యాంప్ రైతు బజార్

బుధవారం ధరలు (కిలో.. రూ.)

| | |
|---|---|
| టమోటా | 26 |
| వంకాయ | 30-36 |
| బెండ | 12 |
| పచ్చిమిర్చి | 16-20 |
| కాకర | 14 |
| బీర | 16 |
| క్యాలీఫ్లవర్ | 26 |
| క్యారెట్ | 60 |
| క్యాబేజీ | 24 |
| బీన్స్ | 56 |
| దొండ | 24 |
| ఆలు | 20 |
| ఉల్లి | 16-20 |
| చౌలేకాయలు | 16 |
| సొరకాయ | 10 |
| బుడంకాయ | 14 |
| దోసకాయ | 14 |
| చిక్కుడు | 36 |
| బీట్‌రూట్ | 36 |
| ముల్లంగి | 16 |
| సీమవంకాయ | 30 |
| మునగ(1) | 3 |
| నిమ్మ(1) | 2 |
| అల్లం | 60 |
| చామ | 40 |
| క్యాప్సికం | 50 |
| ఎర్రమిర్చి | 42 |

- కర్నూలు(అగ్రికల్చర్)

# దోమల నివారణ చర్యలు



మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

**కర్నూలు(కార్పొరేషన్):** నగరంలో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు నగర పాలక సంస్థ సీనియర్ ఎంటమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్ బుధవారం తెలిపారు. సీ.క్యాంప్, ఆర్ అండ్ బీ కార్యాలయం శ్రీరామనగర్ ప్రాంతాల్లో మురుగు నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేసినట్లు ఆయన తెలిపారు. బుధవారపేట, సంతోష్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారి చేసినట్లు తెలిపారు.

# 'హెచ్‌డీఎస్ నిధులతో వసతులు'



మాట్లాడుతున్న స్టేట్‌ప్రోగ్రాం ఆఫీసర్

**కర్నూలు(హాస్పిటల్):** కేంద్రం విడుదల చేసిన హెచ్‌డీఎస్ నిధులను రోగుల వసతుల కల్పనకు ఉపయోగించాలని స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ అరుణ్‌కుమార్ సూచించారు. మూడురోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన బుధవారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వెంకటరమణ, వైద్యావిధన పరిషత్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, పీవోడీటీటీ సరస్వతి, డీఎంవో డేవిడ్‌రాజు, డెమో ఎర్రం రెడ్డి పాల్గొన్నారు.



బదిలీ అయిన కోడుమూరు ప్రభుత్వ పాఠశాలలఉపాధ్యాయిని మణిపార్వతిని సన్మానిస్తున్న ఎంఈవో అనంతయ్య

## నేడు బస్సుల్లో ఖాళీ సీట్ల వివరాలు

| రూటు | ఏ/సీ బస్సుల్లో | | నాన్ ఏ/సీ బస్సుల్లో | |
|---|---|---|---|---|
| | పగలు | రాత్రి | పగలు | రాత్రి |
| హైదరాబాద్ | 100 | 36 | 250 | 170 |
| బెంగళూరు | 32 | 31 | 201 | 200 |
| చెన్నై | 0 | 68 | 70 | 31 |
| విజయవాడ | 0 | 0 | 242 | 145 |

రిజర్వేషన్ కోసం సెల్: 9959225826 (కర్నూలు రూరల్)



# విజయవంతం చేయండి: ఆర్డీవో

**కర్నూలు(రూరల్):** ఈ నెల 2వ తేదీన జరగనున్న వినాయక నిమజ్జనం, బక్రీదు కార్యక్రమాల్లో విధులను అంకిత భావంతో నిర్వహించి విజయవంతం చేయాలని కర్నూలు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో తన కార్యాలయంలో బుధవారం రాత్రి కర్నూలు డివిజన్ పరిధిలోని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లతో బక్రీద్, వినాయక నిమజ్జన నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో అత్యవసర కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి తహసీల్దార్ ఉదయం బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్న తర్వాతనే నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు వారికి కేటాయించిన కేంద్రాల వద్ద ఆర్ఐ, వీఆర్వోలను, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా విధులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డివిజన్ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## అధికారుల పర్యటన

**గూడూరు:** మండలంలోని గుడిపాడు గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో నాగేశ్వరరెడ్డి, ఈసీ మధుసూదన్ రావు పర్యటించారు. బుధవారం గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు.

# ఆదమరిస్తే.. అంతే..!

● గుత్తి రోడ్డు గుంతలమయం ● భారీగా నిలిచిన వర్షపు నీరు



ధ్వంసమైన రోడ్డు.. నిలిచిన వర్షపు నీరు

ఆ దారిలో ఏమరుపాటుగా ఉంటే.. గుంతలో పడాల్సిందే. బైక్ అదుపు తప్పిందో.. కాళ్లూ చేతులు విరగాల్సిందే. భారీ వాహనం గుంతలో పడితే.. రాకపోకలు స్థంభిస్తాయి. ఇది గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి ఉస్థితి. గుత్తి పెట్రోల్ బంకు దగ్గర రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. ఇటీవల కురిసి వర్షాలకు గుంతలు నిండిపోయి జలమయమయ్యాయి. నీరే కదా అని అందులోకి వాహనం పోనిస్తే ప్రమాదాలకు గురవ్వక తప్పదు. రోజూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేదు. చినుకుపడితే వర్షపు నీరు అంతా రోడ్డుపైనే నిలిచిపోతుంది. ఈ నీటిలో పందులు తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. రోడ్డు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. రింగురోడ్డు పనులు పూర్తయినా.. భారీ వాహనాలు ఆటుగా వెళ్లడం లేదు. నగరం మీదుగానే వెళుతుండటంతో రోడ్లు ధ్వంసమౌతున్నాయి. జాతీయ రహదారికిరువైపుల డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, భారీ వాహనాలను రింగురోడ్డుమీదుగా మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు.

**- కర్నూలు(కలెక్టరేట్)**

### లారీ పడిపోయింది..



రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఇటీవల లారీ పడిపోయింది. బయటకు తీసేందుకు రెండు రోజులు సమయం పట్టింది. డివైడర్‌కు ఇరువైపులా రోడ్లపై రెండు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటిని పూడ్చేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. అటువైపు వాహనాలు రాకుండా ఉండేందుకు అడ్డంగా రాళ్ల ఏర్పాటు చేశాం. అధికారులు ఎవ్వరు పట్టించుకోవడం లేదు. **- శంకర్, కాలనీ వాసి**

### రింగ్‌రోడ్డుపై వాహనాలు వెళ్ళడం లేదు



రింగు రోడ్డు వాడుకలోకి వచ్చినా ఎవ్వరూ వినియోగించడం లేదు. రింగు రోడ్డుపై భారీ వాహనాలు వెళితే నగరంలో సగం ప్రమాదాలు తగ్గుతాయి. రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ లేకపోవడం వల్లే రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో రహదారి దెబ్బతింటూ ప్రమాదాలకు కారణం అవుతోంది. రోడ్డుకిరువైపుల డ్రైనేజీని ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

**- పక్కీరప్ప గౌడ్, కాలనీ వాసి**



ప్రమాదకరంగా మారిన రహదారి

### ఏమరపాటుతో వస్తే ప్రమాదమే..



రైల్వే గేటు దాటిన తర్వాత వాహనాలు వేగంగా వస్తాయి. ఇక్కడ గుత్తి పెట్రోల్ బంకు జంక్షన్‌ను క్రాస్ చేసే సమయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా పెనుప్రమాదం తప్పదు. నగరంలో నుంచి డోన్ రూట్ వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే గుంతలో పడి ప్రమాదానికి గురి కావాల్సిందే. అధికారులు రోజూ చూస్తుంటారు. మరమ్మతులు చేయడం లేదు.

**- మైఖేల్, కాలనీవాసి**

## అంగన్‌వాడీ కార్యకర్తపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

**కర్నూలు(కలెక్టరేట్):** శ్రీరాం నగర్ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న కార్యకర్త శ్యామలాదేవిపై కాలనీ వాసులు జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. తన ఇంటినే అంగన్‌వాడీ కేంద్రంగా మర్చిందని, బయటే నిలబెట్టి గుడ్లు, బియ్యం పంపిణీ చేస్తోందని వారు తెలిపారు. కాలనీకి చెందిన పరుశరాముడిపై శ్యామలాదేవి కుమారుడు అశోక్ దాడి చేశాడని బాధితుడి భార్య జయలక్ష్మి జేసీకి ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి పోలీసులతో విచారణ జరిపిస్తామని జేసీ హామీ ఇచ్చారు. కాలనీవాసులు శోభ, శివలక్ష్మి, మాలన్‌బీ, రత్నమ్మ, లక్ష్మిదేవి లక్ష్మిదేవి, ప్రశాంతి జేసీని కలిసినవారిలో ఉన్నారు.

## సేవలు మరువరానివి: ఎంఈవో



కృష్ణవేణమ్మను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయ బృందం

**ఓర్వకల్లు:** బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయిని కృష్ణవేణమ్మ సేవలు మరువరానివని ఎంఈవో ఫైజున్నిసాబేగం కొనియాడారు. ఓర్వకల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కృష్ణవేణమ్మ బేతంచెర్లకు బదిలీ అయ్యారు. దీంతో పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. పూలమాలలు, దుశ్శాలువాలతో ఆమెను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి బదిలీపై వెళ్తున్న కృష్ణవేణమ్మ రూ.10 వేల నగదును ఎంఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కమల లక్ష్మి, వసంత లక్ష్మి, బాబురావు, గౌస్ ఉన్నిసా, ఎస్తేరు రాణి, వసంత, ఎంఆర్‌సీ సిబ్బంది మధుమోహన్, సంజమ్మ, ఉస్మాన్‌వలి, సీఆర్‌పీలు మల్లికార్జునయ్య, నాగమద్దయ్య పాల్గొన్నారు.

## 5న వ్యాసరచన పోటీలు

**కర్నూలు(రాజ్‌విహార్):** స్వచ్ఛ సంకల్పనే స్వచ్ఛ సిద్ధి కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో వ్యాసరచరన పోటీలను నిర్వహిస్తున్నట్లు యువ కేంద్ర కోఆర్డినేటర్ నారాయణబాబు బుధవారం తెలిపారు. టీచర్స్‌డే పురస్కరించుకొని సెప్టెంబరు 5న 'శుభ్రతకోసం నేనేమి చేయగలను?' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు 220831 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

# సేవా సమయం

● పేద విద్యార్థులకు బాలయ్య ఫాన్స్..
● ఆశ్రమాల్లో పవన్ అభిమానులు..
● వినాయక మంటపాల్లో ఉత్సవ కమిటీలు

**కర్నూలు(న్యూసిటీ/రాజ్ విహార్):** హిందూపురం ఎమ్మెల్యే, నందమూరి బాలకృష్ణ నటించిన పైసా వసూల్ చిత్రం విడుదల సందర్భంగా జిల్లా బాలక్రిష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆనంద్ థియేటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, నగర అధ్యక్షుడు అర్యశంకర్, కార్యదర్శి నందిమధులు ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో 101 మంది పేద విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేస్తున్నామని సుధాకర్ తెలిపారు. ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చిన చిత్ర నిర్మాత ఆనంద్ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏమోజిరావు, లక్ష్మయ్య, విక్రం, చంద్ర, హేసేన్‌పీరా, సలీం, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న బాలయ్య అభిమానులు

**పవన్ అభిమానులు..**

సెప్టెంబర్ 2 జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం పురస్కరంచుకుని జిల్లా జనసేన సేవాదళ్ నాయకురాలు జే.రేఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల వేడుకలు ప్రారంభించారు. తొలిరోజు బుధవారం జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో రెండు సీలింగ్ ఫ్యాన్లు, పండ్లు పంపిణీ చేశారు. విజ్ఞానపీఠం అనాథశరణాలయంలో 120 మంది అనాథలకు గురువారం అన్నదానం, 1వ తేదీన పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ 2వ తేదీన ముజఫర్ నగర్‌లోని వినాయక విగ్రహం వద్ద అభిషేకం నిర్వహిస్తామని సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.మౌలాలి, రఘు, అంజాద్, రాజశేఖర్, వెంకటేశ్, యుసూఫ్, ప్రేమ్, మహేష్ పాల్గొన్నారు.

**రెండో వార్డులో..**

మద్వావీధిలో వినాయక భక్త బృందం బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైసీపీ నాయకులు హఫీజ్ ఖాన్, చెరుకుచెర్ల రఘురామయ్య పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. బక్రీదు, గణేష్ నిమజ్జన మహోత్సవాలను శాంతి యుతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని హఫీజ్ కోరారు. కార్యక్రమంలో మోహన్, కిరణ్, మాలిక్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

**ఆదిత్యనగర్‌లో అన్నదానం**

వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతిఏటా వినాయక చవితి సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య, మణికంఠ, ప్రీతమ్, నాని, శ్రీనివాస్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు భోజనం పెడుతున్న హఫీజ్ ఖాన్



జనసేన నాయకుల పండ్లు పంపిణీ



అన్నదానం చేసిన యువకులు

## స్మార్ట్ పల్స్ సర్వేపై గ్రామసభలు

**కోడుమూరు(రూరల్):** గతంలో నిర్వహించిన స్మార్ట్ పల్స్ సర్వేపై మండలంలో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆదయ్య తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్ ఈవోఆర్డీ అధికారుల నేతృత్వంలో మూడు టీమ్‌లు గ్రామసభలు నిర్వహించి ఇళ్లు లేని వారిని గుర్తిస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గురువారం వర్కూరు, లద్దగిరి, ప్యాలకుర్తి గ్రామాల్లోనూ, సెప్టెంబరు 1న అనుగొండ, ఎర్రదొడ్డి, అమడగుంట్ల, వెంకటగిరి, గోరంట్ల, 5న కల్లపరి, పులకుర్తి, మెరుగుదొడ్డి గ్రామాల్లో, అలాగే 6న కృష్ణాపురం, ముడుమలగుర్తి, 7న కోడుమూరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు.

# ప్రమాదాలు నివారించండి.. ప్రాణాలు కాపాడండి

**ఓర్వకల్లు:** ఓర్వకల్లు గ్రామ సమీపాన ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే అధికారులు ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడాలని ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్‌సీ ఎల్లారెడ్డి జూనియర్ కళాశాల వరకు ఇరు వైపులా సర్వీసు రోడ్లు లేకపోవడంతో రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం ఆర్‌సీ ఎల్లారెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాలకు వెళ్తుండగా వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొనడంతో శాంతికుమారి మృతి చెందగా, మరో ఏడుగురు విద్యార్థినులకు గాయాలైన విషయం పాఠకులకు విదితమే. అయితే ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఆర్టీసీ బస్సులు దిగి రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ


ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశం ఇదే

ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీసుస్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు ఆర్‌సీ ఎల్లారెడ్డి జూనియర్ కళాశాల, సీఎల్‌ఆర్ శిక్షణ కేంద్రం, పొదుపు లక్ష్మి మండల సమాఖ్య కార్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహం ఉన్నాయి. అయితే ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయి. వేగాన్ని నివారించేందుకు అధికారులు చొరవ తీసుకొని ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కార్యాలయాల ఎదురుగా ఇరువైపులా బస్‌స్టేజీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి కొత్తబోరు: కరుణాకర్‌రాజు

**గూడూరు:** గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీటి సమస్య పరిష్కారానికి సొంత ఖర్చులతో కొత్త బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకుడు కరుణాకర్‌రాజు చెప్పారు. బుధవారం గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో నెలకొన్న నీటి సమస్యను దేశం నేత కరుణాకర్


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు కరుణాకర్‌రాజు

దృష్టికి తీసుకెళ్లారు. నీటి సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా రూ. 68 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణం నిలిచిపోయిన విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన దేశం నేత కరుణాకర్‌రాజు రూ. 30 వేలు ఖర్చు చేసి కొత్తబోరు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

## క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

**ఓర్వకల్లు:** మండలంలోని కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచడంతో బుధవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు క్రీడాకారులను, పీఈటీ నాగేశ్వరరావును అభినందించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న కర్నూలు స్టేడియంలో అంతర్‌రాష్ట్రాల అథ్లెటిక్ గేమ్స్ 100 మీటర్ల పరుగుపందెంలో బ్రహ్మం మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రాజేష్ మొదటి స్థానం, లాంగ్‌జంప్‌లో బ్రహ్మం మొదటి స్థానం, రాజశేఖర్ రెండో స్థానంలో గెలుపొందారు. హైజంప్‌లో పాలప్పనాయుడు, రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలన్నారు. గురుకుల విద్యార్థులు అనేక క్రీడల్లో ప్రతిభ కనబరిచి అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రిన్సిపాల్ కొనియాడారు.

## విద్యార్థిని ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ప్రదర్శన

**ఓర్వకల్లు:** స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న శాంతికుమారి ప్రమాదంలో మృతి చెందడంతో బుధవారం రాత్రి ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏఐఎస్‌ఎఫ్, ఆర్‌వీఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి శాంతికుమారి ఆత్మకు శాంతి కలగాలని ప్రదర్శన నిర్వహించినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్, రవీంద్ర, రాజు, ఇంతియాజ్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షలు, గాయాలైన 7 మంది విద్యార్థినులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఇంతియాజ్, బాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

## ఆసుపత్రిలో కోలుకుంటున్న మహాలక్ష్మి

**ఓర్వకల్లు:** ఓర్వకల్లు ఆర్‌సీ ఎల్లారెడ్డి కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శకునాల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మహాలక్ష్మి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విద్యార్థినికి ఏఎంసీలో వెంటిలేటర్ ద్వారా వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

మరో ఆరుగురు విద్యార్థినులు కూడా చికిత్స పొందుతున్నారు.

## 'ప్రీతిబాయి మృతికి కారణమైన యాజమాన్యాన్ని శిక్షించాలి'

**ఓర్వకల్లు:** విద్యార్థినీ ప్రీతిబాయి మృతికి కారణమైన పాఠశాల యాజమాన్యాన్ని శిక్షించాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ పాణ్యం నియోజకవర్గ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విద్యార్థి ప్రీతిబాయి మృతి చెందిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల ఉప ఎన్నికల్లో చంద్రబాబు చేసిన అభివృద్ధే టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయానికి కారణమని పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

## నేడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

**గూడూరు:** గూడూరు నగర పంచాయతీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నయూమ్ అహమ్మద్ చెప్పారు. బుధవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగర చైర్‌పర్సన్ ఇందిరాసుభాషిణి అధ్యక్షతన నిర్వహించే కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## 'ఎర్రమట్టి తవ్వకాల్లో వీఆర్వోల చేతివాటం'

**సి.బెళగల్:** ఎర్రమట్టి తవ్వకాల్లో వీఆర్వోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ అన్వర్‌హుసేన్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులు ఎర్రమట్టిని తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయన్నారు. మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ఎర్రమట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎర్రమట్టి తవ్వకాలను అరికట్టి వీఆర్వోలపై చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

**కోడుమూరు(రూరల్):** కోడుమూరు, వర్కూరు గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వర్కూరు గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్ వ్యక్తిగత పనిపై తన మోటర్‌సైకిల్‌పై కోడుమూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా న్యూ ఎస్సీ కాలనీ సమీపంలో అతడు ప్రయాణిస్తున్న మోటర్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతని కుడిమోకాలు పూర్తిగా విరిగి, తీవ్ర రక్తస్రావం అయింది. స్పృహ కోల్పోయిన బాధితుడిని గ్రామస్థులు చికిత్స నిమిత్తం ఆటోలో కోడుమూరుకు తరలించారు.

## స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి: ఏవో

**సి.బెళగల్:** క్రిమి సంహారక మందులు, సీడ్స్ స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ముడుమాల గ్రామంలో ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఫర్టిలైజర్ యజమానులు క్రిమిసంహారక మందులు, ఫెస్టిసైడ్స్, సీడ్స్ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈపాస్‌ను తప్పనిసరి అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సిద్దు, నాగశిరీష, ఫర్టిలైజర్స్ యజమానులు ఉన్నారు.

## విద్యుత్ అధికారులను అడ్డుకున్న ప్యాలకుర్తి రైతులు

**కోడుమూరు(రూరల్):** మండలంలోని ప్యాలకుర్తిలో బుధవారం గ్రామానికి వచ్చిన విద్యుత్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. స్పెషల్ డ్రైవ్ కింద బిల్లులకు వెళ్లిన ఏడీఈ విజయసారధి, ఏఈ ప్రియాంక, మిగతా సిబ్బందిని రైతులు అడ్డుకొని లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్ పోస్టులు గ్రామానికి మంజూరు చేయాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఫీజు కాలిపోయినా, బ్రేక్‌డౌన్, ఫీడర్ ట్రిప్పింగ్ వంటి సమస్యల గురించి ఎవరికి తెలుపుకోవాలని నిలదీశారు. రెండు నెలలుగా అధికారుల దృష్టికి తెస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో చర్యకు ఉపక్రమించినట్లు రైతులు సిద్ధిక్, మాజీ సర్పంచ్ హుసేన్‌అలాం, ఆదెన్న, రఫీ, సుధాకర్, సుభాన్, రాముడు వివరించారు. దీంతో 10 రోజుల్లోగా సిబ్బందిని నియమిస్తామని ఏడీఈ విజయసారధి వారికి హామీనిచ్చారు.

## 2న తాలూకా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

**కోడుమూరు:** ధ్యాన్‌చంద్ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 2న కోడుమూరు తాలూకా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు(డబుల్స్) నిర్వహించనున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం క్రీడాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనక భాగంలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.2016, రెండో బహుమతిగా రూ.1516, మూడో బహుమతిగా రూ.1016 నగదుతో పాటు షీల్డ్‌ను శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి అందజేయనున్నారు. పోటీలో పాల్గొనదలుచుకొనే జట్టు పూర్తి వివరాల కోసం 8074046737 నంబర్‌లో సంప్రదించాలని కమిటీ సభ్యులు రవి, నీలకంఠ, రామగోవిందు, నర్సప్ప తెలిపారు.

## 'మిలియన్ మార్చ్‌కు తరలిరండి'

**కోడుమూరు(రూరల్):** సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించే మిలియన్ మార్చ్‌కు నియోజకవర్గంలోని సీపీఎస్ విధానం కింద పనిచేస్తున్న ఉద్యోగులు తరలిరావాలని కోడుమూరు మండలం ఏపీసీపీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డివిజన్ వీఆర్వో సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎల్లప్ప పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను వారు రెవెన్యూ కార్యాలయంలో విడుదల చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి అజరయ్య బాలికోన్నత పాఠశాల మైదానం వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరుగుతుందని వారు తెలిపారు. సీపీఎస్ విధానం రద్దు కోసం ఉద్యోగులంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.


గోడపత్రిక విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి
మంత్రాలయం
5
కర్నూలు ● గురువారం 31 ఆగస్టు 2017
మంత్రాలయం । పెద్దకడుబూరు । కోసిగి । కౌతాళం

## 'కౌతాళానికి ప్రైవేట్ డిగ్రీ కళాశాల మంజూరు'

**కౌతాళం:** మండల కేంద్రమైన కౌతాళానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను మంజూరు చేసిందని కళాశాల కరస్పాడెంట్ మహబూబ్‌బాషా, ప్రిన్సిపాల్ లింగన్న తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 2017-18 విద్యా సంవత్సరానికి గాను యూనిక్ డిగ్రీ కళాశాలలో బీఏ(హెచ్ఈపీ) ఆంగ్ల మాధ్యమంలో 60సీట్లు, బీకాం (కంప్యూటర్స్)లో 60 సీట్లు ఉన్నాయన్నారు. డిగ్రీ కళాశాలను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు వినియోగించుకుని అడ్మిషన్ పొందాలన్నారు. తమ కళాశాలకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య కౌన్సిల్ గుర్తింపు కూడా ఉందని వారు వివరించారు.

# ఎవరికీ చెప్పుకోలేక..

**స్వచ్ఛభారత్ అంటూ ప్రభుత్వం చేస్తున్న ఆర్భాటం పాఠశాల వరకు చేరటం లేదు. వాటిల్లో మరుగుదొడ్లు లేక పోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు, అలాగే విద్యార్థినులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.**

- **నిరుపయోగంగా మరుగుదొడ్లు..**
- **తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**



కోసిగి బాలుర పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

**కోసిగి రూరల్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక విద్యార్థినుల పరిస్థితి నరకప్రాయంగా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 42 పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 హైస్కూల్స్, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు 32, ఒక మోడల్ స్కూల్, కెజీబీజీ పాఠశాలలు ఉన్నాయి.

**అన్ని పాఠశాలల్లోనూ అంతే..**

ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా వాటికి నీటి సౌకర్యం, తలుపులు లేక నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం విద్యార్థుల కోసం కోట్లాది రూపాయల నిధులు విడు దల చేస్తున్నా వాటితో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**చేతులెత్తేసిన ప్రభుత్వం**

విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, స్కాలర్‌షిప్‌లు, మధ్యాహ్న భోజన పథకం వంటివి ఇస్తున్న ప్రభుత్వం మరుగుదొడ్లు, తాగునీరు విషయానికి వచ్చే సరికి చేతులెత్తేస్తోంది. కోసిగిలో ఉండే రెండు పాఠశాలల్లో దాదాపు మూడు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఇక్కడ తాగడానికి నీరు లేక, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించినా వాటికి బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు ఏకంగా తాళాలు వేస్తున్నారు.

**స్వచ్ఛ భారత్ నామమాత్రమే..?**

ప్రభుత్వం స్వచ్ఛభారత్ అంటూ కేవలం ప్రచార ఆర్భాటాలు చేస్తూ ఆచరణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. మరుగుదొడ్లు లేకపోవటంతో విద్యార్థులు చేసేదేమీ లేక పాఠశాల ఆవరణంలోనే మల, మూత్ర విసర్జన చేస్తూ పరిసరాలను ఆపరిశుభ్రం చేస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో నీరు, మరుగుదొడ్లు ఉండే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**బహిర్భూమికి బయటికి వెళ్తున్నాం**



పాఠశాలలో దాదాపు 1400మంది విద్యార్థులు ఉన్నాం. పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఆరు బయటికి వెళ్తున్నాం. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలి, ఉన్నవాటికి మరమ్మతులు చేయించాలి.

**- బొజ్జప్ప, 9వ తరగతి, బాలుర పాఠశాల, కోసిగి**

## 'షెడ్యూల్ ప్రకారమే సిలబస్ పూర్తి చేయాలి'



విద్యార్థులను ఆరా తీస్తున్న ఎంఈవో

**పెద్దకడుబూరు:** షెడ్యూల్ ప్రకారమే విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలని ఎంఈవో మైనుద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని గంగుల పాడు, రాగిమాన్‌దొడ్డి గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠ్యంశాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో విద్య ప్రమాణాలు పెంచుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. ప్రతి సబ్జెక్టు నందు నిరంతర సమగ్ర మూల్యాంకనం ద్వారా బోధన జరపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'

**మంత్రాలయం రూరల్:** మండల పరిధిలోని బూదూరు గ్రామంలో ఎంపీ యూపీ పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బూదూరు గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాసు లుపై చర్యలు తీసుకోవాలన్నారు. సమయ పాలన పాటించడం లేదని ఆరోపించారు. దీంతో విద్యాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. మండల విద్యాధికారి ఈరన్నకు వినతిపత్రం అందజేశారు. వీరేష్, రహీమాన్ బాబు, ఆంజి, తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'



రాఘవేంద్ర సర్కిల్‌లో జీపుజాత నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

**మంత్రాలయం:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం డివిజన్ కార్యదర్శి లింగన్న అన్నారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో జీపుజాత నిర్వహించారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లోవ మాట్లాడుతూ పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పులికనుమ ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరందించాలన్నారు. మంత్రాలయం నియోజకవర్గాన్ని కరువు మండలంగా ప్రకటించి పంటనష్ట పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి జయరాజు, అనీల్, ఆనంద్, నరసన్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డీటీ రజనీకాంత్‌పై ఆర్డీవో విచారణ

- **సీఎం పేషీకి ఫిర్యాదు చేసిన కొందరు..**
- **కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ : ఆర్డీవో**



విచారణ చేస్తున్న ఆర్డీవో ఓబులేష్

**కోసిగి రూరల్:** మండల డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై ఆదోని ఆర్డీవో సీహెచ్ ఓబులేసు బుధవారం విచారణ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ డీటీ రజినికాంత్‌రెడ్డి కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి లంచం డిమాండ్ చేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు కోసిగికి చెందిన కోసిగియ్య సీఎం పేషీకి ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీటీపై విచారణ చేస్తున్నామన్నారు. కోసిగియ్య, అతనితోపాటు ఉన్న పది మందితో పాటు లింగన్న, రంగయ్య పేర్లు గల వ్యక్తులను కార్యాలయానికి పిలిపించి కార్యాలయానికి పనిమీద వచ్చినప్పుడు డీటీ, మామూళ్లు అడిగారా.. బెదిరింపులకు గురి చేశారా అని ఆరా తీశారు. అయితే సంబంధిత వ్యక్తులు తాము ఎవరికీ ఫిర్యాదు చేయలేదని, కార్యాలయానికి కూడా రాలేదని చెప్పినట్లు తెలిపారు. అలాగే కొంతమంది రైతులను, మహిళా గ్రూపు సభ్యులను, ముస్లిం మైనార్టీలను సైతం డీటీపై వచ్చిన ఆరోపణలపై విచారించారు. ఇందుకు వారు సైతం తాము కార్యాలయానికి వస్తుంటామని, డీటీ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని, ఎవరికీఈ డబ్బులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో విలేఖరులతో మాట్లాడుతూ డీటీపై వచ్చిన ఆరోపణలపై విచారించడం జరిగిందన్నారు. ఆరోపణలు ఆవాస్తవమని తేలిందని తెలిపారు. అయితే వీరశైవ లింగాయిత్‌ల శ్మశాన వాటిక కోసం డీటీ స్థలం కేటాయించడం జరిగిందని, దానిపై ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండవచ్చునన్నారు. విచార ణకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

## మంత్రాలయంలో హుండీ లెక్కింపు



మఠంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

**మంత్రాలయం:** రాఘవేంద్ర స్వామి మఠంలో హుండీ ఆదాయం లెక్కింపు కొనసాగుతూ ఉంది. బుధవారానికి రూ. 1,50,89,930 నగదు వచ్చినట్లు మఠం మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. మరో రూ. 20లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముందన్నారు. తెలిపారు. రూ. 1.70కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇంత భారీ మొత్తంలో హుండి అదాయం రావడం ఇదే ప్రథమమని ఆయన పేర్కొన్నారు. మరో రెండు రోజుల పాటు లెక్కింపు కొనసాగు తున్నట్లు తెలిపారు.

**ఉరుకుందలో ఆదాయం.**

**కౌతాళం:** ఉరుకుందలో ఈరన్న ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. భక్తులు నగదు రూపంలో రూ. 11,70,028బంగారం 1.5గ్రాములు, వెండి 2.5కిలోలు కానుకలుగా సమర్పించారు. పాలక మండలి ఛైర్మన్ చెన్నబసప్ప, ఈవో మల్లికార్జున ప్రసాద్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగనాథం, పర్యవేక్షకుడు మల్లికార్జున, సభ్యులు పాల్గొన్నారు.

## 'ఉపాధి వేతనాలు సక్రమంగా చెల్లించాలి'

**మంత్రాలయం:** ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో ఎఫ్ఏలకు, టీఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారంపాండ్స్ టార్గెట్లను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలిలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎపీవో తిమ్మారెడ్డి, ఈసీ సూర్యప్రకాష్, ఎఫ్ఏ, టీఏలు పాల్గొన్నారు.

## 'బాలికలకు ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం'



అవగాహన కల్పిస్తున్న మహిళ సమతా సోసైటీ రీసోర్స్ పర్సన్

**పెద్దకడుబూరు:** యుక్త వయస్సులో ఉన్న బాలికలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఎపీ మహిళ సమతా సోసైటీ రీసోర్స్ పర్సన్ జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల వయస్సుకు తగ్గ బరువు పెరగాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. యుక్త వయస్సులో కలిగే శారీరక, మానసిక మార్పులు, అలోచన తీరు, గోంతు మారడం, పీరీయడ్స్‌లో ఏర్పడే ఇబ్బందులు, తదితర ఆంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే మూఢ నమ్మకాలను వీడి వైద్యులను సంప్రదించాలన్నారు. సిబ్బంది మేడన్న, రాజేశ్వరి, రేణుక, గాయత్రి పాల్గొన్నారు.

## 'ఆశావర్కర్ల వేతనాలు పెంచాలి'

**కోసిగి రూరల్:** వేతనాలు పెంచాలని ఆశావర్కర్లు సుజాతమ్మ, నాగవేణి, వెంకటేశమ్మ డిమాండ్ చేశారు. బుధవారం కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి శీనివాసులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆశావర్కర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద సౌకర్యం కల్పించాలన్నారు. పీహెచ్‌సీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అర్హులైన వారికి ఏఎన్ఎంలుగా శిక్షణ ఇచ్చి అనంతరం రెండో ఏఎన్ఎంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5వ తేది నుంచి 7వ తేది వరకు పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాలు దగ్గర రాస్తారోకోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లి, వీరేష్ పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దు'

**నందికొట్కూరు రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ కోరారు. వేలాది మంది కార్మికులు మధ్యాహ్న భోజన పథకం కింద పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 71క్లస్టర్లను ఏర్పాటు చేసి, ప్రతి క్లస్టర్‌కు ఒక కిచెన్ సెంటర్ నుంచి ఆహార పదార్థాలను పాఠశాలలకు తరలించాలని చూస్తున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల ఆహార పదార్థాలు చెడిపోయే అవకాశం ఉందన్నారు. ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# మారుతీనగర్‌లో తీవ్ర నీటి ఎద్దడి



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

**నందికొట్కూరు టౌన్:** పట్టణంలోని మారుతీనగర్‌లో బోర్లు ఎండిపోవడంతో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. కాలనీలో వేసవి కాలాన్ని తలపిస్తూ ప్రజలు నీటికోసం వేచి ఉండే పరిస్థితి నెలకొంది. నందికొట్కూరు పరిసర ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో బోర్లు ఎండిపోయాయి. గతంలో సమ్మర్‌స్టోరేజీ ద్వారా పట్టణానికి నీటిసరఫరా జరిగేది. కేసీ కాలువకు నీళ్ల లేకపోవడంతో సమ్మర్‌స్టోరేజీ ఎండిపోవడంతో పట్టణానికి నీటిసరఫరా నిలిచిపోయిం ది. మారుతీనగర్ కాలనీకి ఏడాది పొడవున నీటికష్టాలు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిప ల్ అధికారులు రోజుకు రెండు ట్యాంకర్లు పంపినా నీళ్ల అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే కూలీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే సయమానికి నీళ్ల కోసం నానా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్ అధికారులు కాలనీకి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



పట్టణంలోని మారుతీనగర్, విద్యానగర్, సుబ్బారావు పేట కాలనీల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నాం. ఇటీవల మారుతీనగర్‌లో కొత్త బోర్ల కోసం పాయింట్లను గుర్తించాం. బోర్లను మరమ్మ చేపట్టాం. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో బోర్లలన్నీ ఎండిపోయాయి. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరులేకపోవడంతో సమస్య మరింత అధికమైంది. ప్రజలు నీటి ని పొదుపుగా వాడుకొని సహకరించాలి.

**- నాగభూషణంరెడ్డి, డీఈ**

## 'పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి'



ఎంపీడీవో కార్యాలయం ముందు దీక్షలు చేస్తున్న కూలీలు

**జూపాడుబంగ్లా:** ఉపాధి పథకంలో పని చేసిన కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎంపీడీవో కార్యాలయం ముందు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పనులు చేసి నెలలు గడుస్తున్నా కూలీలకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో రూ.44కోట్ల వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి పథకంలో 250 రోజులు పనులు కల్పించాలని, రూ.300 వేతనం ఇవ్వాలని, పనులు చేస్తూ మృతి చెందిన కూలీలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, కర్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిరసన దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పేదలు

**నందికొట్కూరు రూరల్:** బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డినగర్‌లో గుడిసె వాసులకు ఇళ్లపట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలు బీఆర్ఆర్ నగర్‌లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇళ్లపట్టాలు మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఏ ఒక్క పేదవాడికి సెంటు స్థలం కూడ మంజూరు చేయడం లేదని విమర్శించారు. పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాజరస్, భాస్కరరెడ్డి, అబుబక్కర్ పాల్గొన్నారు.

## 'పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలి'



పండ్ల తోటల పెంపకంపై వెలుగు సిబ్బందితో చర్చిస్తున్న అధికారులు

**పగిడ్యాల:** పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని హార్టికల్చర్ ఏరియా కో-ఆర్డినేటర్ సుబ్బయ్య, వసంత కుమారి వెలుగు సిబ్బందికి సూచించారు. వెలుగు కార్యాలయంలో బుధవారం పండ్లతోటల పెంపకానికి నిర్ణయించుకున్న లక్ష్యాలపై సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు హార్టికల్చర్ కార్యక్రమం కింద పొలం గట్లవెంట జామ, మామిడి, నారింజ, కొబ్బెరి చెట్లను పెంచుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో 50 ఎకరాల్లో వివిధ రకాల మొక్కలను నాటించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 5ఎకరాలు ఉన్న రైతులు ముందుకు వస్తే మొక్కలను నాటినప్పటి నుంచి వాటిని సంరక్షించేందుకు విడతల వారిగా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అయ్యమ్మ, సీసీలు స్వాములు, మదనకుమారి, ముజీబుర్ రహిమాన్, స్వర్ణమేరీ పాల్గొన్నారు.

## షరాఫ్ వేలాలు వాయిదా

**పగిడ్యాల:** పగిడ్యాలలోని చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో బుధవారం నిర్వహించిన షరాష్ వేలం వాయిదా పడింది. గతంలో షరాఫ్ వేలాలను దక్కించుకున్న శ్రీరాములు నిర్ణీత సమయంలో వేలం సొమ్మును చెల్లించకపోవడంతో మరో మూడు నెలల వ్యవధి ఉండగానే గ్రామపెద్దలు వేలాలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. షరాఫ్ వేలాల నిర్వహణపై శ్రీరాములు, గ్రామపెద్దలతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని శ్రీరాములు ముచ్చుమర్రి ఎస్ఐ బాలనరసింహులు దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయన అక్కడి చేరుకుని గ్రామపెద్దలతో చర్చించారు. షరాఫ్ వేలాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, గ్రామంలో భయభ్రాంతులను గురి చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శ్రీరాములు చెల్లించాల్సి ఉన్న రూ.1.75లక్షలను 10రోజుల లోపు చెల్లిస్తానని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

## 'నేటి నుంచి గృహాల మంజూరుపై గ్రామసభలు'

**జూపాడుబంగ్లా:** గ్రామాల్లో ఇళ్లులేని లబ్ధిదారులను గుర్తించి గృహాలు మంజూరు చేసేందుకు గురువారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది గ్రామాల్లో నిర్వహించిన సాధికార సర్వేలో మండంలో 2,521మందికి గృహాలు లేవని ప్రభుత్వం గుర్తించిందన్నారు. మండలంలోని 80బన్నూరు గ్రామంలో 382, ఘనపురం 46, పి.లింగాపురం 114, మండ్లెం 340, పారుమంచాల 430, తంగడంచ 310, తర్తూరు 96, తాటిపాడు 346, తూడిచెర్ల గ్రామంలో 317 మందికి గృహాలు లేవని సర్వే ద్వారా తేల్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారం మరోసారి గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ ఆధ్వర్యంలో మూడు టీంలు 10వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి గ్రామ సభలు నిర్వహించి గుర్తిస్తామని తెలిపారు.

## గురుకుల పాఠశాలలో అక్రమాలపై విచారణ



విద్యార్థులను విచారిస్తున్న డీసీవో కృష్ణమూర్తి

**జూపాడుబంగ్లా:** జూపాడుబంగ్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన అక్రమాలపై గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణమూర్తి బుధవారం విచారణ చేపట్టారు. గదులకు తలుపులు వేసి రహస్యంగా ఒక్కో విద్యార్థిని పిలిచి విచారించారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదని, వంటలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదని, గతేడాది పాఠశాలలో సీట్లను అమ్ముకొని అక్రమాలకు పాల్పడ్డారని, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఈ అక్రమాలపై డీసీవో కృష్ణమూర్తిని విచారణ చేసి నివేదికలు పంపాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించడంతో విచారించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి విలేఖర్లతో మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై విచారించామన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. పాఠశాలలో క్యాటరింగ్ కాంట్రాక్టర్‌కు రెండుసార్లు నోటీసులు ఇచ్చామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎక్కడి సమస్యలు అక్కడే..

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**నందికొట్కూరు టౌన్:** మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులు ప్రవేశపెట్టిన తీర్మానాలు కౌన్సిలర్లు అందరూ ఆమోదించినా పట్టణంలో సమస్యలు మాత్రం తీరడం లేదు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని అధికారులు చేపట్టనున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందస్తు ఆలోచన లేకపోవడంతో పట్టణంలో నీటిఎద్దడి నెలకొందని కౌన్సిలర్లు బహిరంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించే విధంగా తీర్మానాల్లో అంశాలను ప్రవేశపెట్టి ఆచరణకు నోచుకునే విధంగా కౌన్సిలర్లు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 'అర్హులైన వారికి పొలాలను మంజూరు చేయాలి'



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

**పగిడ్యాల:** భూమి కొనుగోలు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు పొలాన్ని మంజూరు చేయాలని కేవీపీఎస్ నాయకురాలు హుసేనమ్మ ఆధ్వర్యంలో తహసీల్దార్ కుమారస్వామికి బుధవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో పొలం లేని నిరుపేదలకు ప్రభుత్వం రుణ సౌకర్యాన్ని కల్పించి పొలాన్ని కొనుగోలు చేసుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. అందులో భాగంగా లబ్ధిదారులు కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకున్నారని, భూమి కొనుగోలు పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి భూమిని మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకురాలు రంగమ్మ, నారాయణమ్మ, సంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 'సీబీఐ కోర్టు తీర్పు హర్షణీయం'

**నంద్యాల టౌన్:** రాష్ట్రంలోని డేరాబాబాకు సీబీఐ కోర్టు 20 సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించడంహర్షించదగిన విషయమని మహానందీశ్వర మండల యువజన సంఘాల సమాఖ్య కార్యదర్శి పన్నంగి వెంకటరమణ పేర్కొన్నారు. డేరాబాబా ప్రజల భక్తిని ఆసరా చేసుకొని ఆశ్రమానికి వచ్చే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం రాక్షసత్వమని పేర్కొన్నారు. డేరాబాబాను జీవితాంతం ఖైదీగా ఉంచాలని కోరారు. డేరాబాబా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## పని చేయని చేతిపంపు.. అల్లాడుతున్న ప్రజలు


చెడిపోయిన చేతిపంపు

**బండిఆత్మకూరు:** మండలంలోని వారధి బస్టాపు సమీపాన ఉన్న చేతి పంపు నెల రోజులుగా పని చేయకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారి వారధి బస్‌స్టాప్ వద్ద అధికారులు చేతిపంపు వేశారు. ఈ పంపు మూడు గ్రామాల రైతులకు, కూలీలకు, నంద్యాల-ఆత్మకూరు రహదారిలో ప్రయాణికులకు దాహార్తి తీరుస్తోంది. నెల రోజులుగా బోరు పని చేయకపోవడం, తాగటానికి నీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చేతి పంపుకు మరమ్మతులు చేయాలి: వెంకటేశ్వర్లు**



మూడు గ్రామాల రైతులకు, కూలీలకు దాహం తీర్చే చేతి పంపు నెల రోజులుగా పని చేయటం లేదు. పొలం పనుల కోసం వచ్చిన వారికి తాగునీరు లేక అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు వెంటనే మరమ్మతులు చేయించాలి.

## జనసేన ఆధ్వర్యంలో అనాథలకు అన్నదానం


అనాథలకు అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న రవి

**నంద్యాల రూరల్:** జనసేన సేవాదళ్ వ్యవస్థాపకుడు, సినీ హీరో పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అనాథలకు, భిక్షాటన చేస్తున్న వారికి జనసేన సేవాదళ్ సభ్యుడు దాసరి రవి ఆధ్వర్యంలో అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వారోత్సవాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు సేవ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధు, సతీష్, సాయి, ఫణి, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

**చిన్నారులకు అన్నదానం**

జనసేన సేవాదళ్ కార్యకర్త పి.సుధాకర్ ఆధ్వర్యంలో మీరో పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలో భాగంగా పరివర్తన లైఫ్ సొసైటీ చిన్నారులకు కాస్మొటిక్స్, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అభిమాన సంఘాలు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల అభిమానాన్ని సంపాదించాలన్నారు. ప్రజాసేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాదం విజయ్(లిల్లి), ఆర్‌జీఎం ప్రభాకర్, గిరి, శంకర్, దీపక్, మన్సూర్ పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సేవాదళ్ సభ్యులు

**నంద్యాల టౌన్:** జనసేన సేవా దళ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా రెండో రోజు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. రోగులకు ఆపిల్, దానిమ్మ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేన సేవాదళ్ కార్యకర్తలు సేవా దృక్పథంతో రోగులకు పండ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సేవాదళ్ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాముడు, జగదీష్, చంటి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు ఉపాధ్యాయులకు సన్మానం

**పాణ్యం:** వృత్తి బాధ్యతతో పాటు సామాజిక సేవలందించిన ఐదుగురు ఉపాధ్యాయులను బుధవారం మద్దూరు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. మద్దూరు పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన సుదర్శన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రభాకర్, మల్లికార్జునరెడ్డి, లక్ష్మిఈశ్వరరెడ్డిలను దాత, గ్రామపెద్ద అన్నపురెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, చెట్ల పెంపకం, ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 34 మంది ఉపాధ్యాయుల బదిలీ


మాట్లాడుతున్న ఎంఈవో బ్రహ్మం

**గడివేముల:** గడివేముల మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులల్లో 34 మంది ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీ అవుతున్నట్లు గడివేముల ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయుల సంఘాల నాయకులతో బుధవారం ఎంఆర్‌సీ భవనంలో సమావేశమయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి సన్మానం చేయాలని తీర్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు సతీష్‌కుమార్, రవికుమార్, జగదీష్, మాధవరెడ్డి, జయప్రకాష్, రామిరెడ్డి, రవూఫ్, మహేశ్వర రెడ్డి, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## గడివేముల తహసీల్దార్ బదిలీ


తహసీల్దార్ నాగకళ్యాణిని సన్మానిస్తున్న దృశ్యం

**గడివేముల:** గడివేముల మండల తహసీల్దార్ నాగకళ్యాణి బుధవారం బదిలీ అయ్యారు. ఈమె సీసీఎల్ఏ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా ట్రైనింగ్ కోసం గడివేములకు వచ్చారు. ఆమె ట్రైనింగ్ కాలం పూర్తి కావడంతో తిరిగి తమ శాఖకు బదిలీ అయినట్లు నాగకళ్యాణి తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణలు తహసీల్దార్ నాగకళ్యాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటకృష్ణుడు, నాగేశ్వరరావు, ప్రభాకర్, హరిచంద్ర, మురళి, నాగేశ్వరరావు, సోఫీ సాహెబ్ పాల్గొన్నారు.

## 'పంచాయతీల జియోట్యాగింగ్ వేగవంతం చేయండి'

**గడివేముల:** పంచాయతీల జియోట్యాగింగ్‌ను వేగవంతం చేయాలని గడివేముల మండల ఈవోఆర్డీ జాస్లీన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం గడివేముల మండలంలో జియోట్యాగింగ్ 34.24 శాతం పూర్తయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీల్లో త్వరగా 100 శాతం చేరుకోవాలన్నారు. జియోట్యాగింగ్‌లో అలసత్వం వహిస్తే పంచాయతీ కార్యదర్శులకు మెమోలు ఇస్తామని ఆమె హెచ్చరించారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం


ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు రాజశేఖర్

**బండిఆత్మకూరు:** మండలంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్, శ్రీశైలం డివిజన్ గిరిజన సంఘం కార్యదర్శి నరసింహనాయక్, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రామచంద్రుడు కోరారు. బుధవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని పలు సమస్యలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నారపురెడ్డికుంట చెంచుల భూములకు సాగునీరు అందించాలని, ఓంకారం, నాయిని చెరువు చెంచుల భూములకు పట్టాలు ఇవ్వాలని, నెమిళ్లకుంట చెంచులకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బి.కోడూరు గ్రామంలో ఉన్న చెంచులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారేకాని స్థలాల కేటాయింపు జరగలేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, రత్నమయ్య, బాబు, సుభాన్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి: ఎంఈవో


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కోటయ్య

**పాణ్యం:** పాఠశాలలోని సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు. బుధవారం ఆయన కందికాయపల్లెలోని ఎంపీ యూపీ, తమ్మరాజుపల్లెలోని జడ్పీహెచ్ స్కూల్, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు వసతులు, పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. తమ్మరాజుపల్లె హైస్కూల్‌కు కాంపౌండ్, ప్రాథమిక పాఠశాలకు వంటగది లేవన్నారు. చెడిపోయిన తాగునీటి బోరును రెండు రోజుల్లో బోరు రిపేరీ చేయిస్తామన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎంలు తిరుపతయ్య, శివకర్ణుడు, యాగంటయ్య పాల్గొన్నారు.

## 'మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న మాణిక్యంరాజ్

**నంద్యాల:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో విజయవాడలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీజే మాణిక్యంరాజ్ పిలుపు నిచ్చారు. బుధవారం శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యంరాజ్ మాట్లాడుతూ స్వయంపోషక స్వతంత్ర పాఠశాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ యాజమాన్యాల దోపిడీపై ప్రశ్నించే హక్కును కోల్పోతారని అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల విధులకు హాజరైన జూపాడుబంగ్లా మండలం తరిగోపులలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న చక్రపాణి చనిపోయాడని, వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు రామకృష్ణయ్య, ఇద్రూస్‌బాషా, తిమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ‘అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండండి’

**పత్తికొండ:** అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సాధ్యమైనంత త్వరగా సంఘటన స్థలానికి చేరుకుని నష్టాలను నివారించాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి జయన్న సూచించారు. బుధవారం ఆయన పత్తికొండ అగ్నిమాపక కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ అగ్నిమాపక శాఖాధికారి నరసప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించాలి: సీపీఎం

**దేవనకొండ:** హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా మండలంలోని 42 వేల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని పత్తికొండ సీపీఎం డివిజన్ కార్యదర్శి వీరశేఖర్, డివిజన్ నాయకులు శ్రీరాములు, దస్తగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తెర్నేకల్లు, కరివేముల, పొట్లపాడు, దేవనకొండ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 106 చెరువులకు నీరు నింపుతామని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. హంద్రీనీవాకు బడ్జెట్ ప్రతిపాదనలు పంపితే రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడం విచారకరమన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధి పేరుతో రూ. 1,600 కోట్లు కేటాయించారన్నారు. 2014 నుంచి 2016 వరకు వరుసగా మూడు సంవత్సరాలు రైతులు కరువుతో అల్లాడుతున్నారని, రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేసి ఆదుకోవాలన్నారు. వరుస కరువుతో అల్లాడుతున్న వ్యవసాయ కూలీలకు పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్, మండల నాయకులు ఎస్ఎం.కాశీం, సురేంద్ర, రంగస్వామి, పరమేష్, బడేసాబ్, శ్రీనివాసులు, షేక్‌బాషా, పులికొండ, మాబాషా తదితరులు పాల్గొన్నారు.



జీపుజాతాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

## ‘అర్హులందరికీ పక్కాగృహాలు’

**మద్దికెర:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పక్కాగృహాలు అర్హులందరికీ మంజూరు చేస్తామని తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో సుధాకర్‌రాజు, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వే ద్వారా పక్కాగృహాల కోసం అనేక మంది లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సెప్టెంబరు 5 నుంచి ఆయా గ్రామాల్లో వివిధ శాఖా అధికారులు లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. మండలానికి ఇప్పటికే 300 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. పక్కాగృహాల నిర్మాణానికి సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

ఎన్టీఆర్ గృహకల్పన కింద ప్రతి నిరుపేదకు ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహులు

## ‘అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి’

**పత్తికొండటౌన్:** పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, అభయ హస్తం పింఛన్ల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి పింఛన్ల సొమ్మును స్వాహా చేసిన ఈవోను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు గురుదాసు, మండల, పట్టణ కార్యదర్శులు కారన్న, సురేంద్ర, సహాయకార్యదర్శి నెట్టికంఠయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో వారు విలేఖర్లతో మాట్లాడుతూ గ్రామపంచాయతీలో జరిగిన ఫించన్ల అవినీతి అక్రమాల గురించి సమగ్ర ఆధారాలతో కలెక్టర్, డీఆర్డీఏ పీడీ అధికారులకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. పత్తికొండ గ్రామపంచాయతీలో సుమారు 2400లకు పైగా పింఛన్లు ఉంటే అందులో చనిపోయిన వారి పేర్లను తొలగించకుండా నెలనెలా అడ్డదారిని వందలాది మంది పింఛన్ల సొమ్మును ఈవో స్వాహా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికే ఫించన్ల అవినీతి అక్రమాలపై మండలస్థాయి అధికారులకు విన్నవించామని, అయితే ఇంత వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పత్తికొండ పంచాయతీలో జరిగిన ఫించన్ల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన ఈవోను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు తిమ్మయ్య, నరసింహులు, శ్రీనివాసులు, శివలింగడు తదితరులు పాల్గొన్నారు.

## ‘సదస్సుకు తరలిరండి’

**తుగ్గలి:** వైసీపీ ఆధ్వర్యంలో శనివారం పత్తికొండలో నిర్వహించే నవరత్నాల సదస్సుకు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ నగేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి కోరారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ సదస్సుకు కర్నూలు పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక, తాలూకా ఇన్‌చార్జి చెరుకులపాడు శ్రీదేవి, ప్రముఖ వైసీపీ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. సదస్సుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## హాకీ పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**దేవనకొండ:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో తెర్నేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని అందించారు. దీంతో ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు కలెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా ఆ పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీ వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు, సర్పంచ్ రాజన్న, విద్యా కమిటీ ఛైర్మన్ మాదన్న, ఉప సర్పంచ్ సత్యరాజు, గ్రామస్థులు అభినందించారు.




పతకాన్ని అందుకుంటున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

## 2 నుంచి ఉరుసు

**పత్తికొండ టౌన్:** పత్తికొండ పట్టణంలో చక్రాళ్ల రోడ్డులో వెలసిన హజ్రత్ ఫక్కుమియ్యా వలిసాహెబ్ ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు అల్లాబకాష్, ఇబ్రహీం, హుసేన్‌పీరా, వలి తెలిపారు. బుధవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలు ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈనెల 2న శనివారం గంధం, 3న ఆదివారం ఉరుసు, 4న సోమవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఆస్పరి శ్రీనివాసులు



ఆస్పరి శ్రీనివాసులును సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**పత్తికొండ టౌన్:** పత్తికొండ ప్రాంతానికి చెందిన ఆస్పరి శ్రీనివాసులు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శి కొనసాగుతున్న ఆస్పరి శ్రీనివాసులును బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అంజనేయనగర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా బీసీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రెటరీగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యదర్శి సీసీ రంగన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఓబయ్య, దండిమల్లికార్జున, రామాంజినేయులు, చంద్రశేఖర్, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆనందాచారి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీరా హుసేన్ పాల్గొన్నారు.

## ‘సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి’

**పత్తికొండ:** ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో స్వల్పకాలిక పంటల విత్తనాలు అందిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏవో రాజాకిశోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షపాతం సరిగా లేకపోవడంతో చాలా భూముల్లో రైతులు పంటలు సాగు చేయలేదన్నారు. అలాంటి రైతులు స్వల్పకాలిక పంటలైన సజ్జ, జొన్న, కొర్ర సాగు ఆసక్తి ఉన్న రైతులు సబ్సిడీ విత్తనాల కోసం కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. రైతులు ఇచ్చిన వివరాల మేరకు ఎంపీఈవోలు కాని ఏఈవోలు సంబంధిత రైతుల పొలాలను పరిశీలించి పంటలు సాగుకు సర్టిఫై చేసిన వారికి ఈ సబ్సిడీ విత్తనాలు అందిస్తామన్నారు. ఒక్కో పాసుపుస్తకానికి కిలో ప్యాకెట్ సబ్సిడీ విత్తనాలు బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ విత్తనాలు అందిస్తామన్నారు. ఆసక్తిగల రైతులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

## ‘రాయితీ పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలి’

**మద్దికెర:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రబీలో సాగు చేసుకునేందుకు రాయితీ పప్పుశనగ విత్తనాలు వెంటనే మంజూరు చేయాలని మాజీ కో-ఆప్షన్ సత్తార్ కోరారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో నల్లరేగడి భూమి అధికంగా ఉందని తెలిపారు. ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయని, సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్నారని అన్నారు. రైతులకు వెంటనే రాయితీ విత్తనాలు ఇవ్వాలని తెలిపారు. సెప్టెంబరు మూడో వారం నుంచి విత్తనాలు వేయడానికి రైతులు సన్నద్ధం అవుతారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

## ‘వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి’

**మద్దికెర:** రైతులు వ్యవసాయాన్ని పాత పద్ధతిలో కాకుండా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు తీసుకుని సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని బనవాసి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నరసింహులు, ఏడీఏ నారాయణనాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారించవచ్చని తెలిపారు. ప్రతి రైతు పత్తిపంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పురుగుల నివారణ చేయవచ్చునన్నారు. ఎకరాకు 10లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా ఉలవలు, కొర్రలు ఇస్తోందన్నారు. రైతులు ఏ పంట వేయకపోతే ఉలవలు సాగు చేయవచ్చునని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే వారు పట్టాదారు పాసుపుస్తకాన్ని తీసుకువచ్చి విత్తనాలు పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిప్సం కూడా నిల్వ ఉందని, ఎకరాకు 4 బ్యాగ్‌లు చొప్పున ఇస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు కూడా తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి కిరణ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

## ‘అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృత హస్తం’

**మద్దికెర:** ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలు చేయడం హర్షించదగ్గ విషయమని జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తంచౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీ నిధులతో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ సామాన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో ఎలాంటి అవినీతి జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్ బోధన ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటవర్మ, కార్యదర్శి బొఖారియా పాల్గొన్నారు.

## 'అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండండి'

**పత్తికొండ:** అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సాధన్యమైనంత త్వరగా సంఘటన స్థలానికి చేరుకుని నష్టాలను నివారించాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి జయన్న సూచించారు. బుధవారం ఆయన పత్తికొండ అగ్నిమాపక కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ అగ్నిమాపక శాఖాధికారి నరసప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించాలి: సీపీఎం


జీపుజాతాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**దేవనకొండ:** హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా మండలంలోని 42 వేల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని పత్తికొండ సీపీఎం డివిజన్ కార్యదర్శి వీరశేఖర్, డివిజన్ నాయకులు శ్రీరాములు, దస్తగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తెర్నేకల్లు, కరివేముల, పొట్లపాడు, దేవనకొండ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 106 చెరువులకు నీరు నింపుతామని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. హంద్రీనీవాకు బడ్జెట్ ప్రతిపాదనలు పంపితే రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడం విచారకరమన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధి పేరుతో రూ. 1,600 కోట్లు కేటాయించారన్నారు. 2014 నుంచి 2016 వరకు వరుసగా మూడు సంవత్సరాలు రైతులు కరువుతో అల్లాడుతున్నారని, రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేసి ఆదుకోవాలన్నారు. వరుస కరువుతో అల్లాడుతున్న వ్యవసాయ కూలీలకు పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్, మండల నాయకులు ఎస్ఎం.కాశీం, సురేంద్ర, రంగస్వామి, పరమేష్, బడేసాబ్, శ్రీనివాసులు, షేక్‌బాషా, పులికొండ, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

# 'అర్హులందరికీ పక్కాగృహాలు'


మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహులు

**మద్దికెర:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పక్కాగృహాలు అర్హులందరికీ మంజూరు చేస్తామని తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో సుధాకర్‌రాజు, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వే ద్వారా పక్కాగృహాల కోసం అనేక మంది లబ్ది దారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సెప్టెంబరు 5 నుంచి ఆయా గ్రామాల్లో వివిధ శాఖా అధికారులు లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. మండలానికి ఇప్పటికే 300 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. పక్కాగృహాల నిర్మాణానికి సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

ఎన్టీఆర్ గృహకల్పన కింద ప్రతి నిరుపేదకు ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## హాకీ పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



పతకాన్ని అందుకుంటున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

**దేవనకొండ:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో తెర్నేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని అందించారు. దీంతో ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు కలెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా ఆ పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీ వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు, సర్పంచ్ రాజన్న, విద్యా కమిటీ చైర్మన్ మాదన్న, ఉప సర్పంచ్ సత్యరాజు, గ్రామస్థులు అభినందించారు.

## 'అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి'

**పత్తికొండటౌన్:** పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, అభయ హస్తం పింఛన్ల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి పింఛన్ల సొమ్మును స్వాహా చేసిన ఈవోను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు గురుదాసు, మండల, పట్టణ కార్యదర్శులు కారన్న, సురేంద్ర, సహాయకార్యదర్శి నెట్టికంఠయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో వారు విలేఖర్లతో మాట్లాడుతూ గ్రామపంచాయతీలో జరిగిన ఫించన్ల అవినీతి అక్రమాల గురించి సమగ్ర ఆధారాలతో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ అధికారులకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. పత్తికొండ గ్రామపంచాయతీలో సుమారు 2400లకు పైగా పింఛన్లు ఉంటే అందులో చనిపోయిన వారి పేర్లను తొలగించకుండా నెలనెలా అడ్డదారిని వందలాది మంది పింఛన్ల సొమ్మును ఈవో స్వాహా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికే ఫించన్ల అవినీతి అక్రమాలపై మండలస్థాయి అధికారులకు విన్నవించామని, అయితే ఇంత వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పత్తికొండ పంచాయతీలో జరిగిన ఫించన్ల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన ఈవోను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు తిమ్మయ్య, నరసింహులు, శ్రీనివాసులు, శివలింగడు తదితరులు పాల్గొన్నారు.

## 'సదస్సుకు తరలిరండి'

**తుగ్గలి:** వైసీపీ ఆధ్వర్యంలో శనివారం పత్తికొండలో నిర్వహించే నవరత్నాల సదస్సుకు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ నగేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి కోరారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ సదస్సుకు కర్నూలు పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక, తాలూకా ఇన్‌చార్జి చెరుకులపాడు శ్రీదేవి, ప్రముఖ వైసీపీ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. సదస్సుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## 2 నుంచి ఉరుసు

**పత్తికొండ టౌన్:** పత్తికొండ పట్టణంలో చక్రాళ్ల రోడ్డులో వెలసిన హజ్రత్ ఫక్కుమియ్యా వలిసాహెబ్ ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు అల్లాబకాష్, ఇబ్రహీం, హుసేన్‌పీరా, వలి తెలిపారు. బుధవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలు ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈనెల 2న శనివారం గంధం, 3న ఆదివారం ఉరుసు, 4న సోమవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## 'సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి'

**పత్తికొండ:** ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో స్వల్పకాలిక పంటల విత్తనాలు అందిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏవో రాజాకిశోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షపాతం సరిగా లేకపోవడంతో చాలా భూముల్లో రైతులు పంటలు సాగు చేయలేదన్నారు. అలాంటి రైతులు స్వల్పకాలిక పంటలైన సజ్జ, జొన్న, కొర్ర సాగు ఆసక్తి ఉన్న రైతులు సబ్సిడీ విత్తనాల కోసం కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. రైతులు ఇచ్చిన వివరాల మేరకు ఎంపీఈవోలు కాని ఏఈవోలు సంబంధిత రైతుల పొలాలను పరిశీలించి పంటలు సాగుకు సర్టిఫై చేసిన వారికి ఈ సబ్సిడీ విత్తనాలు అందిస్తామన్నారు. ఒక్కో పాసుపుస్తకానికి కిలో ప్యాకెట్ సబ్సిడీ విత్తనాలు బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ విత్తనాలు అందిస్తామన్నారు. ఆసక్తిగల రైతులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

## 'వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి'

**మద్దికెర:** రైతులు వ్యవసాయాన్ని పాత పద్ధతిలో కాకుండా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు తీసుకుని సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని బనవాసి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నరసింహులు, ఏడీఏ నారాయణనాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారించవచ్చని తెలిపారు. ప్రతి రైతు పత్తిపంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పురుగుల నివారణ చేయవచ్చునన్నారు. ఎకరాకు 10లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా ఉలవలు, కొర్రలు ఇస్తోందన్నారు. రైతులు ఏ పంట వేయకపోతే ఉలవలు సాగు చేయవచ్చునని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే వారు పట్టాదారు పాసుపుస్తకాన్ని తీసుకువచ్చి విత్తనాలు పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిప్సం కూడా నిల్వ ఉందని, ఎకరాకు 4 బ్యాగ్‌లు చొప్పున ఇస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు కూడా తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి కిరణ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

## 'రాయితీ పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలి'

**మద్దికెర:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రబీలో సాగు చేసుకునేందుకు రాయితీ పప్పుశనగ విత్తనాలు వెంటనే మంజూరు చేయాలని మాజీ కో-ఆప్షన్ సత్తార్ కోరారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో నల్లరేగడి భూమి అధికంగా ఉందని తెలిపారు. ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయని, సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్నారని అన్నారు. రైతులకు వెంటనే రాయితీ విత్తనాలు ఇవ్వాలని తెలిపారు. సెప్టెంబరు మూడో వారం నుంచి విత్తనాలు వేయడానికి రైతులు సన్నద్ధం అవుతారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

## బీసీ సంక్షేమ సంఘం
## రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఆస్పరి శ్రీనివాసులు


ఆస్పరి శ్రీనివాసులును సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**పత్తికొండ టౌన్:** పత్తికొండ ప్రాంతానికి చెందిన ఆస్పరి శ్రీనివాసులు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శి కొనసాగుతున్న ఆస్పరి శ్రీనివాసులును బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అంజనేయనగర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా బీసీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రెటరీగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యదర్శి సీసీ రంగన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఓబయ్య, దండిమల్లికార్జున, రామాంజినేయులు, చంద్రశేఖర్, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆనందాచారి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీరా హుసేన్ పాల్గొన్నారు.

## 'అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృత హస్తం'

**మద్దికెర:** ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలు చేయడం హర్షించదగ్గ విషయమని జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తంచౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీ నిధులతో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ సామాన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో ఎలాంటి అవినీతి జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్ బోధన ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటవర్మ, కార్యదర్శి బొఖారియా పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి'

**ఎమ్మిగనూరు టౌన్:** పట్టణంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకుడు నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మహిళలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోని డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, ప్రభాకర్, జయశేఖర్, చిన్న, శివ, వెంకటేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

# తాగునీటికి కట..కట..

- పైపులైన్‌లో సమస్యలు..
- పాతిక రోజులుగా కొళాయిలు బంద్
- శ్మశాన బోరును ఆశ్రయిస్తున్న గ్రామస్తులు

**నందవవరానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ వాల్వ్ పనిచేయకపోవటంతో తాగునీటి ససమ్య ఏర్పడింది. పరిష్కరించాల్సిన సర్పంచ్, అధికారులు పట్టించుకోకపోవటంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు.**



నీటి సరఫరా బంద్ అయిన కొళాయి

**నందవరం:** మండల కేంద్రంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా కాలం పోయి వర్షాకాలం వచ్చినా తాగునీటికి ఇబ్బం దులు తప్పటం లేదు. తాగునీటిని సరఫరా చేసే తిమ్మారెడ్డి కుంటలో నీరున్నా పైపులైన్ ద్వారా సరఫరాచేసే వాల్వ్ పనిచేయటం లేదు. వెంటనే పరిశీలించి సరిచేయాల్సిన సర్పంచ్, అధికారులు పట్టిచుకోక పోవటంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతిక రోజులుగా కొళాయిలకు నీటి సరఫరాను బంద్‌చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్థులు శ్మశానం వద్ద ఏర్పాటు చేసిన బోరును ఆశ్రయిస్తున్నారు.

జనాల అగచాట్లు

నందవరంలోని తెలుగు గేరి, బోయగేరి ప్రాంతాల్లో దాదాపు తొమ్మిది తాగునీటి కొళాయిలు బంద్ కావడంతో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. పైపులైన్లు పరిశీలించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

### తాగునీటిని కొంటున్న గ్రామస్థులు

శ్మశాసనం వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోలేని ప్రజలు రూ.10 వెచ్చించి బిందెడు నీరును కొని తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంతో పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనీ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### సర్పంచ్ పట్టించుకోవడం లేదు



కాలనీలో తాగునీటి సమస్య ఉందని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. సమస్యను పరిష్కరించకపోటంతో ఇబ్బది తప్పటం లేదు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తాగునీరందించాలి.

**- శ్రీనివాసులు, నందవరం**

### శ్మశాన బోరే దిక్కు



శ్మశానానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన బోరింగే ప్రస్తుతం మాకు దిక్కు. ఇంట్లో అవసరాల కోసమే ఆ బోరింగు నీళ్ల పనికివస్తాయి. తాగడానికి బిందెడు నీళ్ల రూ.10 పెట్టి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

**- లక్ష్మన్న, నందవరం**



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : పీడీఎస్‌యూ

**ఎమ్మిగనూరు టౌన్:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో ఓబులేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా మహేంద్రబాబు విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజ్‌రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నాభోజన పథకంలో విద్యార్థులకు సన్న బియ్యం అందించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద విద్యార్థులు చదువుతున్నారని విద్యార్థులందరికీ మధ్యాహ్నాభోజన పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, రాజేష్, లక్ష్మన్న, ధనంజయ్య, రంగప్ప, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'డిటెన్షన్ అమలును విరమించుకోవాలి'



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

**గోనెగండ్ల:** ప్రభుత్వం 5,8వ తరగతుల్లో ప్రవేశ పెట్టిన డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, శేఖర్‌బాబు డిమాండ్ చేశారు. ఈ విధానం అమలు చేయడం వల్ల ప్రతి మండలంలో డ్రాపవుట్ శాతం పెరుగు తనిన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో చదువుకోలేక ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికే దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశించే వారి శాతం రోజురోజుకూ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం అమలైతే గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు చదువుకు దూరమై నిరక్షరాశ్యత శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగన్న, పాల్, విజయ్, జిక్రియా, కుమార్, రామచంద్ర పాల్గొన్నారు.

# మొక్కలపై మక్కువ..

**మొక్కలు పెంచేందుకు ఉత్సాహం చూపుతున్న ప్రజలు**

**ఎమ్మిగనూరు టౌన్:** మనం ప్రకృతిని ప్రేమిస్తే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందన్న కవి స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకున్నారో..లేక అందరు తమ ఇళ్లల్లో మొక్కలు పెంచాలన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆశయాన్ని ప్రేరణగా తీసుకున్నారో గాని ప్రజలు మొక్కలు పెంచేందుకు ఉత్సాకత చూపుతున్నారు. తమకు ఉన్న ఉకొద్దిపాటి స్థలంలో పూల మొక్కలైనా పెంచుకోవాలని పట్టణ ప్రజలు నర్సరీలలో తమకు కావలసినవి తీసుకెళుతున్నారు.

### పట్టణంలో నర్సరీలు..

ఎమ్మిగనూరు పట్టణంలో కొందరు నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పూలమొక్కలతో పాటు ఇతర మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇళ్ల ప్రాంగణంలో పూలమొక్కలు పెంచుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగిందనేది వాస్తవం. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు కొద్దిపాటి స్థలం ఉండేలా చూసుకొని ఆ స్థలంలో పూలమొక్కలు, పండ్ల మొక్కలు, ఆకు కూరలు, కాయగూరలు వంటి మొక్కలను పెంచుతున్నారు. దీంతో పూల మొక్కలు అమ్మకాలు సైతం ఊపందుకున్నాయి. మొక్కలను నాటేందుకు కొనుగోలు దారులు ఆసక్తికనబరుస్తున్నారు. ఆయా మొక్కలను కొనుగోలు చేసేవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.



అమ్మకానికి ఉంచిన వివిధ రకాల పూల మొక్కలు

### ఎన్నో రకాలు

పూలమొక్కల్లో బెంగళూరు హైబ్రీడ్ చామంతి, కోలకత్తా గులాబీలు, నాటుగులాబిలు, హైబ్రీడ్ మందారాలు, ఇండోర్ మందారాలు, సెంట్ నందివర్ధనాలు, రెడ్,నైట్, గోల్డ్‌స్పాట్, బోన్‌సాయ్ తదితర మొక్కలు అందుబాటు ధరలలో లభిస్తున్నాయి.



## 'కట్టమంచి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి'

**గోనెగండ్ల:** కర్నూలులోని కట్టమంచి పాఠశాల గుర్తింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 19న ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని ప్రీతిబాయ్ మరణానికి పాఠశాల యజమాన్యమే కారణమన్నారు. వారు పెట్టే మానసిక బాధలు భరించలేకే ఆమె ఆత్మహత్య చేసుకుదని ఆరోపించారు. విద్యార్థినికి న్యాయం చేయాని కోరిన విద్యార్థి సంఘాల నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సురేంద్ర, ఉపేంద్ర, రసూల్, షాషావలి పాల్గొన్నారు.

## హెచ్. కైరవాడిలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**గోనెగండ్ల:** మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో మైసూల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఓబీహెచ్ఎస్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించుకుంటే 50శాతం రాయితీ అందజేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో రవిబాబు, రఘు, కుమార్ పాల్గొన్నారు.

## 'ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం'



హర్షం వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు

**ఎమ్మిగనూరు టౌన్:** ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యుల హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గ్రంది వెంకటగిరి, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల సమావేశం నిర్వహించారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ తీసుకరావడంలో రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, మంత్రి సిద్ధారాఘవరావు, ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి అధ్యక్షుడు టీజీ భరత్ విశేషంగా కృషి చేశారని కొనియా డారు. ఆర్యవైశ్యుల్లో అనేక మంది పేదవాళ్లు ఉన్నారని, వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ప్రతాప్ వీరేష్‌శెట్టి, గుర్రేవుల కౌసిక్, సందిప్‌కుమార్ పాల్గొన్నారు.

## 'జగ్గాపురం రహదారి నిర్మాణానికి నిధులు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**నందవరం:** మండలంలోని జగ్గాపురం ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ చిన్న నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చినుకు పడితే చిత్తడే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి స్పందించి రహదారి నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. వచ్చే నెలలో భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ లక్ష్మీదేవి, జగ్గాపురం గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, ఆంజనయ్య, గోపాల్‌లు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి'

**ఎమ్మిగనూరు టౌన్:** పట్టణంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకుడు నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మహిళలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోని డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, ప్రభాకర్, జయశేఖర్, చిన్న, శివ, వెంకటేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

# తాగునీటికి కట..కట..

● పైపులైన్‌లో సమస్యలు..
● పాతిక రోజులుగా కొళాయిలు బంద్
● శ్మశాన బోరును ఆశ్రయిస్తున్న గ్రామస్తులు

**నందవవరానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ వాల్వ్ పనిచేయకపోవటంతో తాగునీటి ససమ్య ఏర్పడింది. పరిష్కరించాల్సిన సర్పంచ్, అధికారులు పట్టించుకోకపోవటంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు.**


నీటి సరఫరా బంద్ అయిన కొళాయి

**నందవరం:** మండల కేంద్రంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా కాలం పోయి వర్షాకాలం వచ్చినా తాగునీటికి ఇబ్బం దులు తప్పటం లేదు. తాగునీటిని సరఫరా చేసే తిమ్మారెడ్డి కుంటలో నీరున్నా పైపులైన్ ద్వారా సరఫరాచేసే వాల్వ్ పనిచేయటం లేదు. వెంటనే పరిశీలించి సరిచేయాల్సిన సర్పంచ్, అధికారులు పట్టిచుకోకపోవటంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతిక రోజులుగా కొళాయిలకు నీటి సరఫరాను బంద్‌చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్థులు శ్మశానం వద్ద ఏర్పాటు చేసిన బోరును ఆశ్రయిస్తున్నారు.

జనాల అగచాట్లు

నందవరంలోని తెలుగు గేరి, బోయగేరి ప్రాంతాల్లో దాదాపు తొమ్మిది తాగునీటి కొళాయిలు బంద్ కావడంతో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. పైపులైన్లు పరిశీలించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

### తాగునీటిని కొంటున్న గ్రామస్థులు

శ్మశానం వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోలేని ప్రజలు రూ.10 వెచ్చించి బిందెడు నీరును కొని తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంతో పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనీ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

**సర్పంచ్ పట్టించుకోవడం లేదు**



కాలనీలో తాగునీటి సమస్య ఉందని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. సమస్యను పరిష్కరించకపోటంతో ఇబ్బది తప్పటం లేదు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తాగునీరందించాలి.

**- శ్రీనివాసులు, నందవరం**

**శ్మశాన బోరే దిక్కు**



శ్మశానానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన బోరింగే ప్రస్తుతం మాకు దిక్కు. ఇంట్లో అవసరాల కోసమే ఆ బోరింగు నీళ్ల పనికివస్తాయి. తాగడానికి బిందెడు నీళ్ల రూ.10 పెట్టి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

**- లక్ష్మన్న, నందవరం**


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : పీడీఎస్‌యూ

**ఎమ్మిగనూరు టౌన్:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో ఓబులేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా మహేంద్రబాబు విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజ్‌రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నభోజన పథకంలో విద్యార్థులకు సన్న బియ్యం అందించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద విద్యార్థులు చదువుతున్నారని విద్యార్థులందరికీ మధ్యాహ్నభోజన పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, రాజేష్, లక్ష్మన్న, ధనంజయ్య, రంగప్ప, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'డిటెన్షన్ అమలును విరమించుకోవాలి'


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

**గోనెగండ్ల:** ప్రభుత్వం 5,8వ తరగతుల్లో ప్రవేశ పెట్టిన డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, శేఖర్‌బాబు డిమాండ్ చేశారు. ఈ విధానం అమలు చేయడం వల్ల ప్రతి మండలంలో డ్రాపవుట్ శాతం పెరుగు తనిన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో చదువుకోలేక ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికే దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశించే వారి శాతం రోజురోజుకూ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం అమలైతే గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు చదువుకు దూరమై నిరక్షరాశ్యత శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగన్న, పాల్, విజయ్, జిక్రియా, కుమార్, రామచంద్ర పాల్గొన్నారు.

# మొక్కలపై మక్కువ..

**మొక్కలు పెంచేందుకు ఉత్సాహం చూపుతున్న ప్రజలు**

**ఎమ్మిగనూరు టౌన్:** మనం ప్రకృతిని ప్రేమిస్తే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందన్న కవి స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకున్నారో..లేక అందరు తమ ఇళ్లల్లో మొక్కలు పెంచాలన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆశయాన్ని ప్రేరణగా తీసుకున్నారో గాని ప్రజలు మొక్కలు పెంచేందుకు ఉత్సాకత చూపుతున్నారు. తమకు ఉన్న ఉకొద్దిపాటి స్థలంలో పూల మొక్కలైనా పెంచుకోవాలని పట్టణ ప్రజలు నర్సరీలలో తమకు కావలసినవి తీసుకెళుతున్నారు.

### పట్టణంలో నర్సరీలు..

ఎమ్మిగనూరు పట్టణంలో కొందరు నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పూలమొక్కలతో పాటు ఇతర మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇళ్ల ప్రాంగణంలో పూలమొక్కలు పెంచుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగిందనేది వాస్తవం. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు కొద్దిపాటి స్థలం ఉండేలా చూసుకొని ఆ స్థలంలో పూలమొక్కలు, పండ్ల మొక్కలు, ఆకు కూరలు, కాయగూరలు వంటి మొక్కలను పెంచుతున్నారు. దీంతో పూల మొక్కలు అమ్మకాలు సైతం ఊపందుకున్నాయి. మొక్కలను నాటేందుకు కొనుగోలు దారులు ఆసక్తికనబరుస్తున్నారు. ఆయా మొక్కలను కొనుగోలు చేసేవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.


అమ్మకానికి ఉంచిన వివిధ రకాల పూల మొక్కలు

### ఎన్నోరకాలు

పూలమొక్కల్లో బెంగళూరు హైబ్రీడ్ చామంతి, కోలకత్తా గులాబీలు, నాటుగులాబిలు, హైబ్రీడ్ మందారాలు, ఇండోర్ మందారాలు, సెంట్ నందివర్ధనాలు, రెడ్‌నైట్, గోల్డ్‌స్పాట్, బోన్‌సాయ్ తదితర మొక్కలు అందుబాటు ధరలలో లభిస్తున్నాయి.



## 'కట్టమంచి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి'

**గోనెగండ్ల:** కర్నూలులోని కట్టమంచి పాఠశాల గుర్తింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 19న ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని ప్రీతిబాయ్ మరణానికి పాఠశాల యజమాన్యమే కారణమన్నారు. వారు పెట్టే మానసిక బాధలు భరించలేకే ఆమె ఆత్మహత్య చేసుకుదని ఆరోపించారు. విద్యార్థినికి న్యాయం చేయాని కోరిన విద్యార్థి సంఘాల నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సురేంద్ర, ఉపేంద్ర, రసూల్, షాషావలి పాల్గొన్నారు.

## హెచ్. కైరవాడిలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**గోనెగండ్ల:** మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో మైసూల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఓబీహెచ్ఎస్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించుకుంటే 50శాతం రాయితీ అందజేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో రవిబాబు, రఘు, కుమార్ పాల్గొన్నారు.

## 'ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం'


హర్షం వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు

**ఎమ్మిగనూరు టౌన్:** ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యుల హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గ్రంది వెంకటగిరి, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల సమావేశం నిర్వహించారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ తీసుకరావడంలో రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, మంత్రి సిద్ధారాఘవరావు, ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి అధ్యక్షుడు టీజీ భరత్ విశేషంగా కృషి చేశారని కొనియా డారు. ఆర్యవైశ్యుల్లో అనేక మంది పేదవాళ్లు ఉన్నారని, వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ప్రతాప్ వీరేష్‌శెట్టి, గుర్రేవుల కౌసిక్, సందిప్‌కుమార్ పాల్గొన్నారు.

## 'జగ్గాపురం రహదారి నిర్మాణానికి నిధులు'

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

**నందవరం:** మండలంలోని జగ్గాపురం ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ చిన్న నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చినుకు పడితే చిత్తడే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి స్పందించి రహదారి నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. వచ్చే నెలలో భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ లక్ష్మీదేవి, జగ్గాపురం గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, ఆంజనయ్య, గోపాల్‌లు పాల్గొన్నారు.